సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 174

శుక్రవారం 10-3-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



అహ్మదాబాద్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య ప్రారంభమైన నాలుగో టెస్టు తొలి రోజు ఆటకు ఇరు దేశాల ప్రధానమంత్రులు మోదీ, అల్బనీస్ హాజరయ్యారు. మైదానంలో ప్రత్యేక వాహనంలో కలియతిరిగిన అనంతరం ప్రెసిడెంట్స్ బాక్స్ నుంచి మ్యాచ్‌ను వీక్షించారు.

- 13లో



కవ్వింపులకు దిగితే సమరమే!

మోదీ హయాంలో పాకిస్తాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశముందని అమెరికా నిఘా వర్గాలు అంచనా వేశాయి.

వివరాలు 6లో ▸



గవర్నర్లకు నోరు తప్ప చెవుల్లేవు

గవర్నర్లకు మాట్లాడడానికి నోరు ఉందే తప్ప.. వినడానికి చెవుల్లేవంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శించారు.

వివరాలు 6లో ▸



సిసోడియాను అరెస్ట్ చేసిన ఈడీ

మద్యం పాలసీ అవకతవకల కేసులో సీబీఐ కస్టడీలో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను ఈడీ అరెస్ట్ చేసింది.

వివరాలు 6లో ▸



డిమెన్షియా.. డేంజర్ బెల్స్

2050కల్లా భారత్‌లో డిమెన్షియా కేసులు విపరీతంగా పెరిగిపోతాయని ఎయిమ్స్ పరిశోధనాకారులు వెల్లడించారు.

వివరాలు 6లో ▸

'డిజిటల్' అంతరాలు!

దేశంలో పేదలు-పెద్దల మధ్య పెరిగిన వ్యత్యాసం

గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల వెనుకబాటు

- డిజిటల్ డివైస్‌ల లభ్యత మహిళలకు తక్కువే
- మొబైళ్లలో 15 శాతం, ఇంటర్నెట్ వినియోగంలో మహిళలు 33 శాతం వెనుకంజ
- గ్రామాల్లో 31 శాతం, పట్టణాల్లో 67% ఇంటర్నెట్ వినియోగం
- మహారాష్ట్ర, గోవా, కేరళలో ఇంటర్నెట్ వాడకం అత్యధికం
- బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో అత్యల్పం
- విద్యాసంస్థల్లో ఇంటర్నెట్, కంప్యూటర్ల వినియోగం తక్కువే
- అంతర్జాతీయ ఈ–పార్టిసిపేషన్ ఇండెక్స్‌లో భారత్‌ది 105వ స్థానం
- ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో డిజిటల్ గ్యాడ్జెట్ల వినియోగం ఊపందుకున్న తరువాత కులం, మతం, లింగం, తరగతి, భౌగోళిక ప్రాంతాల వారీగా అసమానతలు పెరుగుతున్నట్లు స్వచ్ఛంద సంస్థ ఆక్స్‌ఫామ్ ఇండియా డిజిటల్ డివైడ్ నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో విద్యార్థుల చదువుల కోసం ఇంటర్నెట్, కంప్యూటర్ వాడకం తక్కువగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియా ఎకానమీ' నిర్వహించిన ఇంటింటి సర్వే డేటాను విశ్లేషించి పలు కీలక అంశాలను వెల్లడించింది. పురుషులతో పోలిస్తే దేశంలో కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ సదుపాయాలు మహిళలకు తక్కువగా అందుబాటులో ఉన్నట్లు నివేదిక పేర్కొంది. మొబైల్ ఫోన్ల అందుబాటు, వినియోగంలో

మిగతా 2వ పేజీలో ▶

ఏపీలో డిజిటల్ విప్లవం

- రాష్ట్ర విద్యారంగంలో సమూల మార్పులు.. స్మార్ట్ క్లాస్‌లతో పాటు విద్యార్థులకూ ట్యాబ్‌లు
- ప్రభుత్వ సేవలందించే వారికి స్మార్ట్ ఫోన్లు
- డిజిటలైజేషన్‌తో అవినీతికి తావులేకుండా ప్రజలకు లబ్ధి
- ప్రతి రంగానికీ టెక్నాలజీని జోడిస్తున్న సర్కారు

2లో

ఎవరికీ భయపడేది లేదు

- దేవుడు, సత్యం, న్యాయం మావైపే
- రేపు ఈడీ విచారణకు హాజరవుతా
- అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తాం
- ఈడీ నోటీసులపై ఎమ్మెల్సీ కవిత
- విపక్షాలను వేధించడమే నరేంద్ర మోదీ ప్రభుత్వ లక్ష్యం
- తెలంగాణ మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంలో వంద కోట్ల రూపాయల ముడుపుల వ్యవహారం తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లిక్కర్ స్కామ్‌లో నోటీసులు జారీ చేయడంతో రాజకీయంగా దుమారం రేగుతోంది. దీనిపై భారత్ జాగృతి దీక్ష (మహిళా రిజర్వేషన్లు) కోసం ఢిల్లీ వెళ్లిన ఎమ్మెల్సీ కవిత మోదీ ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. 'యతో ధర్మః.. తతో జయః.. దేవుడు మా వెంటే

మిగతా 10వ పేజీలో ▶

గుర్తింపు తెచ్చేలా అంబేడ్కర్ స్మృతివనం

- విజయవాడకు ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా నిర్మాణాలు
- పనులు నాణ్యతతో ఉండాలి
- కన్వెన్షన్ సెంటర్ అత్యంత ప్రధానం.. అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశం


2లో

'కాగ్' నివేదికలోనూ.. 'స్కిల్' సిత్రాలు

- ప్రాజెక్టు రూ.370 కోట్లు.. చూపింది రూ.3,300 కోట్లు
- ప్రభుత్వ వాటా 10 శాతం కింద రూ.37 కోట్లు అడ్వాన్స్ ఇవ్వాలి.. కానీ, టీడీపీ సర్కార్ విడుదల చేసింది రూ.370 కోట్లు
- అలా రూ.333 కోట్లు కొల్లగొట్టారు
- దీనికి రూ.22 కోట్ల వడ్డీ నష్టం అదనం
- వెరసి ఖజానాకు రూ.355 కోట్ల మేర గండి
- ప్రాజెక్టులో కాలేజీలకు భాగస్వామ్యమే లేదు
- ఇదీ చంద్రబాబు ప్రభుత్వ దోపిడీ 'స్కిల్'

14లో

సీఎం వైఎస్ జగన్ అందజేసిన బీ-ఫారాలతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు



నామినేషన్ల కోలాహలం

రాష్ట్ర శాసనమండలిలో ఈ నెలాఖరుకు ఖాళీ అవుతున్న ఎమ్మెల్యేల కోటాలోని ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జయమంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, బొమ్మి ఇజ్రాయేల్, కోలా గురువులు, పోతుల సునీత, పెనుమత్స వరాహవెంకటసూర్యనారాయణరాజు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించారు. అంతకుముందు వీరికి వైఎస్సార్‌సీపీ అధినేత సీఎం జగన్ బీ–ఫారాలను అందజేశారు.

10లో

పైశాచికత్వంపై కొరడా!

పిల్లల పోర్న్ వీడియోల షేరింగ్‌పై పోలీసుల ఆగ్రహం

- 26 జిల్లాల్లో 1,787 మందిపై కేసుల నమోదుకు చర్యలు
- ఇప్పటికే 680 మందిపై క్రిమినల్ కేసులు
- నేరం రుజువైతే పదేళ్ల జైలు.. రూ.10 లక్షల జరిమానా

10లో



నమామి.. గోదావరి!

- నదీ తీరాన పురాతన, సాంస్కృతిక విశేషాలను తేల్చే విస్తృత అధ్యయనం
- 'నమామి గంగ' తరహాలో విస్తృతంగా చేపట్టేందుకు ఇంటాక్ ప్రణాళిక.. నది పొడవునా తీరానికి ఐదు కిలోమీటర్ల బఫర్ ప్రాంతంలో స్టడీ
- మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీలలో నిర్వహణకు ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: గోదావరి నదీ తీరాన్ని తరిచి చూస్తే ఎన్నో ప్రత్యేకతలు కనిపిస్తాయి. స్థానికులకు తప్ప బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని ఆసక్తికర, ఆశ్చర్యకర విశేషాలు ఉంటాయి. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాల్లో 1,465 కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తూ దక్షిణ గంగగా పేరొందిన గోదావరి నదీ తీరంపై అధ్యయనం చేసేందుకు భారీ ప్రణాళిక సిద్ధమవుతోంది.

నమామి గంగ స్ఫూర్తితో..

ప్రపంచంలోని పెద్ద నదుల్లో ఒకటి, భారతీయులకు పవిత్రమైనదీ అయిన గంగా నదిపై 'ది ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్)' నాలుగేళ్లపాటు విస్తృత అధ్యయనాన్ని నిర్వహించింది. గంగా నది ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నమామి గంగ' ప్రాజెక్టులో భాగంగా.. కాలుష్య కోరల నుంచి నదిని రక్షించడం, నదీ తీరంలో విలసిల్లుతున్న ప్రత్యేకతలను ప్రపంచ దృష్టికి తేవడం కోసం ఈ అధ్యయనానికి ఆదేశించింది. ఇంటాక్ నిపుణులు బృందాలుగా విడిపోయి నదికి రెండు వైపులా ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రత్యేకతలపై అధ్యయనం చేసి డాక్యుమెంటరీలు రూపొందించారు. అధ్యయనం ఆధారంగా నాలుగు పుస్తకాలను కూడా ప్రచురించారు. నది ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక, సహజ వారసత్వాలపై శోధించి ఎన్నో వివరాలు వెలుగులోకి తెచ్చారు. గంగా నది మలుపులు తిరిగే ప్రాంతంలో ఏర్పడిన పాయలు ఏకంగా 20 కిలోమీటర్ల వెడల్పున ప్రవహిస్తూ ప్రత్యేక వెట్‌ల్యాండ్‌గా మారి.. జీవ వైవిధ్యాన్ని ఎలా పెంచుతున్నాయో ప్రత్యేక డాక్యుమెంటరీగా రూపొందించారు. గంగా తీరం అంటేనే ఆధ్యాత్మిక పరిమళం. మహాభారత, రామాయణాలతో ముడిపెట్టి స్థానికులు ప్రచారం చేసుకునే కొన్ని ప్రాంతాల్లో పురాతన నిర్మాణ జాడలను గుర్తించారు. ఇప్పుడు వాటిపై పరిశోధనలకు అవకాశం ఏర్పడింది. ఇక బుద్ధుడి కాలం నాటి ప్రత్యేకతలతోపాటు ఆది మానవుల నాటి నిర్మాణాలనూ గుర్తించారు.

గోదావరిపైనా అధ్యయనం కోసం..

దేశంలో గంగా నది తర్వాత పెద్ద నదిగా ఉన్న గోదావరిపై కూడా ఇలాంటి అధ్యయనం చేస్తే బాగుంటుందని ఇంటాక్ సంస్థ భావించింది. దీనిపై ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించగా.. అనుమతిస్తూ, అవసరమైన సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. తర్వాత ఇంటాక్ ప్రతినిధులు ఇటీవల తెలంగాణ అధికారులను కలిసి చర్చించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా నివేదించనున్నారు.

గంగానది తరహాలో చేస్తాం

కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు మేం గంగా నది పరీవాహక ప్రాంతాల్లో నాలుగేళ్ల పాటు చేసిన విస్తృత అధ్యయనంతో ఎన్నో రహస్యాలను వెలుగులోకి తెచ్చాం. అదే తరహాలో గోదావరి నది పరీవాహక ప్రాంతంలో కూడా సర్వే చేసేందుకు మేం ఆసక్తిగా ఉన్నాం.

- సుమేశ్ దుదాని, సైంటిస్ట్ ఆఫీసర్, ఇంటాక్

అందాల లోకానికి హాయి'వే'

జోరుగా అరకు-విశాఖ రోడ్డు అభివృద్ధి పనులు

- రూ.1.80 కోట్ల నిధులు విడుదల
- గోల్డ్‌స్టార్ కూడలి నుంచి బల్లుగూడ వరకు పనుల నిర్వహణ
- 65 కి.మీ మేర రోడ్డుకు కొత్తరూపు



విశాఖ-అరకు రహదారిలో సాగుతున్న మరమ్మతు పనులు

శృంగవరపుకోట: అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతోంది. సిగ్గులేని పచ్చనేతలు పైత్యంతో మాట్లాడుతున్నా పట్టించుకోకుండా ప్రాధాన్యత ప్రకారం పనులు చక్కబెడుతోంది. నాడు చంద్రబాబు సర్కారు నిస్సిగ్గుగా.. నిర్లజ్జగా...నిర్లక్ష్యంగా వదిలేసిన రోడ్లను నేటి సర్కారు భుజాలకెత్తుకుని పనులు చకచకా పూర్తిచేయిస్తోంది. దీనికి విశాఖ-అరకు రోడ్డే నిలువెత్తు నిదర్శనం.

రోడ్డు పాడైనా పట్టించుకోని చంద్రబాబు...

విశాఖ-అరకు రోడ్డులో లక్కవరపుకోట, సోంపురం వద్ద ఉన్న బ్రిడ్జిలకు కాలం చెల్లిపోయి, శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తబ్రిడ్జిల నిర్మాణం కోసం 2016లో ప్రతిపాదనలు చేస్తే 2017లో చంద్రబాబు ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. 2017 నవంబర్‌లో లక్కవరపుకోట వద్ద ఉన్న బ్రిడ్జిని కూల్చేసి కొత్తబ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసింది. నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. సోంపురం గెడ్డపై కొత్తబ్రిడ్జి ఊసేలేదు. లక్కవరపుకోట బ్రిడ్జి పనులను పూర్తిగా పట్టించుకోవడమే మానేశారు. దీంతో వాహన చోదకులు ఏళ్లతరబడి అవస్థలు పడ్డారు. ఇటీవల విశాఖ-అరకు రోడ్డు ఎన్‌హెచ్‌ఏకు బదలాయించడం, రోడ్డు పనుల అవసరాన్ని కేంద్ర ప్రభుత్వానికి జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు తెలియజేయడంతో బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.98 కోట్లు మంజూరు చేసింది.

జోరుగా మరమ్మతు పనులు..

విశాఖ-అరకు రోడ్డు మరమ్మతులకు రాష్ట్రప్రభుత్వం రూ.1.80 కోట్లు కేటాయించింది. ఓఆర్‌డీపీ వర్క్స్‌లో భాగంగా ప్రస్తుతం రోడ్డు మరమ్మతు పనులు జరుపుతోంది. లక్కవరపుకోట మండలంలో గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి అనంతగిరి మండల పరిధిలోని బల్లుగూడ వరకు ఉన్న 65 కి.మీ రోడ్డు పనులను పూర్తిచేస్తోంది. పనులు పూర్తయిన చోట రోడ్డుకు కొత్తరూపు వచ్చింది. అరకు అందాలను తిలకించేందుకు వెళ్లే పర్యాటకులు హాయిగా, ఆనందంగా ముందుకు సాగిపోతున్నారు.



ఎన్‌హెచ్ నిధులతో నిర్మాణంలో ఉన్న లక్కవరపుకోట బ్రిడ్జి

60 శాతం పనులు పూర్తి

విశాఖ–అరకు రహదారి మరమ్మతుల పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు చకచకా సాగుతున్నాయి. రోడ్డును పూర్తిస్థాయిలో బాగుచేస్తున్నాం. ప్యాచ్‌వర్క్స్ చేస్తూ రోడ్డు పూర్తిగా పాడైన చోట టాప్‌లేయర్ వేశాం. బ్రిడ్జి నిర్మాణం కూడా జరుగుతోంది.

- కె.వి.ఎల్.నరసింహారావు, డీఈఈ, విజయనగరం ఎన్‌హెచ్

న్యూస్‌రీల్

నిజాలకు మసిబొట్టు.. బాబు కోసం కనికట్టు



'మన చంద్రబాబు కాదు కదా.. వెయ్యండి బురద' అంటూ రామోజీ ప్రజల్లో విషం నింపే కార్యక్రమంలో ఇంకో అడుగు ముందుకేశారు. బొగ్గు కొనుగోలు టెండరులో అదానీ సంస్థ ఎల్–1గా నిలిచిందని ఒప్పుకుంటూనే.. అది తప్పన్నట్లు బురదజల్లారు.

వివరాలు 2 ▸


విచారణను రికార్డ్ చేయాలని ఆదేశించండి



సీబీఐ తనను శుక్రవారం విచారణకు హాజరు కావాలనడంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణను ఆడియో, వీడియో రికార్డు చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సీబీఐ అధికారుల విచారణను కొన్ని చానళ్లు, పత్రికలు చిలువలు పలువలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నాయని కోర్టుకు తెలిపారు.

వివరాలు 2 ▸

నేపాల్ అధ్యక్షుడిగా రామచంద్ర పౌడెల్



నేపాల్ కొత్త అధ్యక్షుడిగా రామచంద్ర పౌడెల్ ఎన్నికయ్యారు. రామచంద్రకు 214 మంది ఎంపీలు, 352 మంది ప్రావిన్షియల్ అసెంబ్లీ సభ్యుల ఓట్లు వచ్చాయి.

వివరాలు 6 ▸



బీజేపీయేతర రాష్ట్రాలన్నిటిలో కూడా అలానే ఉంది.. ప్రత్యేకంగా అక్కడే ఇలా జరుగుతుందనడం సరికాదు!

క్లుప్తంగా...

10 మంది పోలీసు అధికారులకు ఐపీఎస్ హోదా

- ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర హోంశాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన 10 మంది పోలీసు అధికారులకు ఐపీఎస్ హోదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2020కిగాను ఎనిమిదిమంది అధికారులు, 2021కిగాను ఇద్దరు అధికారులకు ఐపీఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర హోంశాఖ గురువారం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. వారిలో 2020 కన్ఫర్డ్ ఐపీఎస్ అధికారుల జాబితాలో ఉన్న బి.ఉమామహేశ్వర్‌పై ఉన్న ఓ క్రిమినల్ కేసును పరిష్కరించుకోవాలని పేర్కొంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయన ఉత్తర్వులు పొందాల్సి ఉంది. కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌ను అనుసరించి ఆ పోలీసు అధికారులకు ఐపీఎస్ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంది.

ఐపీఎస్ హోదా పొందిన పోలీసు అధికారులు

- **2020కి:** షేక్ షరీన్‌బేగం, కె.వి.మురళీకృష్ణ, కె.ఎం.మహేశ్వర రాజు, కె.శ్రీనివాసరావు, ఎస్.శ్రీధర్, కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్.వి.మాధవరెడ్డి.

(ఈ జాబితాలోనే బి.ఉమామహేశ్వర్ పేరు కూడా చేర్చారు. కానీ ఆయనపై ఉన్న క్రిమినల్ కేసును క్లియర్ చేసుకోవాల్సి ఉంది. అనంతరమే ఆయనకు ఐపీఎస్ హోదా కల్పిస్తారు.)

- **2021కి:** ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి, జి.శ్రీకాంత్.

ఉద్యోగినులపై వేధింపుల నివారణకు ఫిర్యాదుల కమిటీలు

- అన్ని శాఖల కార్యాలయాల్లో తప్పనిసరి
- ఉషశ్రీచరణ్, వాసిరెడ్డి పద్మ



సాక్షి, అమరావతి: మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపుల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మహిళల, బాలల, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు. మహిళా కమిషన్ ఆధ్వర్యంలో సచివాలయంలో గురువారం 'పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం -2013' అమలు తీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అన్ని శాఖాధిపతుల కార్యాలయాలతో పాటు ప్రైవేట్ కార్యాలయాల్లోనూ ఈ కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో మహిళల ఫిర్యాదులు చాలా తక్కువ స్థాయిలో నమోదవుతున్నాయన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ.. మహిళల భద్రత, సాధికారత సాధనలో దేశానికే ఆదర్శంగా ఏపీ నిలుస్తోందన్నారు.

ఏపీజీబీసీ చైర్మన్‌గా చందన నగేశ్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా చందన నగేశ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. నగేశ్ రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి చర్యలు చేపట్టాల్సిందిగా ఏపీజీబీసీ ఎండీని ఆదేశించారు.

కౌంటర్ దాఖలు చేయండి

- పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: పోలీసు కానిస్టేబుల్ పరీక్షలో ఎనిమిది ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఇచ్చారంటూ దాఖలైన వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును, రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్లను దేహదారుఢ్య పరీక్షలకు అనుమతి ఇచ్చే విషయంలో ప్రస్తుతదశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీచేయలేమని తెలిపింది. కౌంటర్‌ను పరిశీలించిన తరువాత మధ్యంతర ఉత్తర్వుల జారీ విషయాన్ని పరిశీలిస్తామంది. విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్ కానిస్టేబుల్ రాతపరీక్ష ప్రిలిమ్స్‌లో ఎనిమిది ప్రశ్నలకు సరైన జవాబులను నిర్ణయించలేదని, ఈ వ్యవహారాన్ని నిపుణుల కమిటీకి నివేదించడంతోపాటు తమను దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించేలా రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జలగం సహజ, మరో 79 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

గుర్తింపు తెచ్చేలా అంబేడ్కర్ స్మృతివనం

ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: ''రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం శాశ్వతమైన ప్రాజెక్టు.. పనులు కూడా అంతే నాణ్యతతో ఉండాలి'' అని అధికార యంత్రాంగాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ స్మృతివనం, సివిల్ వర్క్స్, సుందరీకరణ, 125 అడుగులతో రాజ్యాంగ నిర్మాత భారీ విగ్రహ నిర్మాణం పనుల్లో పురోగతిపై ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. విజయవాడ నగరానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా నిర్మాణాలు ఉండాలని సూచించారు. స్మృతివనంలో ఏర్పాటయ్యే కన్వెన్షన్ సెంటర్ కూడా అత్యంత ప్రధానమైనదని స్పష్టం చేశారు. నాణ్యత, సుందరీకరణకు ప్రాధాన్యమిస్తూ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని నిర్దేశించారు. పనుల పర్యవేక్షణకు నియమించిన ఉన్నతస్థాయి కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.



ఉన్నతస్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

352 టన్నుల ఉక్కు.. 112 టన్నుల ఇత్తడి

స్మృతివనం ప్రాంగణంలో పనులు చురుగ్గా సాగుతున్నట్లు సమీక్షలో అధికారులు తెలిపారు. శ్లాబ్‌ల పనులన్నీ ఈ నెలాఖరునాటికి పూర్తవుతాయన్నారు. విగ్రహ విడిభాగాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఒక్కొక్కటిగా అమర్చుకుంటూ మొత్తం 13 దశల్లో విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. విగ్రహ నిర్మాణంలో 352 మెట్రిక్ టన్నుల ఉక్కు, 112 మెట్రిక్ టన్నుల ఇత్తడిని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం (దేవదాయశాఖ) కొట్టు సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ప్లానింగ్ ఎక్స్ అఫీషియో సెక్రటరీ జి.విజయ్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ హర్షవర్ధన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఏపీఐఐసీ వీసీ, ఎండీ జి.సృజన, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో డిజిటల్ విప్లవం..

సాక్షి, అమరావతి: డిజిటల్ డివైడ్‌ను తొలగించాలన్నా... అంతరాలను తగ్గిస్తూ పోవాలన్నా కావాల్సింది అక్షరాస్యత. అది కూడా... డిజిటల్ అక్షరాస్యత. ఆ సూత్రాన్ని మనసావాచా ఆచరిస్తోంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. అందుకే ఇక్కడ డిజిటల్ డివైడ్ తగ్గుతోంది. శ్రీమంతులకు మాత్రమేననుకున్న డిజిటల్ విద్య పేదలకూ అందుతోంది. డివైడ్‌ను తగ్గిస్తూ డివైజ్‌లూ అందిస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఈ ఏడాది 8వ తరగతికి వచ్చిన విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. మొత్తం 5.30 లక్షల నాణ్యమైన ట్యాబ్‌లు ఇవ్వటం ద్వారా రాష్ట్రంలో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టారు.

ప్రతి విద్యార్థికీ అందుబాటులో ఉండేలా డిజిటల్ క్లాస్‌రూమ్‌లను అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. 1వ తరగతి నుంచే స్మార్ట్ టీవీ స్క్రీన్ల ద్వారా డిజిటల్ క్లాస్‌రూమ్‌లను అలవాటు చేయటంతో పాటు... ప్రభుత్వ స్కూళ్లలో 6వ తరగతి, ఆపైన ఉన్న ప్రతి తరగతి గదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేస్తున్నారు. ఇక 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లివ్వటంతో పాటు... 8, ఆ పై తరగతుల వారికి బైజూస్ డిజిటల్ కంటెంట్‌ను అందిస్తున్నారు. దీంతో ఇంట్లోనూ పిల్లలు ఆడియో, వీడియో, గ్రాఫిక్ ఎలిమెంట్స్ ఉన్న పాఠాలను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇంటర్ విద్యార్థులకు కూడా డిజిటల్ సౌలభ్యాన్ని కల్పించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ డిజిటల్ సదుపాయాలతో ప్రయివేటు, కార్పొరేట్ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులూ ఉత్తమ విద్యా ప్రమాణాలను అందుకునే అవకాశముంది. ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేయటమే కాదు. వాటి ద్వారా నిపుణులైన సబ్జెక్టు టీచర్లతో బోధన చేయించే చర్యలు చేపట్టారు. దీనికోసం టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 'నాడు-నేడు' పూర్తయిన స్కూళ్లన్నింటిలోనూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఎఫ్‌పీలు అందుబాటులోకి రానున్నాయి. ఇక పుస్తకాల్లోని అంశాలు, ట్యాబుల్లోని బైజూస్ కంటెంట్, ఐఎఫ్‌పీ కంటెంట్ ఇవన్నీ ఒకదానికొకటి సంబంధం ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. దీనివల్ల విద్యార్థులు మరింత సమర్థంగా అభ్యసనం కొనసాగించేందుకు ఆస్కారమేర్పడుతోంది.



పాలనలోనూ డిజిటల్ సేవలు...

విద్యారంగంలోనే కాకుండా ప్రభుత్వ పాలనా వ్యవహారాలన్నీ డిజిటల్ విధానంలోనే కొనసాగేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా అన్ని సంక్షేమ పథకాలనూ అక్రమాలకు, అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా అందజేయగలుగుతున్నారు. గతంలో లక్షల కోట్ల రూపాయల నిధులను వివిధ పథకాల కింద ఖర్చు చేస్తున్నట్లు చూపించటమే తప్ప ప్రజలకు వాటి ఫలాలు అందలేదు. మధ్యవర్తులు, దళారులు ప్రజాధనాన్ని దోచుకుతిన్నారు. డిజిటలైజేషన్‌ను ప్రభుత్వం సమర్థంగా వినియోగించుకోవటంతో ఆ పరిస్థితికి పూర్తిగా చెక్ పడింది. రాష్ట్రంలో గ్రామ, వార్డుల వారీగా 2.60 లక్షల మంది వలంటీర్లను నియమించి వారికి స్మార్ట్ ఫోన్లు ఇచ్చారు. తద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుకూ ప్రభుత్వ పథకాలను నేరుగా అందిస్తున్నారు. గ్రామ స్థాయిలో మహిళలు, శిశువుల సంక్షేమానికి, ఆరోగ్య పరిరక్షణకు వీలుగా అంగన్‌వాడీ కార్యకర్తలకూ ఫోన్లు అందించారు. 42 వేల మంది ఆశావర్కర్లకు స్మార్ట్ ఫోన్లు... 15వేల మందికి పైగా ఏఎన్ఎంలకు ట్యాబులు పంపిణీ చేయటంతో వారి ద్వారా అందజేస్తున్న సేవల్లో పూర్తి పారదర్శకత సాధ్యమయింది. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయటమే కాక అక్కడ 10,032 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను నియమించి స్మార్ట్ ఫోన్లు అందిస్తున్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగానికీ శ్రీకారం చుట్టారు.

'డిజిటల్' అంతరాలు!

▶ మొదటి పేజీ తరువాయి

మహిళలు 15 శాతం వెనకబడి ఉన్నారు. ఇంటర్నెట్ సేవలను వినియోగించుకునే సదుపాయం కూడా మహిళలకు తక్కువేనని, పురుషులతో పోలిస్తే ఏకంగా 33 శాతం మేర వ్యత్యాసం ఉన్నట్లు తెలిపింది. దేశంలో మూడింట ఒక వంతు మంది మహిళలు మాత్రమే ఇంటర్నెట్ వినియోగించుకోగలుగుతున్నారు.

- దేశాన్ని డిజిటల్ ఇండియాగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతున్నా అవన్నీ పట్టణ వాసులకే ఎక్కువగా అందుబాటులో ఉంటున్నాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కరోనా అనంతరం డిజిటల్ వృద్ధి రేటు పెరిగింది. ఒక్క ఏడాదిలోనే 13 శాతం మేర వృద్ధి సాధించినట్లు గణాంకాలు పేర్కొంటున్నా గ్రామీణ ప్రాంతాల్లో తక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతంలో కేవలం 31 శాతమే ఇంటర్నెట్‌ను వినియోగించుకోగలుగుతున్నారు. అదే పట్టణ ప్రాంతాల్లో 67 శాతానికి పైగా వాడుతున్నట్లు ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదిక తెలిపింది.
- గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గాలు డిజిటల్ వినియోగంలో వెనుకబడి ఉన్నట్లు హౌస్‌హోల్డ్ సర్వే గణాంకాలు వెల్లడిస్తున్నాయని ఆక్స్‌ఫామ్ ఇండియా పేర్కొంది. ఓబీసీలు, ఆ తర్వాత ఎస్సీలు, ఆపై ఎస్టీలు వెనుకబడి ఉన్నట్లు తెలిపింది. ఎస్సీ, ఎస్టీల కంటే ఓబీసీ వర్గాలు కంప్యూటర్ సదుపాయం, ఇంటర్నెట్ వినియోగంలో ముందున్నాయని విశ్లేషించింది. ఎస్సీ, ఓబీసీల కంటే ఎస్టీలు 8 శాతానికి పైగా వెనుకబడినట్లు నివేదిక వెల్లడించింది.
- విద్యాసంస్థల్లో విద్యార్థుల చదువుల కోసం ఇంటర్నెట్, కంప్యూటర్ వాడకం తక్కువగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.
- పేదల్లో 40 శాతం మంది డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ఆపై వర్గాలు, ధనవంతుల్లో 60 శాతానికి పైగా డిజిటల్ చెల్లింపులు జరుపుతున్నారు.
- దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా అంతర్జాతీయంగా పోలిస్తే చాలా వెనుకంజలో ఉన్నట్లు ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్యసమితి రూపొందించే ఈ-పార్టిసిపేషన్ ఇండెక్స్ 2022 సూచీల్లో దేశం 105వ స్థానంలో ఉంది. మొత్తం 193 దేశాల్లో టెలి కమ్యూనికేషన్, డిజిటల్ కనెక్టివిటీ, మానవ వనరుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని ఐరాస దీన్ని తయారు చేస్తుంది.
- దేశంలో అత్యధికంగా ఇంటర్నెట్ వాడకంలో మహారాష్ట్ర తొలి స్థానం, గోవా, కేరళ తరువాత స్థానాల్లో నిలిచాయి.

విచారణ రికార్డ్ చేయాలని ఆదేశించండి

తెలంగాణ హైకోర్టులో కడప ఎంపీ అవినాశ్ రెడ్డి పిటిషన్

- సీబీఐ విచారణ ప్రక్రియపై సందేహాలున్నాయి
- నేను కోరినా విచారణ ప్రక్రియను సీబీఐ రికార్డ్ చేయలేదు
- వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు
- వివేకా చెక్ పవర్ రద్దు చేసిన కుమార్తె, అల్లుడు
- చంద్రబాబు, బీటెక్ రవి ప్రభావానికి లోనయ్యే సునీత నాపై అసత్య ఆరోపణలు
- దస్తగిరి మాటల ఆధారంగా ఏకపక్షంగా సీబీఐ దర్యాప్తు
- దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగేలా చూడండి
- పిటిషన్‌లో న్యాయస్థానాన్ని కోరిన అవినాశ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తనను శుక్రవారం విచారణకు హాజరు కావాలనడంపై కొన్ని అనుమానాలు వ్యక్తం చేస్తూ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి గురువారం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు తాను సహకరిస్తున్నప్పటికీ విచారణ అధికారి సరైన విధానాలు అనుసరించడం లేదని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని హైకోర్టును కోరారు. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. 'నన్ను మొదటిసారి విచారించినప్పటి నుంచి సీబీఐ అధికారులు అడిగినవి, అడగనివి కూడా చిలువలు పలువలు చేస్తూ దుష్ప్రచారం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలకు కొమ్ముకాసే పత్రికలు, టీవీ చానళ్లు, సోషల్ మీడియా వేదికలు ప్రజల్లో అపోహలు కలిగించేలా అవాస్తవాలను వ్యాప్తిలోకి తీసుకొచ్చాయి. ప్రజల్లో అపోహలు తొలగించేందుకే సీబీఐ విచారణను రికార్డు చేయాలని విచారణ అధికారిని లిఖితపూర్వకంగా కోరాను. రెండోసారి విచారణకు పిలిచినప్పుడు కూడా రికార్డు చేయాలని సీబీఐ డైరెక్టర్‌ను, విచారణ అధికారి రామ్‌సింగ్‌ను లిఖితపూర్వకంగా కోరాను. అయినా పట్టించుకోలేదు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించాను' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్‌లో ఆయన పలు కీలక అంశాలను కూడా ప్రస్తావించారు.



వివేకా, సునీత మధ్య మనస్పర్థలు

'2010లో షేక్ షమీమ్‌ను వైఎస్ వివేకా రెండో వివాహం చేసుకున్నారు. 2015లో వీరికి ఓ కుమారుడు కూడా పుట్టాడు. అప్పటి నుంచి వివేకా కుటుంబంలో తీవ్ర విభేదాలు తలెత్తాయి. షమీమ్‌ను సునీత, ఆమె భర్త ఎన్.రాజశేఖరరెడ్డి, బావ ఎన్.శివప్రకాశ్‌రెడ్డి శత్రువుగా చూసేవారు. సునీత, రాజశేఖరరెడ్డితో పాటు వివేకా పలు కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నారు. వారు వివేకానందరెడ్డి చెక్ పవర్‌ను కూడా రద్దు చేశారు. దీంతో ఆయన ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివేకా మొదటి భార్య, కూతురు హైదరాబాద్‌లో ఉండగా, ఆయన మాత్రం పులివెందులలోనే ఎక్కువ రోజులు గడిపేవారు. ఒక దశలో ఆయన వారసుడిగా షమీమ్ కుమారుడినే ప్రకటిస్తారని, ఆ మేరకు విల్లు కూడా రాశారని పుకార్లు వచ్చాయి. హత్య అనంతరం నిందితుల (ఏ1 నుంచి ఏ4) ఇళ్లలో ఈ పత్రాల కోసం వెతికినట్లు కూడా సమాచారం. ఇవన్నీ పరిశీలిస్తే.. సొంత కుటుంబ సభ్యులే ఆయన్ని వదిలించుకునే పథకం వేసినట్లు అర్థమవుతుంది. వివేకా మరణానంతరం సునీత, ఆమె కుటుంబీకులు బెదిరించినట్లు షమీమ్ దర్యాప్తు అధికారులకు కూడా చెప్పారు. తన కుమారుడి పేరుమీద రూ.2 కోట్లు బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తానని వివేకా చెప్పినట్లు వెల్లడించారు' అని అవినాశ్‌రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు.

బీటెక్ రవి, చంద్రబాబు ప్రభావంతోనే

'వివేకా హత్య తర్వాత సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి టీడీపీ ఎమ్మెల్సీ ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి)ని కలిశారు. రవి ద్వారా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో మంతనాలు జరిపారు. హత్య జరిగిన సంవత్సరం వరకు సునీత నాపై ఆరోపణలు చేయలేదు. పైగా, ప్రెస్‌మీట్ పెట్టి నా విజయం కోసం వివేకా చాలా శ్రమించారని, జమ్మలమడుగులో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారని ఆమె చెప్పారు. కానీ చంద్రబాబు ప్రభావానికి లోనైన తర్వాతే నాపై ఆరోపణలు చేశారు' అని తెలిపారు.

వారికి నచ్చినట్లు దర్యాప్తు

'దస్తగిరి అక్కడా ఇక్కడా విని చెప్పిన మాటల ఆధారంగానే సీబీఐ దర్యాప్తు సాగుతోంది. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినా ఈ కేసులో నన్ను ఇరికిస్తున్నారు. సునీల్ యాదవ్ గూగుల్ టేక్ ఔట్ ఫోన్ లొకేషన్ అనే పేరుతో సీబీఐ నన్ను వేధిస్తోంది. హత్య జరిగిన ప్రాంతంలో దొరికిన లేఖపై దర్యాప్తు చేయటంలేదు. దర్యాప్తు అధికారి తప్పుడు ప్రచారానికి ప్రభావితమై ఆ కోణంలోనే, పక్షపాతంతో విచారణ చేస్తున్నారు. తప్పుడు సాక్ష్యాలు చెప్పేలా కొందరిపై ఒత్తిడి తెస్తున్నారు. నేను విచారణలో చెప్పిన విషయాలను విచారణ అధికారి మార్చి వారికి అవసరమైనట్లుగా మీడియాకు లీకులిస్తున్నారు. నోటీసుల దశలో దర్యాప్తు సాగుతుండగా చార్జిషీట్‌లో నేరస్తునిగా సీబీఐ చిత్రీకరిస్తోంది. రాజకీయ అవసరాల కోసం చంద్రబాబు ఈ కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తున్నారు. అందువల్ల నిష్పక్షపాతంగా విచారణ జరిగేలా దర్యాప్తు అధికారులను ఆదేశించాలి' అని అవినాశ్‌రెడ్డి పిటిషన్‌లో కోరారు.

నేడు విచారణ

అవినాశ్ రెడ్డి పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సంబంధించిన కేసులు విచారించే బెంచ్‌కు పంపారు. ఈ పిటిషన్‌ను జస్టిస్. కె.లక్ష్మణ్ బెంచ్ శుక్రవారం విచారించనుంది.

నిజాలకు మసిబొట్టు.. బాబు కోసం కనికట్టు

బొగ్గు కొనుగోలుపై ఈనాడు 'పచ్చ' పైత్యం

- ఇదే పని చంద్రబాబు చేసుంటే విజనరీ అని రాసేవారు
- సీఎం కుర్చీలో ఉన్నది ఆయన కాదు కాబట్టే బురదచల్లుడు
- కేంద్రం ఆదేశాల మేరకే విదేశీ బొగ్గు కొనుగోలు
- 2015-16 నుంచి 2018-19 మధ్య 21.03 లక్షల టన్నులు కొనుగోలు
- ఈ ప్రభుత్వంలో ధర తగ్గింపు లక్ష్యంగా 4సార్లు టెండర్లు రద్దు
- ఐదవసారి తక్కువ ధరకే టెండరు ఆమోదం.. రివర్స్ టెండర్లతో రూ.5.1 కోట్లు ఆదా
- ఈ వాస్తవాలకు మసి పూస్తూ కుట్రతో తప్పుడు కథనం

సాక్షి, అమరావతి: 'మన చంద్రబాబు కాదు కదా.. వెయ్యండి బురద' అంటూ రామోజీ మరోమారు తన ద్వంద్వ నీతి రాతలతో ప్రజల్లో విషం నింపే కార్యక్రమంలో ఇంకో అడుగు ముందుకు వేశారు. కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గును అధిక ధరతో కొన్నారనే సాకుతో వాస్తవాలకు మసిబొట్లు పెట్టారు. బొగ్గు కొనుగోలు టెండరులో అదానీ సంస్థ ఎల్-1గా నిలిచిందని ఒప్పుకుంటూ కూడా.. అది తప్పన్నట్లు 'బొగ్గు టెండరూ అదానీకే' శీర్షికన ప్రత్యేక కథనాన్ని అచ్చేయడం కేవలం చంద్రబాబుకు రాజకీయంగా లబ్ధి చేకూర్చాలని



20% విదేశీ బొగ్గును వాడుకోవాలంటూ కేంద్రం ఆదేశాలు



టన్ను విదేశీ బొగ్గును ఎన్టీపీసీ రూ.18,509కి కొనుగోలు చేస్తున్నట్టు తెలిపే డాక్యుమెంట్



ఐసీఐ-3 సూచిక ప్రకారమే చెల్లింపులుంటాయని తెలిపే ఒప్పందపత్రంలోని నిబంధన

కాదా? ఇదే పని చంద్రబాబు చేసి ఉంటే.. బాబు గ్రేట్ విజనరీ.. బాబు ముందు చూపు.. అని డప్పు కొట్టే వారు కాదా? సీఎం వైఎస్ జగన్ చేసినందున మీ 'పచ్చ'కళ్లకు తప్పుగా కనిపిస్తోంది. భవిష్యత్‌లో విద్యుత్ కొరత ఉండకూడదనే దూరదృష్టితో ఈ పని చేయడాన్ని మీరు జీర్ణించుకోలేకపోతున్నారని మీ కథనంలోని వాక్యాలు చెప్పకనే చెబుతున్నాయి. అందుకే కదా.. ఈ ప్రభుత్వం ఈ టెండర్‌ను నామినేషన్‌పై కట్టబెట్టిందన్నట్లు మీరు తిమ్మినిబమ్మి చేసి చూపడాన్ని ఏమనాలి? తక్కువ ధరకు బొగ్గు కొనుగోలు కోసం నాలుగుసార్లు టెండర్లు నిర్వహించి రద్దు చేసిన విషయం మీకు తెలియదా? ఐదోసారి టెండర్లలో అదానీ సంస్థ ఎల్-1గా నిలిచిన తర్వాతే టెండర్ ఖరారు చేశారనేది నిజం కాదా? పచ్చి నిజాన్ని అందమైన అబద్ధంగా మార్చి.. ప్రజలంతా అదే నిజమని భ్రమ పడేలా చేయాలన్న మీ ఆరాటం వల్ల మీరు రోజురోజుకూ దిగజారి పోతున్నారనే విషయాన్ని గుర్తించండి. అబ్బే.. అలాంటివన్నీ మా ఒంటికి పట్టవు అనుకుంటే 'టీడీపీ ఈనాడు' అని పత్రిక పేరు మార్చుకుంటే సరి. మీ కథనంలో పేర్కొన్న నిజానిజాల్లోకి వెళితే..

■ ఆరోపణ: ప్రభుత్వంపై రూ.300 కోట్లు అదనపు భారం

■ వాస్తవం: 7.50 లక్షల టన్నుల విదేశీ బొగ్గుతో 1,776 మిలియన్ యూనిట్ల అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఏపీపీడీసీఎల్ ఇవ్వగలుగుతుంది. దీనికి అయ్యే వ్యయం యూనిట్‌కు రూ.4.44 చొప్పున రూ.788.54 కోట్లు. ఇదే 1,776 మిలియన్ యూనిట్లను పవర్ ఎక్స్ఛేంజి(బహిరంగ మార్కెట్)లో కొనుగోలు చేస్తే వెచ్చించాల్సిన సొమ్ము రూ.1,456.32 కోట్లు. పవర్ ఎక్స్ఛేంజిలో కొనాలంటే యూనిట్‌కు దాదాపు రూ.8.20 చెల్లించాలి. అంటే విదేశీ బొగ్గుతో ఉత్పత్తి చేయడం వల్ల రూ.668 కోట్లు డిస్కంలకు ఆదా. దేశీయ బొగ్గుతో సగటు ఉత్పత్తి వ్యయం పెరుగుదలను పరిగణనలోకి తీసుకున్నాక, డిస్కంలకు రూ.319.78 కోట్లు నికరంగా ఆదా అవుతుంది.

దిగుమతి చేసుకున్న బొగ్గు వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

సంవత్సరం	బొగ్గు
2015-16	1,24,361
2016-17	7,67,505
2017-18	3,80,049
2018-19	8,31,632
2019-20	1,96,145
2020-21	8,18,522

■ ఆరోపణ: 6 శాతం విదేశీ బొగ్గు చాలు..

■ వాస్తవం: దేశంలో తీవ్ర బొగ్గు కొరత నేపథ్యంలో బొగ్గు వినియోగంలో 20 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలంటూ కేంద్ర ఇంధన శాఖ ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రుల కమిటీ, సబ్ కమిటీలతో సమావేశాలు, కోల్ ఇండియా ద్వారా అన్ని జెన్‌కోలకు బొగ్గు సరఫరాపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది. వారు చెప్పినంత విదేశీ బొగ్గును సేకరించడంలో విఫలమైతే, కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి దేశీయ బొగ్గు సరఫరాను దామాషా ప్రకారం తగ్గిస్తారు. అదీకాకుండా కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లో 30 శాతం విదేశీ, 70 శాతం స్వదేశీ బొగ్గు వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేసేలా రూపొందించారు. దీని ప్రకారం 30 శాతం విదేశీ బొగ్గునే దీనికి వినియోగించాలి.

■ ఆరోపణ: టన్ను విదేశీ బొగ్గు ధర రూ.10వేల నుంచి 11 వేలు

■ వాస్తవం: విదేశీ బొగ్గు టన్ను ధర రూ.10-11వేలకు లభిస్తుందని ఏ నిపుణులు చెప్పారో తెలియదు. నిజానికి దేశంలో రోజుకు 2.781 మిలియన్ టన్నుల బొగ్గు డిమాండ్ ఉన్నప్పటికీ 2.2 మిలియన్ టన్నులే అందుబాటులో ఉంది. అంతర్జాతీయ పరిస్థితులు, దేశంలో విద్యుత్ డిమాండ్ పెరుగుదల కారణంగా విదేశీ బొగ్గు ధర చాలా ఎక్కువగా ఉంది. దీనికి రవాణా ఖర్చులు, జీఎస్టీ కలిపితే అదానీ కోట్ చేసిన ధర దాటిపోతుంది. బొగ్గు ధర, రవాణా చార్జీలు అంతర్జాతీయ మార్కెట్ ఇండెక్స్ రేట్లు, డాలర్ మారకం రేట్ల ఆధారంగా అదానీకి చెల్లింపులు ఉంటాయి. ప్రస్తుతం, ఎన్టీపీసీ, ఇతర రాష్ట్ర థర్మల్ పవర్ ప్లాంట్లు కేవలం ఇండెక్స్ బేస్డ్ ప్రైసింగ్ ఆధారంగా బొగ్గును సేకరిస్తున్నాయి. అదానీ ఇప్పటికే ఐసీఐ3(ఇండోనేషియన్ కోల్ ప్రైజ్) ఇండెక్స్ ఆధారంగా ఒక నౌకలో 1,65,000 మెట్రిక్ టన్నుల విదేశీ బొగ్గును తీసుకువచ్చి కృష్ణపట్నం పోర్ట్‌లో ఉంచింది. ఇండెక్స్ ఆధారంగా ఈ నౌక తీసుకువచ్చిన బొగ్గు మెట్రిక్ టన్ను ధర రూ.11,733 మాత్రమే.

■ ఆరోపణ: అదానీకి లబ్ధి చేకూర్చేందుకే..

■ వాస్తవం: విదేశీ బొగ్గు కొనుగోలు కోసం ఏపీపీడీసీఎల్ ఇప్పటి వరకూ 4సార్లు బహిరంగ టెండర్లు పిలిచి ధర ఎక్కువనే ఉద్దేశంతో రద్దు చేసింది. 2021 అక్టోబర్ 20న 5 లక్షల టన్నుల కొనుగోలుకు టెండర్లు పిలవగా రూ.17,480 కోట్ చేసిన అదానీ ఎల్1గా నిలిచింది. 2022 మార్చి 28న రెండవసారి టెండర్లలో రూ. 25,650 కోట్ చేసి ట్రైడెంట్ చెమ్‌ఫర్ ఎల్1గా నిలిచింది. 2022 మే 4న మూడవసారి టెండర్లలో రూ.23,085 ధర కోట్ చేసి అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ ఎల్1గా నిలిచింది. 2022 జూలై 13న నాలుగోసారి రూ.13,990 ధర కోట్ చేసి చెట్టినాడ్ లాజిస్టిక్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఎల్1గా నిలిచింది. ఈ టెండర్లన్నింటినీ ఎక్కువ ధర అనే ఉద్దేశంతోనే ఏపీపీడీసీఎల్ రద్దు చేసింది. ఐదవసారి టెండర్ల అనంతరం రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.5.10 కోట్లు ఆదా అయ్యాయి.

టెండర్ల ద్వారా బొగ్గు కొనుగోలు కొత్త కాదు



ఐదోసారి టెండర్లలో 7.5 లక్షల టన్నుల విదేశీ బొగ్గు కొనుగోలు కోసం టెండర్లు పిలవగా అయిదు సంస్థలు పాల్గొన్నాయి. ఎల్1గా వచ్చిన అదానీ సంస్థ టన్ను రూ.13,219తో సరఫరా చేసేందుకు ముందుకు వచ్చి ఒప్పందం చేసుకుంది. జాతీయ థర్మల్ విద్యుదుత్పత్తి సంస్థ (ఎన్టీపీసీ) చేసుకున్న ఒప్పందం ప్రకారం టన్ను విదేశీ బొగ్గు సరఫరా ధర (అన్నీ కలుపుకుని)రూ.18,509 పడుతోంది. ఇదే బొగ్గును ఏపీ జెన్‌కో టన్ను ధర రూ.13,219తో (ప్లాంటుకు చేర్చేలా అన్నీ కలుపుకుని) కొనుగోలు చేసేందుకు బహిరంగ టెండర్ల ద్వారా ఒప్పందం కుదుర్చుకుంది. టెండర్ల ద్వారా బొగ్గు కొనుగోలు కొత్తేమీ కాదు.

– బి.శ్రీధర్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, జెన్‌కో ఎండీ

డ్రాపవుట్ల నివారణకు పాఠశాలల వారీగా కమిటీలు

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్ల నివారణకు గ్రామస్థాయిలో పాఠశాలల వారీగా కమిటీలను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్ జారీ చేసింది. స్కూలు హెడ్మాస్టర్, పేరెంట్సు కమిటీ అధ్యక్షుడు, గ్రామ, వార్డు సచివాలయాల్లోని సంక్షేమ సహాయకుడితోపాటు గ్రామంలోని ముఖ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రతి నెలా ఈ కమిటీ సమావేశమై పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తదితర అంశాలను సమీక్షించి డ్రాపవుట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. బడి బయట పిల్లలను గుర్తించి వారిని స్కూళ్లలో చేర్పించాలంది. ప్రతినెలా సమావేశాల్లో తీసుకున్న చర్యలపై నివేదికలను పాఠశాల విద్యాశాఖకు అందించాలని సూచించింది.

ఆస్తి పన్ను సేవలు తాత్కాలికంగా నిలిపివేత

సాక్షి, అమరావతి: పురపాలికల్లో ఆస్తి పన్ను చెల్లింపు సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సీడీఎంఏ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను డిమాండ్ జనరేట్ చేసే ప్రక్రియలో భాగంగా పరిపాలనా సౌలభ్యం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలపై పన్ను చెల్లింపు సేవలు అందుబాటులో ఉండవని పేర్కొన్నారు.

14న నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్



సాక్షి, అమరావతి: ఈ నెల 14వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం అమలు చేయనున్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలు, కిశోర బాల, బాలికలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేపడతామని పేర్కొన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా మాత్రలు అందిస్తామని తెలిపారు. 1.07 కోట్ల మంది పిల్లలు, కిశోర బాల, బాలికలకు మాత్రల పంపిణీ చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నామని పేర్కొన్నారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు 400 ఎంజీ మాత్రలో సగం మాత్రను పొడి చేసి నీళ్లలో కలిపి అందించాల్సి ఉంటుందని తెలిపారు. రెండు నుంచి మూడేళ్ల పిల్లలకు అయితే ఒక మాత్రను పొడి చేసి నీళ్లలో కలిపి తాగించాలని సూచించారు. 14వ తేదీన మాత్రలు అందని పిల్లలను దృష్టిలో ఉంచుకుని 18వ తేదీన మాప్–అప్ డే నిర్వహిస్తామని వివరించారు.

బేసిక్ ఫోన్లలో ఉన్న సెల్ నంబర్లు గుర్తింపు
వాటితో స్మార్ట్‌ఫోన్లలో వాట్సాప్ యాక్టివేట్
ప్రముఖుల పేరిట వాట్సాప్ మెసేజ్‌లు
పంపి డబ్బు గుంజుతున్న సైబర్ నేరగాళ్లు
కేసులు నమోదవుతున్నా నిందితుల
ఆచూకీ కనిపెట్టలేకపోతున్న పోలీసులు



నంబర్ ఇక్కడ.. వాట్సాప్ అక్కడ!

సాక్షి, హైదరాబాద్: వాట్సాప్ డీపీలతో టోపీ వేస్తున్న సైబర్ నేరగాళ్లు కొత్త పంథా అనుసరిస్తున్నారు. బేసిక్ ఫోన్లలో ఉన్న సెల్ నంబర్లను గుర్తించి వాటికి సంబంధించిన వాట్సాప్‌ను తమ స్మార్ట్‌ఫోన్లలో యాక్టివేట్ చేసుకుంటున్నారు. వైఫై ద్వారా కథ నడుపుతూ డబ్బు, గిఫ్ట్ వోచర్ల పేరుతో అందినకాడికి దండుకుంటున్నారు. 'డీపీ ఫ్రాడ్స్'పై అధ్యయనం చేసిన హైదరాబాద్ సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులు.. రెండు రకాలుగా ఇతరుల వాట్సాప్‌లు సైబర్ నేరగాళ్ల వద్దకు వెళ్తున్నాయని గుర్తించారు.

సాధారణ ఫోన్లలో ఉన్నవి గుర్తిస్తూ..

సైబర్ నేరాల కోసం మరొకరి వాట్సాప్‌ను తమ స్వాధీనంలోకి తీసుకోవడానికి సైబర్ నేరగాళ్లు మరో విధానాన్ని అనుసరిస్తున్నారు. ఓ సిరీస్‌లోని నంబర్లను తమ స్మార్ట్‌ఫోన్లలో వేర్వేరు పేర్లతో సేవ్ చేసుకొని వాటిల్లో వాట్సాప్ యాక్టివేట్ అయిందో లేదో తెలుసుకుంటున్నారు. యాక్టివేట్ కాని వాటిని వైఫై ద్వారా వాడే తమ స్మార్ట్‌ఫోన్లలో వాడటానికి ఓటీపీ అవసరం. దీంతో సేల్స్, కాల్ సెంటర్ల పేర్లతో వారికి ఫోన్లుచేసి ఓటీపీ తెలుసుకుంటున్నారు. ఇది ఎంటర్ చేయడంతోనే అవతలి వారి నంబర్‌తో వాట్సాప్ వీరి ఫోన్లలో యాక్టివేట్ అవుతోంది. విషయం ఫోన్‌నంబర్ వాడే వారికి తెలియట్లేదు.

కొన్నాళ్లకు వినియోగించడం మానేసి..

ఒకరి పేరుతో ఉన్న సెల్ నంబర్‌కు సంబంధించిన వాట్సాప్‌ను వినియోగించుకోవడానికి సైబర్ నేరగాళ్లు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. నకిలీ పత్రాలతో గ్రామీణ ప్రాంతాల్లో సిమ్‌కార్డులు కొని వాటి ద్వారా వాట్సాప్‌ను యాక్టివేట్ చేసుకుంటున్నారు. ఆపై కొన్నిరోజులకు ఆ నంబర్‌ను నేరుగా వాడటం మానేసి కేవలం వైఫై ద్వారానే వాట్సాప్ వాడుతున్నారు. దీంతో నిర్దిష్టకాలం తర్వాత సర్వీస్ ప్రొవైడర్లు ఆ నంబర్‌ను మరొకరికి కేటాయిస్తున్నారు. ఇలా తీసుకున్న వాళ్లు ఈ నంబర్‌తో వాట్సాప్ యాక్టివేట్ చేసుకోకున్నా లేదా బేసిక్ ఫోన్లు వాడుతున్నా వాట్సాప్ నంబర్ పాత యజమాని వద్దే ఉండిపోతోంది.

కష్టసాధ్యంగా దర్యాప్తు..

ఈ వాట్సాప్‌లను వాడి ప్రముఖులు, అధికారుల ఫొటోలు డీపీలుగా పెడుతున్న సైబర్ నేరగాళ్లు ఇంటర్నెట్ ద్వారా వారి సంబంధీకుల ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. వాళ్లకు వారి బాస్‌లు, ప్రముఖుల మాదిరిగా వాట్సాప్ సందేశాలు పంపి డబ్బు, గిఫ్ట్ వోచర్లు డిమాండ్ చేసి కాజేస్తున్నారు. దీనిపై కేసులు నమోదవుతున్నా వాట్సాప్‌కు సంబంధించిన ఫోన్ నంబరే దర్యాప్తునకు ఆధారంగా మారుతోంది. అలా ముందుకు వెళుతున్న అధికారులకు దాని యజమానుల ఆచూకీ లభిస్తోంది తప్ప వాట్సాప్ యాక్టివేట్ చేసుకొని వినియోగిస్తున్న వారు పట్టుబడట్లేదు. వారిని కనిపెట్టడం కూడా కష్టంగా మారడంతో దర్యాప్తులు జటిలంగా మారుతున్నాయి. ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన కేసుల్లో నిందితులు దొరకడం అరుదు కాగా.. గిఫ్ట్ వోచర్ల రూపంలో కొల్లగొట్టిన వాళ్లు చిక్కడం దుర్లభమవుతోంది.

నేరుగా సంప్రదించడం ఉత్తమం..



వాట్సాప్ మోసాల బారినపడకుండా ప్రతి ఒక్కరూ కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. సందేశం వచ్చిన వెంటనే కేవలం డీపీ ఆధారంగా కాకుండా ఫోన్‌నంబర్ చూశాకే ఎదుటి వ్యక్తి ఎవరన్నది ఖరారు చేసుకోవాలి. అవసరమైతే ఫోన్ చేసి లేదా నేరుగా సంప్రదించాకే లావాదేవీలు చేయాలి.

– కేవీఎం ప్రసాద్, హైదరాబాద్ సైబర్ క్రైం ఏసీపీ

బాబును నమ్మి నట్టేట మునిగిన రైతులు

893వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: రాజధాని పేరుతో రూ.3.50 లక్షల కోట్లు దోచుకుని పారిపోయిన చంద్రబాబును నమ్మితే రైతులు నట్టేట మునగడం ఖాయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 893వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. అమరావతి పేరుతో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం చేస్తానని చెప్పి.. ఈ ప్రాంతంలో భూములు సేకరించి రైతులను చంద్రబాబు నిండా ముంచాడని మండిపడ్డారు. బాబు చేసిన మోసానికి రాజధాని ప్రాంతంలో ఇటు ఉపాధి లేక అటు ప్రభుత్వం నుంచి ఇచ్చిన రిటర్న్ బుల్ ప్లాట్లు అమ్ముకునే పరిస్థితి లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురువారం దీక్షా శిబిరానికి మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు సంఘీభావం తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నిరీక్షణ్ జేమ్స్, ఈపూరి ఆదాం, పులి దాసు, పాలిమేర హరికృష్ణ, పల్లె బాబు నూతక్కి జోషి,మండా సత్యం పాల్గొన్నారు.

తీవ్రత తగ్గించి ఉద్యమం కొనసాగిస్తాం: బొప్పరాజు



సాక్షి, అమరావతి: తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగుతుందని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో జేఏసీ రాష్ట్ర కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కొన్ని అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, అందువల్ల గతంలో ఇచ్చిన పోరాట ప్రణాళిక తీవ్రతను తగ్గించినట్లు తెలిపారు. బుధవారం నుంచి వచ్చే 5వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొంటామన్నారు. ఈ నెల 17, 20 తేదీల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి మద్దతు కోరతామని, 21వ తేదీన సెల్ డౌన్ యథావిధిగా ఉంటుందని చెప్పారు. 27న కారుణ్య నియామకాల కోసం వారి కుటుంబ సభ్యులను కలుస్తామన్నారు. వచ్చే నెల 5న మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని బొప్పరాజు వివరించారు.

పొగాకు వేలానికి రంగం సిద్ధమైంది. జిల్లాలోని నాలుగు వేలం కేంద్రాల్లో గురువారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందుకోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. రీజియన్ పరిధిలో ఇప్పటికే ప్రారంభమైన వేలం కేంద్రాల పరిధిలో కేజీ పొగాకు అత్యధికంగా రూ.200 పలుకుతోంది. దీంతో ధరలపై ఇక్కడి రైతులు భారీ ఆశలు పెట్టుకున్నారు. సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో సరాసరి ధరలు అంతకు తగ్గకుండా ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పొగాకు ధరపై కోటి ఆశలు

నెల్లూరు జిల్లాలో ప్రారంభమైన వేలం



కందుకూరు నియోజకవర్గంలో సాగు చేసిన పొగాకు పంట

వేలం కేంద్రం	సాగుకు అనుమతి	సాగు చేసింది	రైతుల సంఖ్య
కందుకూరు–1	6,134 హెక్టార్లు	7,174 హెక్టార్లు	3,348 మంది
కందుకూరు–2	5,500 హెక్టార్లు	6,300 హెక్టార్లు	2,894 మంది
కలిగిరి	3,632 హెక్టార్లు	3,371 హెక్టార్లు	1,451 మంది
డీసీపల్లి	4,969 హెక్టార్లు	4,660 హెక్టార్లు	2,115 మంది

- అనుమతి కంటే అధికంగా సాగు
- ఆశలు రేకెత్తిస్తున్న మార్కెట్
- ఇప్పటికే ప్రారంభమైన చోట్ల కేజీకి రూ.200
- అదే ధర ఇవ్వాలని ఇక్కడి రైతుల డిమాండ్

కందుకూరు: పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలో మొత్తం 11 వేలం కేంద్రాలుండగా వీటిలో నాలుగు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. అవి కందుకూరు–1, కందుకూరు–2, కలిగిరి, మర్రిపాడు మండలంలోని డీసీపల్లి. ఈ సీజన్‌కు సంబంధించి వాటిల్లో వేలం ప్రక్రియ ప్రారంభమైంది. మాండూస్ తుపాన్ పొగాకు రైతులను తీవ్రంగా దెబ్బకొట్టింది. తోటలు నష్టపోవడంతో తిరిగి మొక్కలు వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో గతంతో పోల్చుకుంటే సాగు ఖర్చు కొంతమేర పెరిగాయి.



క్యూరింగ్ చేసిన పొగాకు

పెరిగిన సాగు

ఈ ఏడాది పొగాకు సాగు భారీగా పెరిగింది. మార్కెట్ ఆశాజనకంగా ఉండటంతో రైతులు బోర్డు ఇచ్చిన అనుమతికి మించి అధికంగా సాగు చేశారు. కందుకూరు–1 వేలం కేంద్రంలో 11 మిలియన్ కేజీలు, రెండులో 9.5 మిలియన్ కేజీలు, కలిగిరిలో 4.8 మిలియన్ కేజీలు, డీసీపల్లిలో ఏడు మిలియన్ కేజీల వరకు ఉత్పత్తి రావచ్చని అంచనా వేస్తున్నారు. కాగా రీజియన్ పరిధిలో 87 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలకు అనుమతి ఉంటే 99 మిలియన్ కేజీల వరకు ఉత్పత్తి రావచ్చని బోర్డు అధికారుల అంచనాగా ఉంది.

అప్పుడే బయటపడతాం

ఈ ఏడాది నాణ్యమైన పొగాకు (గ్రేడ్–1) ఆశించిన విధంగానే ఉండటంతో ధరలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ఒంగోలు, పొదిలి, కొండపి వంటి వేలం కేంద్రాల్లో వేలం ప్రక్రియ ప్రారంభమైంది. అక్కడ కేజీ పొగాకు ధర అత్యధికంగా రూ.200 వరకు పలుకుతోంది. గురువారం కూడా ఇక్కడ ఇదే ధర నుంచి వేలం ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. ఆ ధరే ఉండొచ్చని బోర్డు అధికారులు కూడా చెబుతున్నారు. కాకపోతే సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో అన్ని గ్రేడ్లు కలిపి సరాసరి ధర రూ.200 వరకు ఇవ్వాలనే డిమాండ్ రైతుల నుంచి వినిపిస్తోంది. అప్పుడే నష్టాల్లేకుండా గట్టునపడతామంటున్నారు. అయితే ఇప్పటి వరకు జరిగిన వేలంలో సరాసరి ధర రూ.178గా ఉంది. మొదట్లోనే సరాసరి ధర ఇలా ఉంటే వేలం జరిగే కొద్దీ మరింత తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం క్వింటాలు పొగాకుకు రూ.20 వేల వరకు ఇస్తున్నారని, దీనిని రూ.22 వేలకు పెంచాలని కోరుతున్నారు. గతేడాది వేలంలో డిమాండ్ బాగుండటంతో హైగ్రేడ్ నుంచి లోగ్రేడ్ పొగాకు వరకు దాదాపు ఒకే రకం ధర వచ్చిందని, కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎలాంటి జాప్యం లేకుండా వేలం ప్రక్రియను వేగంగా ముగించాలని రైతులు కోరుతున్నారు.

డిమాండ్ బట్టి ధరలు



జిల్లాలోని నాలుగు వేలం కేంద్రాల్లో పొగాకు వేలం గురువారం నుంచి అధికారికంగా ప్రారంభమైంది. కందుకూరు–2 వేలం కేంద్రంలో 27 బేళ్లు వేలానికి ఉంచుతున్నారు. ప్రస్తుతం పొగాకు కేజీ రూ.200 వరకు పలుకుతోంది. ఇదే ప్రారంభ ధరగా ఇక్కడ కూడా ఉండొచ్చు. దీనిపై రైతులు కొంత వరకు సంతృప్తిగానే ఉన్నారని భావిస్తున్నాం. డిమాండ్‌ని బట్టి వేలంలో ధరలు ఉంటాయి.

– రాజగోపాల్‌రెడ్డి, రెండో వేలం కేంద్రం నిర్వహణాధికారి

సరాసరి ధరలు తగ్గకుండా ఇవ్వాలి



ఈ ఏడాది పొగాకులో సాగు ఖర్చులు బాగా పెరిగాయి. దీనికి అనుగుణంగా ధరలు పెంచాల్సిన అవసరం ఉంది. క్వింటా పొగాకు రూ.22 వేల వరకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే కిలో సరాసరి ధర కూడా రూ.200 తగ్గకుండా ఉంటేనే రైతులకు లాభాలు వస్తాయి. నష్టాలు లేకుండా బయటపడాలంటే ధరలు పెంచాలి.

– తాటికొండ రమణయ్య, దక్షిణ ప్రాంత తేలిక నేలల రైతు సంఘం నాయకులు

ప్రకృతి ప్రేమికులు.. పర్యావరణ రక్షకులు

'నో ప్లాస్టిక్ లంకమల్ల' చేపట్టిన యువత



లంకమల్ల ఆలయం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న యువత

బద్వేలు: మానవుడు చేసే తప్పిదాలు ప్రకృతికి శాపాలుగా మారుతున్నాయి. సాంకేతికత పెరిగే కొద్దీ మంచి కంటే చెడే ఎక్కువ జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఈ తప్పిదాలతో మానవులకు దూరంగా ఉన్న అడవులు కూడా కలుషితంగా మారుతున్నాయి. అలాంటి పరిస్థితి కొందరు యువకులను ఆలోచించేలా చేసింది. వారిని సామాజిక బాధ్యత దిశగా నడిపించింది. వారి ఆలోచనే 'నో ప్లాస్టిక్ లంకమల్ల' అనే కార్యక్రమం చేపట్టేలా చేసింది.

బద్వేలు ఆటవీ రేంజ్ పరిధిలో లంకమల్ల రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. సమీపంలోనే రెండు జలపాతాలు ఉన్నాయి. ఇక్కడికి శివరాత్రి, కార్తీక మాసాల్లోనే కాక వారాంతాల్లో కూడా పెద్ద సంఖ్యలో భక్తులు, ఆధ్యాత్మికం, విహారయాత్రల పేరిట వస్తుంటారు. ఆహ్లాదం పేరిట వచ్చే ప్రకృతి ప్రేమికుల సంఖ్య అధికమే. మొన్నటి శివరాత్రి పర్వదినానికి కనీసం పదివేల మందికి పైగా వచ్చి ఉంటారని అంచనా. ఆలయ కమిటీ, అటవీశాఖ సిబ్బంది ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రజల అవగాహన లేమి, నిర్లక్ష్యంతో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి.

జంతువులకు ప్రాణాపాయం

లంకమల్ల రామలింగేశ్వర ఆలయం, జలపాతాల చుట్టూ అడవి జంతువులకు నీళ్ల వసతి ఉండటంతో పలుజంతువులు తాగునీటికి అక్కడికి వస్తాయి. అడవిలోని ఎలుగుబంటి, చిరుతపులి, దుప్పులు, జింకలు, కొండగొర్రెలు, అడవిపందులు, రోసు కుక్కలు, నెమళ్లు, కొండకోళ్లు వంటివి నీరు తాగడానికి వస్తుంటాయి. అందుకే ఈ ప్రాంతాన్ని వైల్డ్‌లైఫ్ శాంక్చ్యూరీగా ప్రకటించారు. అక్కడ చేరిన ప్లాస్టిక్‌తో నీటి కోసం వచ్చే జంతువులకు ఇబ్బంది కలగడంతో పాటు పరిసరాలు ప్రాణాపాయంగా మారుతున్నాయి.

సామాజిక స్పృహతో ఆలోచన

లంకమల్ల అడవీ సమీప గ్రామమైన నందిపల్లెలో వివేక్‌రెడ్డి అనే యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా హైదరాబాద్‌లో పని చేస్తుండేవాడు. ప్రకృతి మీద ప్రేమతో స్నేహితులతో కలిపి ఆడవులు, ప్రాజెక్టుల సందర్శనకు వెళుతుండేవాడు. ఇదే రీతిన లంకమల్లలో ఒక పర్యాయం పర్యటించారు. అప్పుడు అక్కడ ఉన్న చెత్త చెదారం వారిని ఆలోచించేలా చేసింది. తన ఆలోచనను 'ఇన్ టు ది నేచర్' సంస్థతో పంచుకుని 'నో ప్లాస్టిక్ లంకమల్ల'గా మార్చి ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడు. పూర్తిగా నిర్మూలించకపోయినా కొంతైనా తీవ్రత తగ్గించాలని అనుకున్నాడు.



వ్యర్థాలను ట్రాక్టర్‌లోకి చేరుస్తున్న యువత

తోడుగా వచ్చిన స్నేహితులు

వివేక్ ఆలోచనకు తోడైన స్నేహితులతో కలిసి 2021 జులై, 17న మొదటి పర్యాయం ఆలయం, జలపాతాల సమీపాన పేరుకుపోయిన చెత్తను సేకరించి వాహనాల్లో అడవి బయటకు తరలించారు. అటుతర్వాత 45 మందికి చేరిన తమ వలంటీర్లతో అడవిలోని చెత్త, ప్లాస్టిక్‌ను తొలగించారు. ఆలయ పరిసరాలను కాలుష్య రహితంగా మార్చారు. ఈ ఏడాది విషయం తెలిసి అటవీ, రెవెన్యూ, పలు విద్యాసంస్థలు వారితో జత కట్టాయి. బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, అటవీశాఖ డీఆర్వో వెంకటశేషయ్య, ఎస్బీవీఆర్ విద్యాసంస్థల విద్యార్థిని, విద్యార్థులు కలిసి 102 మంది దాదాపు రెండు ట్రాక్టర్లకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఆటవీ నుంచి తొలగించారు. రాబోయే రోజుల్లో కూడా దీన్ని ఏటా కొనసాగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

సమతుల్యత అవసరం

ప్లాస్టిక్ వ్యర్థాలు అడవి జంతువుల శరీరంలోకి చేరుతున్నాయి. అలాగే నేలలోకి చేరి నీరు, భూమి కలుషితమవుతున్నాయి. దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినే అవకాశమూ ఎక్కువ. అది జంతువుల మనుగడకు ముప్పుగా మారితే అది మనుష్యులపైన ప్రభావం చూపుతుంది. ఇందుకు అడవులను కాపాడుకోవాలి. అదే ఉద్దేశంతో అడవిలోని ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని కార్యక్రమం ఏటా చేపడుతున్నా.

– అరణ్య శేఖర్, పోలీస్ శాఖ, ఇన్ టు ది నేచర్ సభ్యులు

ప్రకృతిని కాపాడుకోవాలనే

మానవుల తప్పిదాలు ప్రకృతికి శాపాలుగా మారుతున్నాయి. ఎంతో ఆరోగ్యకరంగా ఉండాల్సిన అడవులు సైతం కలుషితం అవ్వడం చాలా బాధాకరం. అటవీ సందర్శనలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ఉండటం చూసి 'నో ప్లాస్టిక్ లంకమల్ల' కార్యాక్రమం చేపట్టా. మిత్రులు అండగా నిలవడంతో దీన్ని కొనసాగిస్తున్నా. రాబోయే కాలంలో ఆలయంతో పాటు ఇతర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నా.

– వివేక్ లంకమల్ల, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, నందిపల్లె

బాధ్యతగా వ్యవహరించాలి

మనం అటవీ ప్రాంతాల్లోకి వెళ్లినప్పుడు ఎలా వెళతామో.. అలానే బయటకు వస్తే ఎటువంటి సమస్య ఉండదు. లంకమల్ల పరిసరాల్లో వాటర్ బాటిల్స్, ప్యాకెట్స్, ప్లాస్టిక్ ప్లేట్స్, ఇతర మైక్రో ప్లాస్టిక్స్ ఎక్కువగా ఉన్నాయి. వాటిని తీవ్రతను తగ్గించేలా విస్తరాకులు, చాలాసార్లు ఉపయోగించే వాటర్ క్యాన్లు వాడేలా చూస్తాం. ఎవరైనా అడవిలోకి ప్లాస్టిక్ తీసుకెళుతుంటే కొంత నగదును డిపాజిట్ చేయించుకుని, ప్లాస్టిక్ తిరిగి వెనక్కి తెస్తే డిపాజిట్ చెల్లించేలా అటవీ శాఖతో కలిసి చర్యలు తీసుకుంటాం.

–ఆకుల వెంకటరమణ, ఆర్డీఓ, బద్వేలు

కళాకృతి.. అంతర్జాతీయ ఖ్యాతి

తాడేపల్లిగూడెం : వాడిన పూలను వికసింపజేసే డ్రైఫ్లవర్ టెక్నాలజీతో కళాకృతులు సృష్టించడానికి శ్రీకారం చుట్టిన పశ్చిమగోదావరి జిల్లా మహిళలు అనతికాలంలోనే ఇతర దేశాల్లోనూ ప్రాచుర్యం పొందారు. కేవలం 24 నెలల వ్యవధిలో రాష్ట్రంలో మాస్టర్ ట్రైనర్‌లుగా ఖ్యాతి గాంచిన డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శిక్షణ పొందిన మహిళలు రాష్ట్రంలో ఈ పరిజ్ఞానాన్ని మారుమూల గ్రామాల ప్రజలకు చేర్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాల్లో వినియోగించే పూలతో అపురూప ఆకృతులను తయారుచేస్తున్న మహిళలు పది మంది బంగ్లాదేశ్ మహిళలకు శిక్షణనిచ్చే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీ పరిధిలోని కేవీకే ఈ శిక్షణకు వేదికయ్యింది. డ్రైఫ్లవర్ టెక్నాలజీ గుబాళింపు దేశ హద్దులు దాటడంపై స్వయం సమృద్ధి సాధించామని మహిళలు సంబరపడుతున్నారు.

వాడిన పూలతో వండర్స్

- డ్రైఫ్లవర్ టెక్నాలజీలో బంగ్లాదేశ్ మహిళలకు శిక్షణ
- వెంకట్రామన్నగూడెం కేవీకేలో ప్రత్యేక ఏర్పాట్లు
- మాస్టర్ ట్రైనర్లుగా 'పశ్చిమ' మహిళలు

వాణిజ్యపు విలువలతో..

వాడిన పూలకు వాణిజ్యపు హంగులు తీసుకురావాలనే సంకల్పంతో డ్రైఫ్లవర్ టెక్నాలజీపై శిక్షణ ప్రారంభించారు. దీంతో వాడిన పూలతో మహిళలు భగవంతుని రూపాలు, కళాకృతులు తీర్చిదిద్దుతున్నారు. వీటిని అందమైన ఫ్రేమ్‌లో బిగించి వాణిజ్య విలువ కల్పిస్తున్నారు. ఎండిన ఆకులు, కాయలను వినియోగించి కళాకృతులు, వాల్ హ్యాంగింగ్స్, రోజెట్, తిల్లీటీ, దేవతామూర్తుల చిత్రపటాలను తయారు చేస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్‌లతో ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో చీని నిమ్మ పరిశోధన స్థానంలో తిరుపతిలోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో 350 మందికి శిక్షణ ఇచ్చారు. టీటీడీతో జరిగిన ఒప్పందం నేపథ్యంలో ఈ కళాకృతులు ప్రముఖులకు ఇచ్చే జ్ఞాపికలుగా మారుతున్నాయి.

శిక్షణలో రాటుదేలి..

కేవీకే పర్యవేక్షణలో పదిలం సత్యవతి, నీలపాల రాజ్యలక్ష్మి, పోతూరి శ్రీలక్ష్మి, మడల వాణి, పదిలం దివ్యజ్యోతి, మరిడి శోభారాణి, నాగిరెడ్డి దుర్గాదేవి, యర్రా లలిత, చాల్వల వీరదుర్గ, తుమ్మల వెంకటలక్ష్మి మాస్టర్ శిక్షకులుగా ఎదిగారు. వీరు రాష్ట్రంలో మహిళలకు డ్రైఫ్లవర్ టెక్నాలజీపై శిక్షణ ఇచ్చారు. అలాగే బంగ్లాదేశ్ మహిళలకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. వేంకటేశ్వరస్వామి నుంచి చిన్ని కృష్ణుని వరకు కళాకృతులను సృష్టించి సీఎం జగన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వంటి వారికి బహుమతులుగా కూడా ఇచ్చారు. మహిళా సాధికారత, స్వయం సమృద్ధికి రాష్ట్రం పర్యవేక్షణలో ఉద్యాన వర్సిటీ ముందుకు సాగడంతో 67 మంది మహిళా ఉద్యోగుల్లో ఏఎస్ పద్మావతమ్మ, సూర్యకుమారి, ఈ.కరుణశ్రీ, సలోమి సునీత వంటి వారు ఉన్నత స్థానాల్లో ఉన్నారు.



డ్రైఫ్లవర్ టెక్నాలజీ శిక్షణలో మహిళలు

శిక్షణ ప్రారంభం

బంగ్లాదేశ్‌లోని మహిళలకు అలంకరణ పూలు, విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీ అనే అంశంపై కేవీకేలో బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు శిక్షణ ప్రారంభమైంది. డ్రైఫ్లవర్ టెక్నాలజీ గురించి తెలుసుకున్న బంగ్లాదేశ్ ప్రభుత్వ సౌజన్యంతో ఈ శిక్షణ కోసం పది మందిని మన రాష్ట్రానికి పంపించారు.

శిక్షణ ఇచ్చే అవకాశం

మాది నల్లజర్ల మండలం తిమ్మన్నపాలెం. వ్యవసాయ కూలీగా పనిచేసే నాకు కేవీకే ద్వారా అందించిన ఎండు పూలకు వాణిజ్యపు విలువలు అందించే శిక్షణ బాగా దోహదపడింది. బంగ్లాదేశ్ మహిళలకు శిక్షణనిచ్చే అవకాశం రావడం ఆనందంగా ఉంది.

–పదిలం సత్యవతి

మహిళలకు ఆసరాగా..

ఎండు పూలతో కళాకృతులను సృష్టించే కార్యక్రమం ద్వారా మహిళలకు ఆసరా దొరికింది. రాష్ట్రంలో వందల మందికి మహిళలతో పాటు బంగ్లాదేశ్ వారికి కూడా శిక్షణ ఇచ్చే అవకాశం కేవీకే ద్వారా, వీసీ టి.జానకీరామ్ కృషితో రావడం సంతోషంగా ఉంది.

–ఈ.కరుణశ్రీ, కేవీకే సమన్వయకర్త, వెంకట్రామన్నగూడెం

ఎక్కువ పొందాలనే ఆశతో ఇవ్వకు (ఉపకారం చేయకు)!
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, మార్చి, 10

అఫ్గాన్ విషాద సంగీతం

చేసిన పాపాలు శాపాలై వెంటాడతాయంటారు. అఫ్గానిస్తాన్‌లో రెండు దశాబ్దాలుగా తప్పు మీద తప్పు చేసుకుంటూ పోయిన అమెరికా అటువంటి స్థితినే ఎదుర్కొంటున్నది. ఆ దేశానికి అన్ని రకాలుగా తోడ్పడిన పాకిస్తాన్ వర్తమాన దుఃస్థితి చెప్పనవసరమే లేదు. అఫ్గాన్ నుంచి 2021 ఆగస్టు 15న అమెరికా సైన్యం కంగారుగా, బాధ్యతారహితంగా, పరమ అరాచకంగా వెనక్కొచ్చిన ఉదంతంపై బుధవారం అమెరికన్ కాంగ్రెస్ విదేశాంగ శాఖ కమిటీ ముందు పలువురు మాజీ సైనికాధికారులు, సైనికులు ఇచ్చిన వాంగ్మూలాలు అందరినీ దిగ్భ్రాంతిలో ముంచెత్తాయి. అదే రోజు మహిళా దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ మాట్లాడుతూ అఫ్గానిస్తాన్ మహిళలు ప్రపంచంలోనే అత్యంత దారుణమైన మానవ హక్కుల ఉల్లంఘనను చవిచూస్తున్నారని ప్రకటించారు. వెనకా ముందూ చూసుకోకుండా తాలిబన్‌లతో ఆదరాబాదరాగా ఒప్పందం కుదుర్చుకుని అక్కడినుంచి వెనుదిరిగిన అమెరికాయే ఈ పరిస్థితికి కూడా బాధ్యత వహించాల్సి వుంటుంది.

నిష్క్రమణ రోజు కాబూల్‌లోని హమీద్ కర్జాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒకదాని వెంబడి ఒకటి చోటుచేసుకున్న ఉదంతాలు ఎవరూ మరువలేరు. తాలిబన్‌ల పునఃప్రవేశం, అమెరికా సైన్యం నిష్క్రమణ ఖాయమని నిర్ధారించుకున్నాక వేలాదిమంది అఫ్గాన్ పౌరులు ఆ విమానాశ్రయానికి తరలివచ్చారు. అలా దాదాపు లక్షా 24 వేలమంది విమానాశ్రయంలో తలదాచుకోగా అంతకు రెట్టింపుమంది అప్పటికే దాదాపు 40 శాతం భూభాగం సొంతం చేసుకున్న తాలిబన్‌ల పడగ నీడలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని తమ విముక్తి కోసం ఎదురుచూశారు. నడిరోడ్లపై పడిగాపులు పడ్డారు. వీరంతా దాదాపు ఇరవైయ్యేళ్లుగా అమెరికా సైన్యానికి అండదండలందించినవారే. వీరిలో అనేకమంది పౌరులపై తాలిబన్‌లు దౌర్జన్యాలకు దిగటం ప్రారంభించారు. నిలదీసినవారిలో కొందరినైతే అక్కడికక్కడే కాల్చిచంపారు. పరిస్థితిని చక్కదిద్దటానికీ, నిష్క్రమణ సాఫీగా సాగటానికీ తాలిబన్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్న సీనియర్ అధికారులు వీటిల్లో చాలా ఉదంతాలను చూసీచూడనట్టు వదిలేశారు. కొన్నింటిని లేవనెత్తినా 'అది మా ఆంతరంగిక సమస్య' అంటూ తాలిబన్‌లు బదులిచ్చినప్పుడు మౌనంగా ఉండిపోయారు. ఈలోగా భారీయెత్తున పేలుడు సంభవించి 200మంది అఫ్గాన్ పౌరులతోపాటు 13 మంది అమెరికన్ సైనికులు మరణించారు. అనేకులు వికలాంగులుగా మిగిలిపోయారు. సుశిక్షితమైన సైన్యం, అత్యాధునిక సాంకేతికత ఉండి, ప్రత్యర్థులతో సంప్రదింపులు జరిపేటపుడు అనుకున్నది సాధించేవరకూ పట్టుదలగా వ్యవహరిస్తుందని గుర్తింపు పొందిన అమెరికా అఫ్గాన్ చిట్టచివరి అధ్యాయంలో బేలగా మిగిలిపోయింది. యుద్ధ కాలంలో సహకరించినవారిని చిట్టచివర నట్టేట ముంచుతుందన్న అపఖ్యాతి అమెరికాకు ఉన్నదనీ, అఫ్గాన్ పౌరుల విషయంలో అది మరోసారి రుజువైందనీ కమిటీ ముందు ఒక మాజీ సైనికాధికారి వాపోయిన తీరు ఆనాటి పరిస్థితులకు అద్దం పడుతుంది. ఆండ్రూస్ అనే మాజీ మెరైన్ ఒకరు 200 మంది దుర్మరణం పాలైన ఘటన గురించి చెప్పిన అంశాలు దిగ్భ్రాంతి కలిగిస్తాయి. మానవ బాంబులుగా అనుమానించిన ఇద్దరు జన సమూహంవైపు రావటం చూసిన ఆండ్రూస్, అతని సహచర సైనికుడు వారిపై చర్య తీసుకునేందుకు కమాండర్ అనుమతి కోరారట. కానీ ఆయన నిరాకరించారు. మరికాస్సేపటికి మానవ బాంబులు తమను తాము పేల్చుకున్నారు. చిత్రమేమంటే ఆ తర్వాత మరో మూడు రోజులకు విమానాశ్రయానికి దగ్గర్లో ఒకరిని మానవబాంబుగా అనుమానించి అమెరికా సైనికులు డ్రోన్ దాడి ద్వారా మట్టుబెట్టే ప్రయత్నం చేశారు. తీరా ఆ దాడిలో ఒక అఫ్గాన్ కుటుంబంలోని ముగ్గురు పెద్దలు, ఏడుగురు పిల్లలు మరణించారు. ఇలా తప్పు మీద తప్పు చేస్తూ పోయిన అమెరికా అఫ్గాన్ పౌరులకు మాత్రమే కాదు... తన సైనికులకు కూడా అన్యాయం చేసింది. ఆ యుద్ధంలో పాల్గొన్న అనేకమంది సైనికులు ప్రస్తుతం అనేక మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అమెరికా పరువుప్రతిష్ఠలు కోల్పోయింది. దాదాపు 2,500 మంది సైనికులను పోగొట్టుకుని, 2 లక్షల కోట్ల డాలర్ల సొమ్ము వృథా వ్యయం చేసింది. కానీ అఫ్గాన్ దేశానికీ, పౌరులకూ కలిగిన నష్టం అపారం. అదిప్పుడు శిథిలాల గుట్టగా మారింది. ఆ దేశ పౌరుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. 80వ దశకంలో సోవియెట్ దురాక్రమణను ఎదుర్కొనే నెపంతో పాకిస్తాన్ ద్వారా అఫ్గాన్‌లో మతమౌఢ్యం పెంచి అల్ కాయిదా, తాలిబన్ వంటివి ఏర్పడటానికి దోహదపడింది అమెరికాయే. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికల ద్వారా సంక్షోభాన్ని పరిష్కరించే ప్రయత్నం చేస్తే ఇంత చేటు ఉపద్రవం దాపురించేది కాదు. అక్కడ జోక్యం చేసుకోవటం ఎంత తప్పో, బాధ్యతారహితంగా నిష్క్రమించటం కూడా అంతే నేరం.

అమెరికా నిర్వాకానికి ఇప్పుడు రెండున్నర కోట్లమంది మహిళలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. మొదట్లో తమ పాలనకు అంతర్జాతీయ గుర్తింపు పొందటానికి మహిళలకు అన్ని రకాల హక్కులూ ఇస్తామని నమ్మబలికిన తాలిబన్‌లు ఇప్పుడు అన్ని రంగాల నుంచీ వారిని వెళ్లగొట్టారు. చదువులకు దూరం చేశారు. ట్రంప్ ఏలుబడినుంచీ వారిపై అమెరికాకు మంచి అభిప్రాయం కలగజేసిన పాకిస్తాన్‌కు సైతం వారిప్పుడు కొరకరాని కొయ్యలయ్యారు. అమెరికన్ కాంగ్రెస్ కమిటీ ముందు వెల్లడైన అభిప్రాయాలు, ఇప్పుడు అఫ్గాన్ మహిళలు అనుభవిస్తున్న నరక యాతనలు ఆ దేశం కళ్లు తెరిపించాలి. జవాబుదారీతనాన్నీ, బాధ్యతాయుత ప్రవర్తననూ అలవర్చాలి.

విధాన లోపం వ్యవస్థకు శాపం

విశ్లేషణ



డి. పాపారావు

2023 ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసికానికి భారత ఆర్థిక వ్యవస్థ కేవలం 4.4 శాతం స్థూల జాతీయ వృద్ధి రేటును మాత్రమే సాధించగలిగింది. ప్రజల కొనుగోలు శక్తి దిగజారిపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ జీడీపీ పతనం భారత దేశానికి మాత్రమే పరిమితం కాదు. అమెరికా, జపాన్, జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలలో అది 1 శాతానికి లోపు పరిమితమైంది. ఈ దేశాలన్నింటికీ ఉన్నటువంటి కీలక సారూప్యత – ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో ఉండడం. ఈ దేశాలన్నింటిలోనూ కార్మికులు, ఉద్యోగుల వేతనాల పెరుగుదల బలహీనంగా ఉంది. ప్రభుత్వ విధానాలు మెజారిటీ ప్రజానీకానికి నష్టం కలిగించేవిగా ఉండడం వలననే జీడీపీ దారుణంగా పతనమయ్యింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సర కాలానికి సంబంధించి డిసెంబర్ 2022తో ముగిసిన మూడవ త్రైమాసికానికి భారత ఆర్థిక వ్యవస్థ కేవలం 4.4 శాతం స్థూల జాతీయ వృద్ధి (జీడీపీ) రేటును మాత్రమే సాధించగలిగింది. అంతకు ముందరి త్రైమాసిక వృద్ధి రేటు 6.3 శాతం కంటే ఇది గణనీయమైన పతనం. 2022 ఆర్థిక సంవత్సరం తాలూకూ మూడవ త్రైమాసికంలోని 5.2 శాతం కంటే కూడా ఇది తక్కువ. ఈ జీడీపీ దిగజారుడు మన దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొంటున్న అనేక సమస్యలకు ప్రతిబింబం.



వృద్ధి రేటును లెక్కించేందుకు పరిగణనలోకి తీసుకునే అంశాలుగా వ్యక్తిగత వినియోగం, ప్రభుత్వ వినియోగం లేదా వ్యయాలు, పెట్టుబడులు, నికర ఎగుమతులు ఉంటాయి. వీటిలో వ్యక్తిగత వినియోగానిది అతిపెద్ద వాటా. అది దేశీయ జీడీపీలో 55 నుంచి 60 శాతం మేరకు వాటాని కలిగి ఉంటుంది. కాగా, ఇది ప్రస్తుతం అంతకు ముందరి మూడవ త్రైమాసికంలోని వృద్ధి రేటుతో పోలిస్తే కేవలం 2.1 శాతం మాత్రమే ఎదుగుదలను చూపింది. ప్రస్తుత జీడీపీ వృద్ధి రేటు పతనం వెనుక వ్యక్తిగత వినియోగ పతనం ఉందన్నది గమనించాల్సిన అంశం. ఈ వ్యక్తిగత వినియోగం తగ్గటం వెనుక అసమానతలతో కూడిన ఆర్థిక అభివృద్ధి ఉంది. దీనినే మనం ఆంగ్లాక్షరం 'కే' పై గీత, కింది గీతలతో పోలుస్తున్నాం. పై గీతను పోలిన ధనవంతులు మరింతగా ధనవంతులవుతుండగా, కింది గీతను పోలిన సామాన్య జనం మరింత కిందికి దిగజారుతున్నారు.

ఈ అసమానతల అభివృద్ధికి వక్కాణింపుగా – ఇండియా రేటింగ్స్ సంస్థ ఆర్థిక వేత్త సునీల్ కుమార్ సిన్హా మాటలను చెప్పుకోవచ్చు: 'ప్రస్తుత వినియోగ డిమాండ్ అనేది ప్రధానంగా ఉన్నత ఆర్థిక వర్గాలు వినియోగించే సరుకులు, సేవల నుంచే వస్తోంది. అంటే, ప్రస్తుతం దేశంలోని ప్రజల వ్యక్తిగత వినియోగంలో సింహభాగం – ఉన్నత ఆదాయ వర్గాల నుంచే వస్తోంది. మరో రకంగా చెప్పాలంటే – మెజారిటీ జన సామాన్యం కొనుగోళ్లు బలహీనంగా ఉన్నాయి. ఫలితంగా అంతిమ లెక్కింపులో దేశంలో వ్యక్తిగత వినియోగం బలహీనపడుతోంది'.

కోవిడ్ మహమ్మారి కాలంలో దేశంలో ప్రజల వినియోగం భారీగా పడిపోయింది. ఈ పరిస్థితి నుంచి ఉపశమనం లభించిన తొలి దశలో ఈ వ్యక్తిగత వినియోగం పెద్దగంతులో పెరిగింది. కోవిడ్, లాక్‌డౌన్ల కాలంలో ప్రజలు తమకు కావాల్సిన సరుకులు లేదా సేవల కొనుగోళ్లను వాయిదా వేసి ఉంచడం... కోవిడ్ బెడద తగ్గగానే ఒక్కసారిగా కొనుగోళ్లు చేయడం ఈ పెద్దగంతు వినియోగ పెరుగుదలకు కారణం. ఒక మారు ఈ తరహా కొనుగోళ్లు పూర్తయి పోగానే, మరలా వినియోగం తగ్గుముఖం పట్టసాగింది. కోవిడ్ అనంతర కాలంలో కూడా జఠిలంగానే మిగిలి పోయిన నిరుద్యోగం, పడిపోతున్న దేశీయ ఎగుమతులు, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం వంటి సమస్యలన్నీ కలగలిసి ప్రజల కొనుగోలు శక్తి దిగజారింది. కోవిడ్, లాక్‌డౌన్ల, అనంతరం కూడా సామాన్య ప్రజానీకం పెద్ద ఎత్తున అప్పుల పాలయ్యారు. బంగారాన్ని తనఖా పెట్టడం భారీగా పెరిగింది. ఈ క్రమంలోనే సామాన్య ప్రజల పొదుపు స్థాయి దారుణంగా పడి పోయింది. కొత్తగా అప్పులు చేయగల స్థితి కూడా లేకుండా పోయింది.

జీడీపీ పతనం కేవలం భారత దేశానికి మాత్రమే పరిమితం కాదు. గడచిన ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో అమెరికా, జపాన్, జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలలో అది 1 శాతానికి లోపు పరిమితమైంది. అంటే, భారతదేశంలో జీడీపి వృద్ధి, మిగత ప్రపంచం తాలూకూ సమస్యలతో సంబంధం లేకుండా, ప్రపంచంలోనే అత్యధికంగా ఉంటుందనే కట్టుకథను ఇది వట్టిదిగా కొట్టేసింది. పైన పేర్కొన్న దేశాలన్నింటికీ ఉన్నటువంటి కీలక సారూప్యత – ఆయా దేశాలలో ఆర్థిక అసమానతలు అత్యంత తీవ్రస్థాయిలో ఉండడం. భారత్ సహా దరిదాపు ఈ దేశాలన్నింటిలోనూ కార్మికులు, ఉద్యోగుల వేతనాల పెరుగుదల బలహీనంగా ఉంది. ఉదాహరణకు, అంతర్జాతీయ కార్మిక సమాఖ్య గణాంకాల ప్రకారం 2008–11 కాలంలో మన దేశంలో నిజ వేతనాల పెరుగుదల 1 శాతం ప్రతికూల దిశగా ఉన్నది. అదే కాలంలో దేశంలో కార్మిక ఉత్పాదకత 7.6 శాతం పెరిగింది. పెరిగిన సంపద తాలూకు ప్రయోజనం కార్మికులు, ఉద్యోగులకు దక్కక పోగా, వారికి అప్పటికే ఉన్న ఆర్థిక స్థితి దిగజారింది.

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో జరుగుతోంది ఈ వేతనాల పతనమే. 2018 నాటి అంతర్జాతీయ కార్మిక సమాఖ్య తాలూకు ప్రపంచ వేతనాల నివేదిక కూడా ఈ అంశాన్నే చెబుతోంది. ఒక్క చైనా మినహా 2017లో ప్రపంచ వ్యాప్తంగా వేతనాల పెరుగుదల వార్షికంగా కేవలం 1.1 శాతం. జపాన్‌లో దశాబ్దాల కాలంపాటు ఉద్యోగులు, కార్మికుల వేతనాలు ఎదుగూ బొదుగూ లేకుండా స్తంభించిపోయి ఉన్నాయి. మొత్తంగా జీ 20 దేశాల్లో 2017లో నిజ వేతనాల వృద్ధి కేవలం 0.4 శాతం.

చైనాలో 2015 నాటికే సరుకు ఉత్పత్తి రంగంలోని కార్మికుల 1 గంట కాలపు వేతనాలు, అప్పటికే అధిక ఆదాయ దేశాలుగా ఉన్న గ్రీస్, పోర్చుగల్‌తో సమానంగా ఉన్నాయి. దాని వలన అక్కడ యావన్మంది ప్రజల కొనుగోలు శక్తి తగినస్థాయిలో ఉంది. ఫలితంగానే 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం అనంతరం తన దేశీయ ఎగుమతులు కొంత మేర తగ్గినా, స్వయంగా తన దేశంలోనే పెరిగిన ప్రజల కొనుగోలు శక్తి ద్వారా, ఆర్థిక వృద్ధిని కొనసాగించగలిగింది. ప్రస్తుతం తన జీరో కోవిడ్ పాలసీ, నిర్మాణ రంగం పట్ల కఠిన వైఖరి తరువాత కూడా చైనాలో కర్మాగారాల ఉత్పత్తి రికార్డు స్థాయిని అందుకుంది. దీనంతటికీ కారణం, కొనుగోలు శక్తి ప్రజానీకం అంతటిలోనూ విస్తారంగా పెరిగి ఉండడమే.

మన దేశంలో నేడు సంస్కరణల పేరిట అమలు జరుగుతోన్న విధానాలు పొదుపు చర్యల రూపంలో ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయి. ఈ పొదుపు చర్యల వల్ల ప్రతీ సంవత్సరం సంక్షేమ కార్యక్రమాలపై కోతలు పడుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో కూడా ఆహారం, ఎరువులు, ఇంధన సబ్సిడీలు, జాతీయ ఉపాధి హామీ పథకం వంటి అనేక సంక్షేమ విధానాలపై కోతలు పడడం చూశాం. ఈ పొదుపు చర్యలలో భాగంగానే దేశంలో ప్రభుత్వ ఉద్యోగాల కల్పన గణనీయంగా తగ్గిపోయింది. 2022లోనే దీనిలో 8.8 శాతం తగ్గుదల నమోదైంది. దీనంతటి ఫలితంగా ప్రజల ఉపాధి అవకాశాలు, కొనుగోలు శక్తి వేగంగా పడిపోతున్నాయి. దశాబ్దాల కాలం ప్రజల పన్నుల డబ్బు, శ్రమలతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలు వేగంగా ప్రైవేటు పరం అవుతుండడం... దేశంలోని రోడ్లు, రైలు మార్గాలు, స్టేడియాలు ఇత్యాది సమస్త మౌలిక సదుపాయాల వ్యవస్థలూ నగదీకరణ పేరిట ప్రైవేట్ పరం అవుతుండడంతో – ప్రజల ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఆదాయాన్ని పెంచుకునే పేరిట (ద్రవ్యలోటు తగ్గింపు కోసం) నిత్యావసరాల పైన కూడా జీఎస్టీ వంటి పన్ను భారాలను మోపడం ప్రజల కొనుగోలు శక్తి పాలిట అశనిపాతంగా మారుతోంది.

ప్రభుత్వ విధానాలు కూర్చున్న కొమ్మను నరుక్కున్న విధంగా, మెజారిటీ ప్రజానీకానికి నష్టం కలిగించేవిగా ఉండడం వలననే జీడీపీ దారుణంగా పతనమయ్యింది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు మార్గం – ఇప్పటి వరకూ జరిగినట్లుగా కార్పొరేట్లకు మరిన్ని రాయితీలు ఇస్తూపోయి, జన సామాన్యంపై భారాలు మోపుతూ నిర్ణయాలు తీసుకోవడం కాదు. సంపదలో సాధ్యమైనంతగా కార్మికులు, ఉద్యోగులు, మధ్య తరగతి జనాలకు తగిన వాటాను కల్పించడం! ప్రస్తుత వృద్ధి రేటు పతనం, దానికి మూలంగా ఉన్న ప్రజల కొనుగోలు శక్తి పతనం వంటి వాటిని పరిష్కరించలేని పక్షంలో ముమ్ముందు దేశ ఆర్థిక సమస్యలు మరింత జఠిలం కాగలవు.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇవి చాలు...



హ్యాపీ విమెన్స్ డే అని మాకు చెప్పే బదులుగా – మమ్మల్ని ఉద్యోగాల్లోకి తీసుకోండి. వేతనాలు చెల్లించండి. మేము రాసేది చదవండి. మమ్మల్ని ఉటంకించండి. మా గొంతులను వినండి. మా చదువులకు ప్రతిబంధకాలు సృష్టించకండి. మమ్మల్ని గర్భంలోనే చంపకండి.

– నికితా సూద్, ప్రొఫెసర్

నియంత్రణలు



రంజాన్ నేపథ్యంలో సౌదీ అరేబియాలో బిన్ సల్మాన్ కొన్ని నియంత్రణలు తెచ్చారు. లౌడ్ స్పీకర్లు వాడొద్దు. ప్రార్థనలను బ్రాడ్‌కాస్ట్ చేయొద్దు. విరాళాలు సేకరించొద్దు. మసీదుల్లో పిల్లలు ఉండొద్దు. మసీదు లోపల ఇఫ్తార్ పార్టీలు ఏర్పాటు చేయొద్దు.

– సమీ హమ్దీ, కామెంటేటర్

నేర్పాల్సిన విషయాలు



రాజనీతి శాస్త్రంలో కనీసం ఆరు నెలల కోర్సుతో కూడా మన పాలకులు లబ్ధి పొందుతారు. ఎన్నికైన ప్రతినిధులు అందరి ప్రయోజనాలకూ ప్రాతినిధ్యం వహిస్తారనీ; ప్రభుత్వం అనేది దేశం కాదు, సంరక్షకురాలనీ; పౌరులకు హక్కులు, ప్రభుత్వానికి బాధ్యతలుంటాయనీ; రాజ్యాంగమే పరమం అనీ వాళ్లు నేర్చుకుంటారు.

నీరా చాందోక్, ప్రొఫెసర్

అప్పుడేనా?



ఆత్మీయత, ప్రేమ, నవ్వులు కలిసిన మనిషి సతీశ్ కౌశిక్ (నట దర్శకుడు). కనీసం నలభై ఏళ్లుగా నాకు సోదరుడిలా ఉన్నాడు. నాకంటే పన్నెండేళ్లు చిన్నవాడు. సతీశ్ జీ, మీ టర్న్ ఇది కానే కాదు.

– జావేద్ అఖ్తర్, సినిమా రచయిత

అనవచ్చా?



'ముందు బొట్టు పెట్టుకో. నీ భర్త బతికే ఉన్నాడు. అవునా? నీకు ఇంగితం లేదా?' అని ఒక కూరగాయలు అమ్ముకునే మహిళ మీద కోలార్ బీజేపీ ఎంపీ ఎస్. మునిస్వామి అరుస్తున్నారు.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

ఎన్నికల ఏడాదిలో అబద్ధాల ప్రచారమే వారి ఎత్తుగడ!

అభిప్రాయం



కొమ్మినేని శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్‌లో ఇక ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం కాదు... 'ఈనాడు' మీడియానే. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కాదు... 'ఈనాడు' అధినేత రామోజీరావే! ఈ మధ్య కాలంలో 'ఈనాడు' మీడియాలో వస్తున్న వార్తలను గమనిస్తే ఈ అభిప్రాయం కలుగుతుంది. చంద్రబాబు చేసే విమర్శలకు తన మీడియాలో అత్యధిక ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు, టీడీపీ చెప్పడానికి ఇబ్బంది పడే విషయాలను రామోజీ తన భుజాన వేసుకుని మోస్తున్నారు. కొద్ది రోజుల క్రితం తాలిబన్ల రాజ్యం అంటూ సంపాదకీయంలో విషం కక్కిన ఆయన మరో అడుగు ముందుకేసి వలంటీర్ల వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం ఆరంభించారు. ఏకంగా వలంటీర్లపైనే ఒక ప్రముఖ పత్రిక సంపాదకీయం రాసిందంటేనే ఆ వ్యవస్థ ఏపీలో ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వారిని వైసీపీ వలంటీర్లు అని 'ఈనాడు' రామోజీ ముద్రవేసి ఇందులో రాజకీయాలను చొప్పించడానికి తీవ్రకృషి చేశారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. చంద్రబాబు నాయుడు ఒకప్పుడు వలంటీర్లను అవమానిస్తూ మాట్లాడారు. వారిని మూటలు మోసేవారిగా అభివర్ణించడమే కాకుండా, మధ్యాహ్నపువేళ మగవాళ్లు ఇళ్లలో లేనప్పుడు వారు వెళ్లి ఆడవారిని ఇబ్బందిపెడతారంటూ అభ్యంతర వ్యాఖ్యలు చేశారు. దానిపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దాంతో ఆయన తన స్వరం మార్చుకుని తాము కూడా వలంటీర్లను తొలగించబోమని చెప్పవలసి వచ్చింది. అయితే ఈ వ్యవస్థ వల్ల అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు జనంలో ఆదరణ పెరుగుతోందన్న భావన ఉంది. దీనిని దెబ్బకొట్టాలంటే ఏమి చేయాలన్న ఆలోచనతోనే బహుశా తమలో తాము చర్చించుకున్న తర్వాత రామోజీరావు రంగంలో దిగినట్లు అనిపిస్తుంది. అందుకే ఆయన హైకోర్టులో వలంటీర్లకు సంబంధించి ఒక పిటిషన్‌పై విచారణ జరుగుతుండగా... గౌరవ న్యాయమూర్తి వేసిన కొన్ని ప్రశ్నల ఆధారంగా సంపాదకీయం రాసేసి తన దుష్ట తలంపును బహిర్గతం చేసుకున్నారని అనుకోవచ్చు. హైకోర్టుకు కూడా తెలుగుదేశం అనుకూల వర్గాలే వెళ్లి ఉంటాయి. వలంటీర్ల వల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని రామోజీ కనిపెట్టేశారు.

మూడేళ్ల క్రితం ఈ వ్యవస్థ వచ్చాక ప్రజలకు ఎంతో సదుపాయం ఏర్పడింది. ప్రజలు ప్రభుత్వ ఆఫీస్‌ల చుట్టూ తిరిగే పని లేకుండా పోయింది. వారు దరఖాస్తులు సమర్పించడంలో సైతం తోడ్పడి వాటిని గ్రామ, వార్డు సచివాలయాలకు అందచేస్తున్నారు. ఆ తర్వాత తగు ప్రాసెస్ అయిన అనంతరం ఆదేశాలు వస్తున్నాయి. వాటిని తిరిగి వలంటీర్లు సంబంధిత దరఖాస్తుదారులకు వాటిని అందచేస్తున్నారు. ఇంత సౌలభ్యం దేశంలో ఎక్కడా లేదు. ఈ వలంటీర్ల గురించి టీడీపీ మీడియా చేస్తున్న అసత్య ప్రచారం వల్ల టీడీపీకి నష్టం వస్తోందని భావించి... కొత్త రూట్‌లో న్యాయస్థానం ద్వారా ఆటంకాలు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను గుర్తించడం ప్రభుత్వ అధికారుల విధి అనీ, ప్రజల సమాచారాన్ని వలంటీర్లు ఎలా ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారనీ గౌరవ న్యాయమూర్తి ప్రశ్నించారట. వాళ్లకేమైనా సర్వీస్ నిబంధనలు ఉన్నాయా అని కూడా అడిగారట. గౌరవ న్యాయమూర్తి తన సంశయాలను తీర్చుకోవడానికి ప్రశ్నలు వేయడం సమంజసమే. కానీ, హైకోర్టులో వచ్చిన ప్రశ్నల ఆధారంగా మొదటి పేజీలో ఒక కథనాన్ని రాయడమే కాకుండా, సంపాదకీయం కూడా రాసి రామోజీ తన కడుపుమంట తీర్చుకున్నారు. ఎటువంటి కట్టుబాట్లు లేని సొంత కార్యకర్తల సైన్యానికి సేవాదళమనే ముసుగును జగన్ వేశారని రామోజీ ఆరోపించారు. మరి ఇదే రామోజీ టీడీపీ హయాంలో నోట్లో వేలు వేసుకుని కూర్చున్నారా? అప్పట్లో ఘోరంగా జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను వేధించుకు తిన్నప్పుడు రామోజీకి అంతా బ్రహ్మాండంగా కనిపించిందా? స్థానిక టీడీపీ నేతల చుట్టూ తిరగలేక, వారికి ముడుపులు చెల్లించలేక ప్రజలు నానా యాతనలు పడినప్పుడు రామోజీకి అదంతా గొప్ప విషయంగా కనిపించింది.

ఇప్పుడు అలాంటి సమస్యలేవీ లేకుండా ప్రజలకు అత్యంత ప్రయోజనకరంగా ఉన్న ఈ వ్యవస్థను ఎలా దెబ్బతీయాలా అని రామోజీ కుట్ర చేస్తున్నారు. టీడీపీకి జరిగే నష్టంతో పాటు మరో ఏడుపు కూడా ఆయనకు ఉంది. అదేమంటే వలంటీర్లద్వారా ఒక పత్రిక కొనుగోలు చేస్తున్నారట. వారు 'సాక్షి' పత్రికనే కొంటున్నారట. అది కూడా వారికి తెగ బాధగా ఉంది. దీనిపై హైకోర్టుకు కూడా వెళ్లినా 'ఈనాడు'కు సానుకూలంగా ఫలితం రాలేదు. అయినా సంపాదకీయంలో మళ్లీ రోదిస్తూ అదే విషయం రాశారు. వీరు ఐటీ, పాన్ కార్డుల వంటి సున్నిత వ్యక్తిగత విషయాలను కూడా సేకరిస్తున్నారట. అలాగే జగన్ ప్రభుత్వం స్వేచ్ఛా పావురం గొంతు నులిమేస్తున్నదనీ, నియంతృత్వంగా ఆయన వ్యవహరిస్తున్నారనీ... ఇలా ఏవేవో రాశారు. జాగ్రత్తగా ఆలోచిస్తే రామోజీనే ఆంధ్ర ప్రదేశ్ పాలిట విష సర్పంగా మారారు. రామోజీ దృష్టిలో పౌరహక్కులంటే టీడీపీ చేసే అల్లర్లకు పూర్తి లైసెన్స్ ఇవ్వాలి. తాము ఎంత చెత్త



రాసినా ఎవరూ నోరెత్తకూడదు. ఇక్కడ ఒక ఉదాహరణ చెప్పాలి. గతంలో ర్యాలీలు తీశారనో, 144 సెక్షన్ ఉల్లంఘించారనో ఆనాటి విపక్ష నేతలు కొడాలి నాని, వైఎస్ అవినాశ్ రెడ్డి వంటి అనేకమందిపై కేసులు పెడితే ఇప్పటికీ వారు కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తోంది. కొందరిపై కోర్టు కేసులు కొట్టివేసింది. ఆ పరిస్థితి ఆనాడు ఉంటే అది అత్యంత ప్రజాస్వామ్యంగా రామోజీకి కనిపించింది. ఇప్పుడు రోడ్ల మీద అనుమతులు తీసుకుని రోడ్ షో, ర్యాలీలు జరుపుకోండనీ, ఇరుకు రోడ్లపై సభలు పెట్టి తొక్కిసలాటలకు కారణం కావద్దనీ ప్రభుత్వం ఆదేశం ఇస్తే... అది పౌరహక్కుల ఉల్లంఘన అని ఇదే రామోజీ ప్రచారం చేశారు. నడిరోడ్లపై సభలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించడం ప్రజాస్వామ్యం అని ఈయన కొత్త నిర్వచనం ఇచ్చారు.

వలంటీర్లు అధికార పార్టీకి ఉపయోగపడతారని కొందరు వైసీపీ నాయకులు ఏవేవో వ్యాఖ్యలు చేశారట. అవన్నీ శిలాశాసనాలుగా వలంటీర్లు పాటిస్తారన్నట్లుగా 'ఈనాడు' రాసింది. ఇందులో ఎంతవరకు హేతుబద్ధత ఉందన్నది ఆలోచిస్తే చాలా తక్కువే. కాకపోతే వలంటీర్లను చూసి టీడీపీ, చంద్రబాబు, 'ఈనాడు', రామోజీరావులు బాగా భయపడుతున్నారని మాత్రం తెలిసిపోతుంది. వలంటీర్లు క్షేత్ర స్థాయిలో ఉండే వర్కర్లు. వారు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులే తప్ప వారే నిర్ణయాధికారం కలిగినవారు కారు. అయినా రామోజీ తెగ ఆడిపోసుకున్నారు. ఈ మూడేళ్లలో జనం ఎక్కడా వలంటీర్ల మీద దాదాపు ఫిర్యాదులే చేయలేదు. పైగా ఈ వ్యవస్థ ఫలితాలను ఎంజాయ్ చేస్తున్నారు. ఎక్కడైనా ఒకటీ, అరా ఫిర్యాదులు వచ్చినా ప్రభుత్వం వారిపై చర్య తీసుకుంటోంది. ఇన్ని కోట్ల మందికి సేవలందిస్తున్న వలంటీర్లు ఎక్కడా ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కల్గించారనో, మరొకటనో ఫిర్యాదులే చేయలేదు. అయినా ఈ రకంగా తంపులు పెట్టాలని 'ఈనాడు' రామోజీ టీడీపీ వారికి సలహా ఇస్తున్నట్లుగా ఉంది.

పౌర హక్కుల గురించి ఇంత బాధపడుతున్న రామోజీ తన వ్యాపార సంస్థలలోఎక్కడైనా, ఎప్పుడైనా ఎలాంటి హక్కులైనా అమలు చేశారా? అక్కడ జర్నలిస్టులు, ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతారన్న సంగతి తెలియనిది ఎవరికి? మరి రామోజీ దీనికేమంటారు? ఆత్మవంచన కాక మరేమిటి? కేవలం తనకు సర్క్యులేషన్ ఎక్కువగా ఉందన్న ఒకే ఒక అహంభావంతో, తాను ఏమి రాసినా ఎంతో కొంత ప్రభావం ఉంటుందన్న భ్రమతో ఇలాంటి వాస్తవ విరుద్ధ సంపాదకీయాలు రాస్తున్నారు. రాజకీయ ప్రయోజనం, వ్యాపార లక్ష్యాలతో రామోజీ ఇలాంటి చెత్త సంపాదకీయాలు రాయడం జర్నలిజం విలువలకు, ప్రమాణాలకు పాతరేయడమే అవుతుంది. అందుకే ఇకపై రామోజీనే తనకు తానే ప్రధాన ప్రత్యర్థిగా ఊహించుకుంటూ ముఖ్యమంత్రి జగన్ పై ఉన్నవీ, లేనివీ కలిపి ఈ ఎన్నికల ఏడాది పచ్చి అబద్ధాలు ప్రచారం చేయడానికి సన్నద్ధం అవుతున్నారని ఇట్టే కనిపెట్టేయవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

దేవునికి చేరువ చేస్తూ...

సందర్భం



అడపా దుర్గ

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారినే నమ్ముకుని వెనకబడిన ఓ సామాజిక వర్గంవారు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణంలోనూ, విస్తరణ పనులలోనూ వారు పాలుపంచుకొంటున్నారు. వారే సగరులు (ఉప్పర్లు). సగర పుత్రులు తరతరాలుగా అమ్మవారి పల్లకీ సేవ కూడా చేస్తున్నారు. ఆ అట్టడుగు వర్గాల జీవితాలకు ఈరోజు ఓ గొప్ప అవకాశం దక్కింది. ఆ అమ్మవారి చెంత ప్రథమ సేవకుడిగా సేవ చేసుకొనే అవకాశం ఆ వర్గాల ప్రతినిధికి లభించింది. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక చర్యే కారణం.

సగర కులానికి చెందిన ఆధ్యాత్మిక చింతనా పరుడైన కర్నాటి రాంబాబు ప్రతిష్ఠాత్మకమైన ఇంద్రకీలాద్రి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా ఎన్నిక కావడం వల్ల... మొత్తం బడుగు వర్గాల్లో 'ఆధ్యాత్మిక సౌరభం' మరింత వెల్లివిరిసే అవకాశం కనిపిస్తోంది. భగీరథ వంశీయులుగా చెప్పబడే సగర పుత్రులకు... సీఎం చేసిన భగీరథ ప్రయత్నం కారణంగానే ఈ అరుదైన అవకాశం దక్కింది.

ఏపీలోని దేవాలయ పాలకమండళ్ల, ట్రస్ట్ బోర్డుల నియామకంలో ప్రభుత్వ విప్లవాత్మక నిర్ణయాలు... సాంఘిక దురాచారాలను రూపుమాపి సామాజిక న్యాయం సిద్ధించేలా చేస్తున్నాయి. 2019లో ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం కారణంగా పాలక మండళ్ల, ట్రస్ట్ బోర్డుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి; మహిళలకు 50 శాతం పదవులు దక్కుతున్నాయి. ఇంత కాలం దేవునికి అల్లంత దూరాన ఉన్న ఆ వర్గాల వారిని ముఖ్యమంత్రి నిర్ణయం అధికారికంగా దగ్గర చేసింది. భవిష్యత్‌లో ప్రతి పాలకమండలిలో నాయి బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలనే ముఖ్యమంత్రి నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవు తోంది.

2019లో ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆధ్యాత్మిక రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు అణగారిన వర్గాల్లో ఆత్మన్యూనతను పోగొట్టి స్థైర్యాన్ని నింపుతున్నాయి. విజయవాడ లాంటి కీలకమైన పట్టణంలో వెనకబడిన కులానికి చెందిన మహిళకు కార్పొరేషన్ మేయర్ పదవీ, మరింత వెనకబడిన సగర లాంటి కులానికి చెందిన యువకుడికి కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ పదవీ దక్కుతాయని ఎవరైనా అనుకున్నారా? మన సీఎం దానిని నిజం చేసి చూపించారు.

వ్యాసకర్త ఎస్వీబీసీ, టీటీడీ అడ్వైజర్ । 90007 25566

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.తదియ రా.8.25 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: చిత్త తె.5.58 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి స్వాతి, వర్జ్యం ప.1.27 నుండి 3.06 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.37 నుండి 9.14 వరకు, తదుపరి ప.12.34 నుండి 1.22 వరకు, అమృతఘడియలు: రా.11.21 నుండి 1.02 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.17, సూర్యాస్తమయం: 6.04

క్లుప్తంగా...

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు ప్రణాళిక

- ఈ నెల 30న శ్రీరామనవమి, పోతన జయంతి
- ఏప్రిల్ 5న సీతారాముల కల్యాణం



పోస్టర్లను విడుదల చేస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు

ఒంటిమిట్ట: ఏకశిలానగరిలో కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ ప్రణాళికను టీటీడీ ఖరారు చేసింది. ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయం ఆవరణలో వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజుతో కలిసి టీటీడీ ఈవో ధర్మారెడ్డి గురువారం మాట్లాడారు. మునుపటికంటే వైభవంగా వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ నెల 30న సాయంత్రం 4 గంటలకు మూలమూర్తులకు వ్యాసాభిషేకం, అదే రోజు రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. శ్రీరామనవమి పండుగను అధికారిక వేడుకగా నిర్వహించనున్నామన్నారు. సాయంత్రం 4 గంటలకు బమ్మెర పోతన జయంతి కార్యక్రమంతో పాటు కవి సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. 31న ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని, ఏప్రిల్ 5న రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఎదుర్కోలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 6న రథోత్సవం, 8న చక్రస్నానం, 9న సాయంత్రం పుష్పయాగం, అదే రోజు రాత్రి ఏకాంత సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు వివరించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటలకు వాహన సేవ ఉంటుందని, అలాగే ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు.

బీఎస్ఎన్ఎల్ ఐపీ టీవీ సేవలు ప్రారంభం

- సేవలను మరింత విస్తరించాలన్న ఆర్టీసీ ఎండీ



డిజిటల్ టెలివిజన్ సేవలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

నెహ్రూనగర్(గుంటూరు): ప్రభుత్వ రంగ సంస్థలను ప్రజలు ఆదరించాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పిలుపునిచ్చారు. గుంటూరులోని చంద్రమౌళీనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉల్కా టీవీ పేరుతో బీఎస్ఎన్ఎల్ డిజిటల్ టెలివిజన్ చానళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలకు దీటుగా ప్రచారం నిర్వహించి బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరించాలని సూచించారు. అలాగే, ఆర్టీసీ కార్గో ద్వారా గత ఆర్థిక సంవత్సరం రూ.122 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది ఇప్పటి దాకా రూ.157 కోట్ల ఆదాయం వచ్చినట్టు చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి ఇంటి వద్దకే కార్గో సర్వీస్‌లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తిరుమలరావు వివరించారు. బీఎస్ఎన్ఎల్ జీఎం ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఐపీ టీవీ సేవలు దేశంలో కేరళ తర్వాత ఏపీలో ప్రారంభమైనట్టు చెప్పారు. ఆండ్రాయిడ్ టీవీ ఉన్న వారు సెటప్ బాక్స్‌లతో పని లేకుండా ఫైబర్ నెట్ ద్వారా బీఎస్ఎన్ఎల్(ఉల్కా) ఐపీ టీవీ సేవలను పొందొచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్‌లోకూడా ఈ ఉల్కా యాప్ డౌన్ లోడ్ చేసుకుని సేవలను పొందొచ్చని వెల్లడించారు. బీఎస్ఎన్ఎల్ ఐపీ టీవీ సేవలు కావాలనుకునే వారు వాట్సాప్ 7382486677 నంబర్‌కు మీ ఊరు, మండలం పేరు పంపాలని కోరారు. ఉల్కా టీవీ ప్రతినిధి మహేష్, బీఎస్ఎన్ఎల్ డీజీఎంలు కోటేశ్వరరావు, రఘురాం, నాగేశయ్య పాల్గొన్నారు.

అద్భుతం 'సూర్య'కిరణ స్పర్శ దర్శనం



శ్రీకాకుళం జిల్లాలోని ప్రఖ్యాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం అద్భుతం సాక్షాత్కరించింది. తొలి సూర్యకిరణాలు నేరుగా గర్భాలయంలోని స్వామి మూల విరాట్టును స్పృశించాయి. ఉత్తరాయణ, దక్షిణాయన కాలమార్పుల్లో భాగంగా ఇలా ప్రతి మార్చి 9, 10 తేదీల్లో, అక్టోబర్ 1, 2 తేదీల్లో కిరణాలు తాకే దృశ్యం కనిపిస్తుంది. ఈ క్రమంలో గురువారం ఉదయం 6.22 నిమిషాల నుంచి నాలుగు నిమిషాల పాటు ఈ తొలి సూర్యకిరణాలు స్వామి వారిపై ప్రసరించాయి. ఈ దృశ్యాన్ని భక్తులు దర్శించుకుని పరవశించారు. - అరసవల్లి (శ్రీకాకుళం)

చీమలు పెట్టవు... పాములు ఉండవు!

పుట్టలు.. చెద పురుగుల ఆవాసాలే

- ఏ కాలంలోనైనా స్థిరంగా గది ఉష్ణోగ్రత
- భారీ వర్షాలు, తుపాన్లకు ఎదురొడ్డి నిలిచే నిర్మాణం
- అడవులు, పంట పొలాలను సారవంతం చేయడంలో కీలక పాత్ర
- ప్రకృతి ఇంజనీరింగ్ అద్భుత ఆవిష్కరణపై విస్తృత పరిశోధనలు




నల్లమలలో పుట్ట

చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనట్లని సుమతీ శతకకారుడు బద్దెన సెలవిచ్చినా నిజానికి చీమలు పుట్టలను తయారు చేయవు.. పాములూ వాటిని ఆక్రమించి నివసించవు. పుట్టలు చెదపురుగుల ఆవాసాలు. కొన్ని రకాల చీమలు చెదపురుగులను ఆహారంగా తీసుకునే క్రమంలో పుట్టల్లోకి చొరబడతాయి. పాములు, ఇతర సరీసృపాలు రక్షణ కోసం తాత్కాలికంగా పుట్టల్లో తలదాచుకుంటాయి.

- (సాక్షి, ఏపీ నెట్‌వర్క్, ఆత్మకూరు రూరల్)

మండు వేసవిలోనూ గది ఉష్ణోగ్రత..

పంట పొలాలు, అడవుల్లో భిన్న ఆకారాల్లో పుట్టలు సాధారణం. పిరమిడ్ ఆకారం, భూమికి కొద్ది ఎత్తులో మట్టి కుప్పల్లా పుట్టలు ఏర్పడుతుంటాయి. పైకి ఎంత ఎత్తులో కనిపిస్తాయో భూగర్భంలోనూ అంతే లోతులో గదులుంటాయి. మండు వేసవైనా, ఎముకలు కొరికే చలి కాలమైనా పుట్టల్లో కచ్చితంగా 24 డిగ్రీల సాధారణ గది ఉష్ణోగ్రత ఉంటుందంటే ఆశ్చర్యం కలగక మానదు. కుండపోత వర్షాలకు సైతం ఒక్క చుక్క నీరు కూడా పుట్టల్లోకి వెళ్లకపోవడం, మట్టితో నిర్మించినవే అయినా కరిగిపోకుండా ఉండటం మరో విశేషం. పుట్టల నిర్మాణంపై శాస్త్రవేత్తలు ఇప్పుడు విస్తృత పరిశోధనలు నిర్వహిస్తున్నారు.



జింబాబ్వేలో పుట్టను అధ్యయనం చేసి నిర్మించిన భవనం

పర్యావరణ పరిరక్షణ..

అడవుల్లో వృక్షాలకు అవసరమైన సేంద్రియ పోషకాలను పుట్టల్లో ఉండే చెద పురుగులే అందిస్తాయి. చెదపురుగులు కీటక విభాగానికి చెందిన జీవులు. వీటిలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 40 వేల జాతులున్నాయి. రాలిపోయిన ఆకులు, పడిపోయిన చెట్ల భాగాలను అత్యంత వేగంగా తింటూ విసర్జకాలను విడుస్తుంటాయి. తద్వారా వృక్షాలకు కంపోస్టు ఎరువు లభ్యమవుతుంది. కొన్ని రకాల వృక్ష జాతుల కణజాలంలోని సెల్యులోజ్‌ను ఆహారంగా తీసుకోవడం ద్వారా వాటిలో పరిమితికి మించి పీచు (ఫైబర్) పదార్థం పెరగకుండా నిరోధిస్తాయి.

సరీసృపాలకు రక్షణ దుర్గాలు..

సరీసృపాలైన పాములు, తొండలు, బల్లులు, ఉడుములు తమ సహజ శత్రువులు, ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడుకునేందుకు మాత్రమే పుట్టల్లో తలదాచుకుంటాయి. ఎలుగుబంట్లు పుట్టలను తవ్వి చెదలను ఆహారంగా తీసుకుంటాయి.



పుట్టను నిర్మిస్తున్న చెద పురుగులు

ప్రకృతి ఇంజనీరింగ్..

జింబాబ్వే రాజధాని హరారేలో ఓ సంస్థ తన కార్యాలయం, షాపింగ్ మాల్ కోసం నిర్మించిన బహుళ అంతస్తుల భవనంలో సాధారణ ఉష్ణోగ్రతలను నియంత్రించేందుకు ఎలాంటి విద్యుత్ ఉపకరణాలను వినియోగించకుండా నిర్మాణం పూర్తి చేసింది. సివిల్ ఇంజనీర్ మైక్ పియర్స్ పుట్టలను అధ్యయనం చేసి ప్రకృతి ఇంజనీరింగ్‌ను అనుసరించడంతో ఇది సాధ్యమైంది. భూతాపం, కర్బన ఉద్గారాలను నియంత్రించేందుకు ఇప్పుడు ప్రపంచమంతా ఏసీలు, హీటర్లు అవసరం లేని ఇళ్ల నిర్మాణం వైపు మొగ్గు చూపుతోంది. ఈ క్రమంలో పుట్టల నిర్మాణంలో దాగున్న ప్రకృతి ఇంజనీరింగ్ విధానాలను అధ్యయనం చేస్తున్నారు.

పర్యావరణానికి జీవధాతువులు



ప్రకృతి పచ్చగా ఉందంటే వృక్షాలే కారణం. ఎవరూ ఎరువులు వేయకుండా అడవుల్లో అపార వృక్ష సంపద విస్తరించటానికి కారణం పుట్టలు, అందులో ఉండే చెద పురుగులే. రాలిన ఆకులు, వృక్ష సంబంధ వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చి తిరిగి చెట్లకు అందించడంలో చెద పురుగులు అద్భుతమైన పాత్ర నిర్వహిస్తున్నాయి. వృక్షాల ఎదుగుదలకు అవసరమైన సూక్ష్మ పోషకాలన్నీ చెద పురుగులు అందించే సేంద్రియ ఎరువుల్లో ఉన్నాయి.

– అలెన్ చోంగ్ టిరాన్, డిప్యూటీ డైరెక్టర్, టైగర్‌ప్రాజెక్టు, ఆత్మకూరు

పుట్టలు ధ్వంసం చేయొద్దు



పుట్టల్లో పాములుంటాయని చాలామంది అపోహ పడుతుంటారు. పొలం గట్లపై ఉండే పుట్టలను రైతులు ధ్వంసం చేస్తుంటారు. అది సరికాదు. పుట్టల్లో ఉండే చెదలు వ్యర్థాలను సేంద్రియాలుగా మార్చి సాగు భూమిని సారవంతం చేస్తాయి.

– విజయకుమార్, డైరెక్టర్, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

అనారోగ్యంతో మావోయిస్టు తల్లి సీతమ్మ మృతి

- అంత్యక్రియలు నిర్వహించిన సీలేరు పోలీసులు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఎన్నో ఏళ్లుగా కొడుకును చూడాలని తపించిన తల్లికి 25 ఏళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి. చివరికి కొడుకు రాడనే బెంగతో అనారోగ్యం పాలై మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె.వీధి మండలం దుప్పిలవాడ పంచాయతీ కొమ్ములవాడ గ్రామానికి చెందిన కాకూరి సీతమ్మ (81) కొడుకు కాకూరి పండన్న 25 సంవత్సరాల కిందట మావోయిస్టు ఉద్యమంలో చేరి పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి నేడు ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నాడు. తల్లి సీతమ్మ అప్పటి నుంచి కొడుకు కోసం ఎదురుచూస్తూ ఆలనా, పాలనా లేక అనారోగ్యానికి గురైంది. గురువారం ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ కిషోర్‌కుమార్ ఆదేశాలతో సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. బంధువుల సమక్షంలో అంత్యక్రియలు చేపట్టి సామగ్రి, రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. మావోయిస్టు కాకూరి పండన్న జనజీవన స్రవంతిలో కలవాలని ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణ కోరారు.



మావోయిస్టు తల్లి పాడె మోస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

ఏడుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- సూళ్లూరుపేటలో నలుగురు, కుప్పంలో ముగ్గురు



సూళ్లూరుపేటలో పట్టుబడ్డ గంజాయి వివరాలు వెల్లడిస్తున్న నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్, (తిరుపతి జిల్లా)/కుప్పం(చిత్తూరు జిల్లా): ఆంధ్రా నుంచి తమిళనాడుకు గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురు స్మగ్లర్లను సూళ్లూరుపేట, కుప్పం పోలీసులు వేర్వేరు చోట్ల అరెస్టు చేశారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, కుప్పం అర్బన్ సీఐ శ్రీధర్ వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం నుంచి సూళ్లూరుపేట మీదుగా తమిళనాడుకు గంజాయి అక్రమంగా రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గురువారం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపం నుంచి బెడ్‌షీట్ల మధ్యలో ఉంచి గంజాయి ప్యాకెట్లు తరలిస్తుండగా నలుగురిని సూళ్లూరుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి సుమారు రూ.3.8 లక్షల విలువైన 24 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం మేండూరు గ్రామానికి చెందిన గెమ్మెల రాంబాబు (33), తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లా నల్లాంబలం గ్రామానికి చెందిన ఈశ్వర్ రమేష్ (28), తిరువళ్లూరు జిల్లా పుంగంబేడు గ్రామానికి చెందిన పండి సక్కరై (56), ఓ బాలనేరస్తుడిని అరెస్టు చేశారు.

కుప్పంలో ముగ్గురు అరెస్టు

కుప్పం సమీపంలోని సామగుట్టపల్లి క్రాస్‌లో గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కుప్పం మండలం మార్వాడకు చెందిన సుధాకర్ (27), తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకి చెందిన మణిమారన్ (30), మణికంఠన్ (29) ముగ్గురూ ఒకే మోటార్‌సైకిల్‌పై వస్తుండగా అనుమానంతో పోలీసులు తనిఖీ చేశారు. వారి వద్దనుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. కుప్పం సమీపంలోని దొమ్మర అగ్రహారం గ్రామంలోని రామచంద్రన్ అనే వ్యక్తి దగ్గర నుంచి గంజాయి కొనుగోలు చేసినట్టు నిందితులు తెలిపారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్



ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్

తిరుమల/యాదమరి(చిత్తూరు జిల్లా): తిరుమల శ్రీవారిని, కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్ గురువారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామి వార్ల దర్శనార్థం విచ్చేసిన ఆయనకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషాద్రి నాయుడు దర్శించుకున్నారు.

టీటీడీకి రూ.3.69 కోట్ల విరాళం



టీటీడీ ఈవోకు చెక్కును అందచేస్తున్న రఘునాథరెడ్డి

రాజంపేట: తన తండ్రి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు మేడా రామకృష్ణారెడ్డి పేరిట గెస్ట్‌హౌస్ నిర్మించేందుకు టీటీడీకి రూ.3.69 కోట్ల విరాళం ఇచ్చినట్టు అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. తన సోదరుడు, ఎమ్మార్‌కేఆర్ సంస్థ అధినేత రఘునాథరెడ్డి టీటీడీ ఈవో ధర్మారెడ్డిని గురువారం ఆయన చాంబర్‌లో కలిసి చెక్కును అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డి, నందలూరు మండలం వైసీపల్లె సర్పంచి మేడా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతూ పట్టుబడ్డ టీడీపీ నేతలు

- తిరుపతి జిల్లా పుత్తూరులో ఆరుగురి అరెస్టు
- రూ.2.52 లక్షల విలువైన 21.05 కేజీల గంజాయి స్వాధీనం
- అరెస్టయిన వారిలో ఒకరు నారా లోకేశ్‌కు సన్నిహితుడు
- మరొకరు టీడీపీ పుత్తూరు పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు
- మరో ఇద్దరు పరారు



నిందితులను చూపుతున్న డీఎస్పీ రామరాజు, సర్కిల్‌లో టీడీపీ నేతలు శరవణ, హరికృష్ణ



నారా లోకేశ్‌తో హరికృష్ణ (ఫైల్)

పుత్తూరు రూరల్ (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలో గంజాయి విక్రయిస్తూ ఇద్దరు తెలుగుదేశం పార్టీ నేతలు గురువారం దొరికిపోయారు. వారిలో ఒకరు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మాజీ మంత్రి నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు. వీరిద్దరితోపాటు మరో నలుగురిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌చార్జి డీఎస్పీ రామరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పుత్తూరు పట్టణంలోని స్వర్ణా హౌసింగ్ కాలనీలో గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సీఐ లక్ష్మీనారాయణ అక్కడికి సిబ్బందితో వెళ్లారు. ముళ్ల పొదల మధ్యలో 8 మంది గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వారిని పట్టుకోబోగా, ఆరుగురు దొరికారు. మరో ఇద్దరు పరారయ్యారు. అరెస్టయిన వారిలో నాగలాపురం మండలం వినోబానగర్‌కు చెందిన ఎ.విజయభాస్కర్ (22), నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన కె.యూకేష్ (21), పుత్తూరుకు చెందిన కాశీం మస్తాన్ (29), టి.సందీప్‌కుమార్ (27), సి.ఎం.శరవణ (35), బి.ఎస్.హరికృష్ణ అలియాస్ హరి (30) ఉన్నారు. వీరి నుంచి రూ.2.52 లక్షలు విలువ చేసే 21.05 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా అరకుకు చెందిన వెంకటేష్ వద్ద గంజాయిని కొని పుత్తూరులో విక్రయిస్తున్నట్లు నిందితులు విచారణలో తెలిపారు. పరారైన మోనిష్, బాలుతో పాటు అరకుకు చెందిన వెంకటేష్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. గంజాయి విక్రేతలపై పీడీ యాక్టు పెట్టేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు.

గతంలోనూ అరెస్టయిన హరికృష్ణ

అరెస్టయిన వారిలో హరికృష్ణ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు. గతంలో పుత్తూరు పట్టణ తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. శరవణ ప్రస్తుతం టీడీపీ పుత్తూరు పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు. గత ఏడాది జనవరి 10న విజయనగరం జిల్లా కాపుసోంపురం వద్ద 28 కిలోల గంజాయిని కారులో తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేసిన నలుగురిలో హరికృష్ణ రెండో నిందితుడు. అదే రోజు అరెస్టయిన వారిలో మరో టీడీపీ నాయకుడు హేమంత్ మూడో నిందితుడు. ఆ కేసులో బెయిల్‌పై బయటికి వచ్చిన హరికృష్ణ మరోసారి గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడు.

నాబార్డు రుణ ప్రణాళిక.. రూ.2.86 లక్షల కోట్లు

- 2023–24 స్టేట్ ఫోకస్ పేపర్‌ను విడుదల చేసిన మంత్రి కాకాణి
- ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలకు చేయూతనిస్తాం
- నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి : 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.86 లక్షల కోట్ల అంచనాతో రూపొందించిన రుణ ప్రణాళికను నాబార్డు విడుదల చేసింది. విజయవాడలోని ఓ హోటల్‌లో గురువారం జరిగిన స్టేట్ క్రెడిట్ సెమినార్–2023–24లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్స్ అహ్మద్‌బాబు, నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్‌తో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్టేట్ ఫోకస్ పేపర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాబార్డు రుణ ప్రణాళిక వివరాలను సీజీఎం గోపాల్ వెల్లడించారు. 2022–23లో రూ.2.54 లక్షల కోట్ల రుణాలివ్వాలని సంకల్పించగా, గతేడాది సెప్టెంబర్ 30 నాటికి రూ.1.38 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 12 శాతం అదనంగా రుణ ప్రణాళికను నాబార్డు ఖరారు చేసింది. వ్యవసాయ అనుబంధ రంగాలకు గతేడాది రూ.1.64 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో ముందుకెళ్లగా, ఈ ఏడాది రూ.1.82 లక్షల కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. వీటిలో అత్యధికంగా పంట రుణాల రూపంలో రూ.1.35 లక్షల కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి పశుసంవర్ధక కార్యకలాపాలకు రూ.15,619 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.4,156 కోట్లు, మత్స్యశాఖకు రూ.4,517 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.3,642 కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ కోసం రూ.4,895 కోట్లు, భూమి అభివృద్ధి కోసం రూ.1,860 కోట్లు, సాగునీటి వనరుల కల్పనకు రూ.2,215 కోట్లు, మార్కెటింగ్ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.3,273 కోట్లు, ఇతర రైతు సంబంధిత అవసరాల కోసం రూ.3,073 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనకు రూ.974 కోట్లు, సమీకృత వ్యవసాయ కార్యకలాపాలకు రూ.246 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇక ఎంఎస్ఎంఈ రంగానికి రూ.59,496 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.44,478 కోట్లు రుణాలు ఇవ్వనుంది. వీటిలో ప్రధానంగా గృహ నిర్మాణానికి రూ.18,502 కోట్లు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు రూ.4,150 కోట్లు, విద్యావసరాల కోసం రూ.2,839 కోట్లు ఇవ్వబోతున్నట్లు నాబార్డు ప్రకటించింది.

నాబార్డు కృషి అభినందనీయం : మంత్రి కాకాణి

వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ రుణప్రణాళికను రూపొందించిన నాబార్డును మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అభినందించారు. ఆర్బీకే వ్యవస్థను తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, వాటికనుగుణంగా గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల కల్పనకు నాబార్డు ఆర్థిక చేయూతనిస్తుండడం నిజంగా అభినందనీయమన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రాధాన్యతలను తెలుసుకుంటూ వాటికనుగుణంగా క్రెడిట్ ప్లాన్ తయారుచేసుకోవాలని సూచించారు. పంట అనంతర మౌలిక సదుపాయాల కల్పన, రైతు సంక్షేమం, సుస్థిరాభివృద్ధి, డెయిరీల ఆధునీకరణకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

నకిలీ హోంగార్డుల కేసు ఏసీబీకి..

ఉత్తర్వులు జారీచేసిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

- మొత్తం నిందితులు 93 మంది
- వీరిలో నకిలీ హోంగార్డులు 90 మంది..
- తొలగించిన ఇద్దరు హోంగార్డులు, ఒక కానిస్టేబుల్ కూడా..
- నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్ల వరకు వసూళ్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పోలీసుశాఖలో వెలుగుచూసిన నకిలీ హోంగార్డుల నియామకం కుంభకోణం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి బదిలీ అయింది. కేసును పోలీసుశాఖ నుంచి ఏసీబీకి బదిలీ చేస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు కేవలం ఏడుగురు నిందితులుగా ఉన్న ఈ కేసులో ఇప్పుడు మరో 86 మందిని చేర్చారు. మొత్తం నిందితులు 93 మందిలో.. నకిలీ హోంగార్డులు 90 మంది, విధుల నుంచి తొలగించిన హోంగార్డులు ఇద్దరు, ఒక కానిస్టేబుల్ ఉన్నారు.

అక్రమాలకు పాల్పడినవారిలో వణుకు

ఈ కేసు దర్యాప్తును ఏసీబీ చేపట్టడంతో అక్రమాలకు పాల్పడిన టీడీపీ నేతలు, పోలీసుల్లో వణుకు మొదలైంది. నకిలీ హోంగార్డుల నుంచి టీడీపీ నేతలు వసూలు చేసిన రూ.5 కోట్లలో చిత్తూరు జిల్లాకు చెందిన ఆ పార్టీ నేత సింహభాగాన్ని చినబాబుకు ముట్టచెప్పినట్లు ఆరోపణలున్నాయి. ఈ కుంభకోణంలో డీఎస్పీలు, జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, నాటి ఓ పోలీసు ఉన్నతాధికారి ప్రమేయం ఉన్నట్లు తెలిసింది. దర్యాప్తు ప్రారంభించిన ఏసీబీ అధికారులు పూర్తిస్థాయిలో సాక్ష్యాలు సేకరించి నిందితులకు ఉచ్చు బిగించడంపై న్యాయసలహాలు తీసుకుంటున్నారు.

దొడ్డిదారిన నియమించిన అధికారులు

2014 నుంచి 2019 వరకు విడతలవారీగా చిత్తూరు జిల్లా పోలీసుశాఖలో 90 మంది హోంగార్డులను చేర్చారు. పోలీసుశాఖ నుంచి నోటిఫికేషన్ లేకుండా, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించకుండా కొందరు పోలీసు అధికారులు, తెలుగుదేశం నేతలు కలిసి వీరిని చేర్పించేశారు. ఈ దొడ్డిదారి నియామకాల్లో నాటి టీడీపీ ప్రభుత్వ మంత్రి నుంచి జిల్లాకు చెందిన టీడీపీ తమ్ముళ్లు ఒక్కో పోస్టుకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. టీడీపీ నేతలు చెప్పిందే చాలు అన్నట్టు.. పోలీసుశాఖలోని పెద్ద హోదాల్లో పనిచేసిన అధికారులు ఎవరికీ అనుమానం రాకుండా నకిలీ హోంగార్డులను ఆన్–పేమెంట్ కింద టీటీడీ, అగ్నిమాపకశాఖ, జైళ్లశాఖ, విద్యుత్‌శాఖ, రవాణాశాఖ, లా అండ్ ఆర్డర్ విభాగాల్లో చొప్పించేశారు. దొడ్డిదారిన, తప్పుడు డ్యూటీ ఆర్డర్ (డీవో)లతో పోస్టులు పొందిన నకిలీ హోంగార్డులకు ప్రభుత్వం రూ.12 కోట్లకుపైగా వేతనాలు కూడా చెల్లించింది. ఈ బాగోతాన్ని గుర్తించిన చిత్తూరు జిల్లా పోలీసుశాఖ గతేడాది జూలై 16వ తేదీన ఏఆర్‌ఐ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు డిసెంబర్ 11న ఏడుగురిని (నకిలీ హోంగార్డులు నలుగురు, విధుల నుంచి తొలగించిన హోంగార్డులు ఇద్దరు, ఒక కానిస్టేబుల్‌ను) అరెస్టు చేశారు. రూ.కోట్లు చేతులు మారడం, పోలీసుశాఖలోని ఉద్యోగుల ప్రమేయం ఉండటంతో డీజీపీ ఈ కేసును ఏసీబీకి బదిలీ చేశారు.

పుట్టుమచ్చలు చూపాలంటూ వేధింపులు

- విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న ఇన్‌చార్జ్ హెడ్ మాస్టర్
- ఎన్జీవో సంస్థ ప్రతినిధి ద్వారా అకృత్యాలు వెలుగులోకి..
- హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేసిన డీఈవో
- కేసు లేకుండా చూసేందుకు టీడీపీ నేతల యత్నం



ఆదినారాయణ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం/తనకల్లు: పుట్టుమచ్చలు చూపాలంటూ విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న ఉపాధ్యాయుడి లీలలు ఆలస్యంగా వెలుగుచూశాయి. విచారణ జరిపిన అధికారులు ఆయనను గురువారం సస్పెండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం నల్లగుట్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవీ ఆదినారాయణ ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్. పుట్టుమచ్చలు చూపాలంటూ కొన్ని రోజులుగా 8, 9, 10 తరగతి విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతూ వచ్చారు. ఆయనకు భయపడిన విద్యార్థినులు తల్లిదండ్రులకు విషయం చెప్పలేకపోయారు. కాగా, జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వచ్చిన ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధితో పాఠశాలకు చెందిన ఓ బాలిక తన గోడును వెళ్లబోసుకుంది. దీంతో ఆ ప్రతినిధి ఆ తర్వాత కూడా కొన్ని రోజుల పాటు ఆ ఉపాధ్యాయుడి వ్యవహారశైలిని పరిశీలించి, అతడి అకృత్యాలు నిజమేనని నిర్ధారించుకున్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షికి సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన అధికారులు విచారణ జరిపి జీవీ ఆదినారాయణను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఆదినారాయణపై పోక్సో కేసు నమోదు చేయాలని ఎంఈవో లలితమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నేతల రాజీ యత్నం

ఉపాధ్యాయుడు జీవీ ఆదినారాయణ భార్య రామలక్ష్మి గతంలో టీడీపీ ఓబుళదేవర చెరువు మండలం జెడ్పీటీసీగా పనిచేశారు. ఇప్పటికీ టీడీపీలో క్రియాశీలంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసును నీరుగార్చేందుకు శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ ముఖ్యనేత ఒకరు తీవ్రంగా యత్నిస్తున్నారు. జీవీ ఆదినారాయణ వయసు ప్రస్తుతం 61 ఏళ్లు కావడం, కేసు బలంగా ఉంటే పదవీ విరమణ తర్వాత వచ్చే ప్రయోజనాలు రావన్న ఉద్దేశంతో కేసు నీరుగార్చేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే బాలికల తల్లిదండ్రులతోనూ రాజీ ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా...


జడ్జినే బెదిరించాడు!

జైపూర్: మార్ఫ్‌డ్ ఫొటోలను పంపి రూ.20 లక్షలివ్వకుంటే వాటిని బయటపెడతామంటూ మహిళా జడ్జిని బెదిరించిన ఘటన రాజస్తాన్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. ఆగంతకుడి కోసం పోలీసులు వేట ప్రారంభించారు. రాష్ట్రానికి చెందిన ఓ మహిళా జడ్జికి ఫిబ్రవరి 7న ఒక పార్సిల్ వచ్చింది. జడ్జి పిల్లలు చదివే స్కూలు నుంచి వచ్చిందంటూ ఓ అగంతకుడు పార్సిల్‌ను కోర్టు స్టెనోగ్రాఫర్‌కు ఇచ్చాడు. పేరు అడగ్గా చెప్పకుండానే వెళ్లిపోయాడు. ఆ పార్సిల్‌లో కొన్ని స్వీట్లతోపాటు అభ్యంతరకరంగా ఉన్న జడ్జి ఫొటోలు కనిపించాయి. రూ.20 లక్షలు ఇవ్వకుంటే ఆ ఫొటోలను ఆన్‌లైన్‌లో పెట్టి పరువు తీస్తాననే హెచ్చరికతో కూడిన ఉత్తరం ఉంది. జడ్జి చాంబర్‌లోని సీసీ కెమెరాలో ఓ 20 ఏళ్ల యువకుడు పార్సిల్ తెచ్చినట్లుగా రికార్డయింది. మరో 20 రోజుల తర్వాత జడ్జి ఇంటికి మళ్లీ ఒక పార్సిల్ వచ్చింది. 'రూ.20 లక్షలు సిద్ధంగా ఉంచు. సమయం, ప్రాంతం త్వరలోనే చెబుతా'అంటూ లేఖ ఉంది. బాధిత న్యాయమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు ఫిబ్రవరి 28వ తేదీన కేసు నమోదు చేశారు. ఆగంతకుడిని గుర్తించామని, అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

భారత సంతతి ప్రొఫెసర్‌పై
అమెరికాలో జాతి వివక్ష!



న్యూయార్క్: అమెరికాలో భారత సంతతికి చెందిన లక్ష్మీ బాలచంద్ర అనే అసోసియేట్ ప్రొఫెసర్ మసాచుసెట్స్‌లో తాను పని చేస్తున్న బాబ్సన్ కాలేజీపై జాతి, లింగ వివక్ష ఆరోపణలు చేశారు. వీటి కారణంగా కెరీర్ అవకాశాలను కోల్పోయానంటూ కాలేజీపై కేసు కూడా పెట్టారు. అంతేగాక ఆర్థిక నష్టానికి, మానసిక కుంగుబాటుకు లోనయ్యానంటూ ఆవేదన వెలిబుచ్చారు. ''కాలేజీ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డివిజన్‌కు సారథ్యం వహించిన ప్రొఫెసర్ ఆండ్రూ కార్బెట్ ఇందుకు ప్రధాన బాధ్యుడు. దీన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా విచారించి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. బాబ్సన్ కాలేజీ శ్వేత జాతీయులకు, అందులోనూ పురుషులకు మాత్రమే పెద్దపీట వేస్తుంది. వారికే ప్రివిలేజీలన్నీ కల్పిస్తుంది'' అని ఆరోపించారు. ఆమె 2012 నుంచి కాలేజీలో పని చేస్తున్నారు. ఇలాంటి ఆరోపణలను తాము చాలా సీరియస్‌గా తీసుకుంటామని కాలేజీ ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిపై విచారణ జరిపి తప్పిదాలను సరిదిద్దేందుకు పకడ్బందీ వ్యవస్థ అమల్లో ఉందని చెప్పుకొచ్చింది.



60
ఏళ్ల వయసు పైబడిన వారిలో కోటిమందికిపైగా బాధితులు

డిమెన్షియా డేంజర్ బెల్స్

డిమెన్షియా. మన దేశాన్ని కొత్తగా ఈ వ్యాధి పట్టిపీడిస్తోంది. వాస్తవానికి దీనిని పూర్తిగా వ్యాధి అని కూడా అనలేం. ఇదొక మానసిక స్థితి. వయసు మీద పడిన వారిలో డిమెన్షియా లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. జ్ఞాపకశక్తి కోల్పోవడం, ఆలోచనలు లేకుండా స్తబ్దుగా ఉండిపోవడం, రీజనింగ్ కోల్పోవడం, నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి మానసిక సమస్యలు ఎవరిలోనైనా కనిపిస్తే దానిని డిమెన్షియా అని పిలుస్తారు. ఈ డిమెన్షియా కేసులపై మొట్టమొదటిసారిగా మన దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఒక అధ్యయనం నిర్వహించారు. అంతర్జాతీయ బృందం భారత్‌లో 31,477 మంది వృద్ధులకి సెమీ సూపర్‌వైజ్‌డ్ మిషన్ సహకారంతో పరీక్షలు నిర్వహించి ఈ అధ్యయనం చేపట్టింది. యూకేలో యూనివర్సిటీ ఆఫ్ సర్రే, అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్, న్యూఢిల్లీలో ఎయిమ్స్‌కు చెందిన పరిశోధనకారులు కృత్రిమ మేధ సహకారంతో ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ అధ్యయనంలో అమెరికా, యూకే, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలతో సరిసమానమైన డిమెన్షియా కేసులు భారత్‌లో కూడా బయటపడడం ఆందోళనకరంగా మారింది. దీనికి సంబంధించిన నివేదికను న్యూరో ఎపిడిమాలజీ జర్నల్ ప్రచురించింది. దేశంలో 60 ఏళ్ల కంటే పైబడినవారిలో 8.44% మంది అంటే కోటి 8 లక్షల మంది డిమెన్షియాతో బాధపడుతున్నట్టు ఆ అధ్యయనంలో వెల్లడైంది. 2050 నాటికి డిమెన్షియా కేసులు దేశంలో విపరీతంగా పెరిగిపోతాయని, ఆ సమయానికి దేశ జనాభాలో 19.1శాతం మంది 60 ఏళ్ల పైబడిన వారి ఉంటారని వారిలో డిమెన్షియా ముప్పు తీవ్రంగా ఉంటుందని ఆ నివేదిక వివరించింది. గతంలో భావించిన దాని కంటే ఈ వ్యాధి వ్యాప్తి అత్యంత తీవ్రంగా ఉందని తేలింది. డిమెన్షియాకు ప్రస్తుతానికైతే చికిత్స లేదు. కొన్ని మందుల వల్ల లక్షణాలన్నీ కొంతవరకు తగ్గించగలుగుతారు. వృద్ధాప్యంలో డిమెన్షియా రాకుండా యుక్త వయసు నుంచే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని అధ్యయనకారులు చెబుతున్నారు.

తొలిసారిగా కృత్రిమ మేధ సాయంతో భారత్‌లో అధ్యయనం

ఢిల్లీ ఎయిమ్స్ సహా అంతర్జాతీయ యూనివర్సిటీల సంయుక్త అధ్యయనం

కశ్మీర్‌లో అధికం
మన దేశంలో జమ్మూకశ్మీర్‌లో అత్యధికులు డిమెన్షియాతో బాధపడుతున్నారు. కశ్మీర్‌లోని 60 ఏళ్ల వయసు కంటే ఎక్కువ ఉన్నవారిలో 11% మందికి డిమెన్షియా ఉంది. ఇక ఢిల్లీలో తక్కువగా 4.5% మందిలో ఈ లక్షణాలున్నాయి.

డిమెన్షియా అంటే...?
డిమెన్షియా అన్న పదం డి, మెంటియా అనే పదాల నుంచి వచ్చింది. డి అంటే విత్‌అవుట్ అని, మెంటియా అంటే మనసు అని అర్థం. డిమెన్షియా అనేది సోకితే రోజువారీ చేసే పనులకి చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. కొద్ది సేపటి క్రితం ఏం చేశారో వారికి గుర్తు ఉండదు. రోజూ తిరిగే దారుల్ని కూడా మరిచిపోతారు. మాట్లాడడానికి పదాలు వెతుక్కుంటూ ఉంటారు. చిన్న చిన్న లెక్కలు కూడా చెయ్యలేరు. స్థూలంగా చెప్పాలంటే బాధ్యతగా వ్యవహరించలేరు. దీనివల్ల మెదడుపై తీవ్రమైన దుష్ప్రభావాలు పడతాయి.


మహిళలే బాధితులు
డిమెన్షియా ఎక్కువగా మహిళల్లో కనిపిస్తోంది. చదువురాని గ్రామీణ ప్రాంతంలో ఉండే మహిళల్లో ఈ లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయని సర్వే తేల్చింది. మహిళల్లో 9% మందికి ఈ వ్యాధి ఉంటే , పురుషుల్లో 5.8% మందిలో గుర్తించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య కూడా అంతరం ఎక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాల (5.3%) కంటే గ్రామీణ ప్రాంతాల్లోని వారు (8.4%) ఈ సమస్యతో అధికంగా బాధపడుతున్నారు.

ఒంటరితనంతో డిమెన్షియా !
డిమెన్షియా వ్యాధి రావడానికి ఎన్నో కారణాలున్నాయి. చిన్నతనం నుంచి మెదడుని చురుగ్గా ఉంచే కార్యక్రమాల్లో ఉండకపోతే పెద్దయ్యేసరికి ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ముఖ్యంగా నిరక్షరాస్యుల్లో ఈ వ్యాధి ఎక్కువ. పొగతాగడం, మద్యపానం, నిద్రలేమి, శారీరక వ్యాయామం లేకపోవడం వంటివి కూడా మనసుపై ప్రభావాన్ని చూపించి డిమెన్షియా, అల్జీమర్స్ వంటి వ్యాధులు సోకుతాయని ఇన్నాళ్లు శాస్త్రవేత్తలు భావించారు. ఇప్పుడు ఒంటరితనం కూడా ఈ వ్యాధి సోకడానికి కారణమవుతోందని జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఒంటరి జీవితం గడిపే వారిలో డిమెన్షియా వ్యాధి సోకే ముప్పు 27% అధికంగా ఉంటుంది.

\- సాక్షి, నేషనల్ డెస్క్



''భారత్‌లో డిమెన్షియా మీద అవగాహన తక్కువ. వృద్ధాప్యంలో వచ్చే మతిమరుపు కిందే దీనిని భావిస్తారు. ప్రభుత్వాలు కూడా ఈ వ్యాధిపై అంతగా దృష్టి సారించడం లేదు. 2050 నాటికి డిమెన్షియా కేసులు దేశంలో విపరీతంగా పెరిగిపోతాయి. ఆ సమయానికి దేశ జనాభాలో 19.1శాతం మంది 60 ఏళ్ల పైబడిన వారి ఉంటారు. వారిలో డిమెన్షియా ముప్పు తీవ్రంగా ఉంటుంది. ప్రభుత్వాలు ఇప్పట్నుంచే జాగ్రత్తలు తీసుకుంటే వృద్ధులు తమ జీవితాన్ని ఆనందంగా గడిపే అవకాశాన్ని కల్పించవచ్చు.'' -ప్రొఫెసర్ హమియో జిన్,
అధ్యయనం సహరచయిత, యూనివర్సిటీ ఆఫ్ సర్రే, యూకే



కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతల వల్లే జనాభా పెరిగింది

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సౌకర్యం లేనందునే, దేశంలో జనాభా పెరిగిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వ్యాఖ్యానించారు. కర్ణాటకలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. 'అధికారంలోకి వస్తే ఉచితంగా కరెంటు ఇస్తామని కాంగ్రెస్ ఇప్పుడు హామీ ఇస్తోంది కానీ, గతంలో ఆ పార్టీ ప్రభుత్వ హయాంలో కరెంటు సరఫరా సరిగా చేయలేకపోయింది, గ్రామాల్లో అస్సలే కరెంటు లేదు. ఫలితంగా జనాభా పెరిగిపోయింది'అని అన్నారు. ప్రధాని మోదీ హయాంలో 24 గంటలూ విద్యుత్ ఉంటోందని చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే
కారు ఉక్రెయిన్‌కే!!

రిగా(లాత్వియా): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన కార్లను లాత్వియా అధికారులు ఉక్రెయిన్‌కు పంపిస్తున్నారు. రష్యాతో జరిగే యుద్ధంలో ఉక్రెయిన్‌కు తమ ప్రయత్నం సాయంగా ఉంటుందని అంటున్నారు. ఈ కార్లను నడిపిన మాజీ యజమానుల రక్తంలో ఆల్కహాల్ స్థాయిలు 0.15% పైనే ఉందట. ఇప్పటికే ఇలా పట్టుబడిన 8 కార్లు ఉక్రెయిన్‌కు పంపామని లాత్వియా దేశ రెవెన్యూ విభాగం తెలిపింది. కొనుగోలు చేసిన, విరాళంగా అందిన కార్లను దెబ్బతిన్న, యుద్ధం జరిగే ప్రాంతాల్లో అత్యవసర సేవలకు వినియోగిస్తామని ఉక్రెయిన్‌కు చెందిన అగెండమ్ గ్రూప్ తెలిపింది. 2022 ఫిబ్రవరి నుంచి ఇలాంటి 1,200 కార్లను అందజేసినట్లు వెల్లడించింది. లాత్వియా రోడ్లపై మద్యం తాగి కార్లలో తిరిగే వారు 'పేలని కమికాజ్ డ్రోన్లు'వంటి వారని చమత్కరించింది. 'సాధారణంగా స్వాధీనం చేసుకున్న కార్లను అమ్మేయడమో, విడగొట్టి అమ్మేయడమో చేస్తుంటాం. అయితే, ఉక్రెయిన్ ప్రజలకు సాయం చేయాలనే వీటిని అక్కడికి పంపిస్తున్నాం'అని లాత్వియా అంటోంది. పట్టుబడిన కార్లను వారానికి 25 చొప్పున అగెండమ్‌కు అందజేస్తామని లాత్వియా అధికారులు హామీ ఇచ్చారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్... మావోయిస్టులకు గాయాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా దబ్బామార్క పోలీస్‌స్టేషన్ పరిధి సకిలేరు అటవీప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల నడుమ ఎదురుకాల్పులు జరిగాయి. దబ్బామార్క పోలీస్ క్యాంపు నుంచి కోబ్రా, ఎస్టీఎఫ్ బలగాలు కూంబింగ్‌కు బయలుదేరాయి. గురువారం ఉదయం 9 గంటలప్పుడు సకిలేరు సమీపంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఇరువర్గాల నడుమ కాల్పులు జరిగాయి. ఇద్దరు కోబ్రా కమాండోలు గాయపడ్డారు. ఐదారుగురు మావోయిస్టులు గాయపడగా, అటవీప్రాంతంలోకి పారిపోయారు. ఘటనాస్థలి నుంచి భారీ స్థాయిలో పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అదనపు బలగాలను పంపించి కూంబింగ్ ముమ్మరం చేసినట్లు సుక్మా జిల్లా ఎస్పీ సునీల్ వెల్లడించారు.

మళ్లీ క్షిపణిని ప్రయోగించిన ఉత్తరకొరియా

సియోల్: ఉత్తరకొరియా మరోసారి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. గురువారం సాయంత్రం 6.20గంటల సమయంలో పశ్చిమ తీర నగరం నంపో నుంచి స్వల్పశ్రేణి క్షిపణిని ప్రయోగించినట్లు గుర్తించామని దక్షిణ కొరియా సైన్యం తెలిపింది. ఆ మిస్సైల్ ఎంత దూరం ప్రయాణించిందో వెల్లడించలేదు. అణు సామర్థ్యం కలిగిన బీ-52 బాంబర్ పరీక్షలను అమెరికా, దక్షిణకొరియా చేపట్టడంపై ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి, దేశంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళ కిమ్ యో జోంగ్ మంగళవారం తీవ్ర హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే.

కాంగోలో ఉగ్ర ఘాతుకం.. 36 మంది మృతి

గోమా: ఆఫ్రికా దేశం కాంగోలో ఇస్లామిక్ స్టేట్ అనుబంధ ఉగ్ర సంస్థ అలైడ్ డెమొక్రటిక్ ఫోర్సెస్(ఏడీఎఫ్) జరిపిన మారణకాండలో 36 మంది పౌరులు చనిపోయారు. నార్త్ కివు ప్రావిన్స్ ముకోండి గ్రామంలోకి బుధవారం రాత్రి కత్తులు, తుపాకులతో ప్రవేశించిన ఉగ్రమూకలు ఇళ్లకు నిప్పుపెట్టాయి. బయటకు వచ్చిన పౌరులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డాయి. ఘటనలో 36 మంది చనిపోయారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. కొందరిని ఎత్తుకుపోయారు. ఏడీఎఫ్ ఉగ్రమూకలు చిన్నారులపైనా దారుణాలకు పాల్పడుతున్నాయి.

ఇకపై కవ్వింపులకు దిగితే...
పాక్‌తో సమరమే!?

మోదీ సర్కారు సహించబోదు ● అమెరికా నిఘా వర్గాల అంచనా


వాషింగ్టన్: పాకిస్తాన్, చైనాలతో భారత్ సంబంధాలు నానాటికీ మరింతగా క్షీణిస్తున్నాయని, పెరుగుతున్న ఉద్రిక్తతలు సాయుధ ఘర్షణకూ దారితీసే ఆస్కారం లేకపోలేదని అమెరికా నిఘా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముఖ్యంగా పాక్ కవ్వింపులను భారత్ గతంలోలా సహించే పరిస్థితి లేదు. మోదీ హయాంలో పాక్‌పై సైనిక చర్యకు దిగే అవకాశముంది'' అని అంచనా వేశాయి. అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించిన వార్షిక నివేదికలో ఈ మేరకు పొందుపరిచాయి. ''ముఖ్యంగా భారత వ్యతిరేక ఉగ్రవాద తండాలకు మద్దతిచ్చిన సుదీర్ఘ చరిత్ర పాక్‌ది. అందుకే ఇకపై పాక్ కవ్విస్తే మోదీ ప్రభుత్వం మౌనంగా ఉండబోదు'' అని నివేదిక అభిప్రాయపడింది. చైనాతో కూడా పలు సరిహద్దు సమస్యలను భారత్ చర్చల ద్వారా పరిష్కరించుకున్నా 2020 గల్వాన్ ఘర్షణ, తాజాగా అరుణాచల్ సరిహద్దుల వద్ద గొడవ ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను మరింతగా పెంచాయని పేర్కొంది.

చైనాతో అమెరికాకు పెనుముప్పు

అమెరికా జాతీయ భద్రతకు, అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వ స్థానానికి చైనా కమ్యూనిస్టు పార్టీ నుంచి అత్యంత ముప్పు పొంచి ఉందని యూఎస్ నిఘా విభాగపు నివేదిక అభిప్రాయపడింది. ''రష్యాతో ఏడాదిగా చైనా బంధం బలపడుతున్న తీరు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చింది. నానాటికీ పెరుగుతున్న ఈ చైనా సవాలును దీటుగా ఎదుర్కొనేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి'' అని ప్రభుత్వానికి సూచించింది. సెనేట్ సెలెక్ట్ కమిటీ సభ్యులకు నిఘా నివేదిక సమర్పించిన సందర్భంగా నేషనల్ ఇంటలిజెన్స్ డైరెక్టర్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

సిసోడియాను అరెస్ట్ చేసిన ఈడీ

మద్యం పాలసీ కేసులో మరో మలుపు



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో తిహార్ జైలులో ఉన్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురువారం ఆయన్ను అరెస్ట్ చేసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఆయన సీబీఐ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. కోర్టు అనుమతితో ఈడీ అధికారులు బుధ, గురువారాల్లో తిహార్ జైలులో ఉన్న సిసోడియాను ప్రశ్నించారు. గురువారం పలు అంశాలపై ప్రశ్నించిన అనంతరం సిసోడియాను అరెస్ట్ చేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది. మనీ లాండరింగ్ ఆరోపణల కింద ఆయన్ను అరెస్ట్ చేస్తున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. రద్దయిన మద్యం విధానం విషయమై సీఎం కేజ్రీవాల్, ఇతర మంత్రులు, అధికారులతో జరిపిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపైనా తిహార్ జైలులో ఈడీ అధికారులు ప్రశ్నించారు. అయితే, విచారణకు సిసోడియా సహకరించడం లేదని, ప్రశ్నల నుంచి తప్పుదోవ పట్టిస్తున్నారని ఈడీ ఆరోపిస్తోంది. సిసోడియా పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై సీబీఐ కోర్టు 10న విచారించనుండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. శుక్రవారం ఆయన్ను కోర్టులో ప్రవేశపెట్టనుంది. సిసోడియాకు ఇప్పటికే సీబీఐ కోర్టు విధించిన జ్యుడిషియల్ కస్టడీ గడువు ఈ నెల 20వ తేదీ వరకు ఉంది. శుక్రవారం బెయిల్ వచ్చినప్పటికీ ఈడీ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లి ఈ కేసులోని ఇతర నిందితులతోనూ కలిపి ఆయన్ను ప్రశ్నించే అవకాశాలున్నాయి. ఎక్సైజ్ శాఖ మంత్రిగా కూడా ఉన్న సిసోడియా మద్యం పాలసీ నిర్ణయాలకు సంబంధించి ఆధారాలు దొరక్కుండా చేసేందుకు తన వద్ద ఉన్న 170 వరకు సెల్‌ఫోన్లను ధ్వంసం చేయడం, మార్చడం చేసినట్లు ఈడీ ఆరోపిస్తోంది. కోర్టుకు సమర్పించిన చార్జిషీటులోనూ ఇవే విషయాలను పేర్కొంది.

జైల్లోనే ఉంచేందుకు కుట్ర: కేజ్రీవాల్

తప్పుడు ఆరోపణలపై తిహార్ జైలులో ఉన్న సిసోడియాకు బెయిల్ లభించవచ్చనే ఈడీ గురువారం ఆయన్ను అరెస్ట్ చేసిందని ఆప్ అగ్రనేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. 'మొదట సీబీఐ సిసోడియాను అరెస్ట్ చేసింది. ఆయన వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదు, దాడుల్లో డబ్బు కూడా లభ్యం కాలేదు. రేపు జరిగే విచారణలో కోర్టు ఆయనకు బెయిలిచ్చే అవకాశం ఉంది. అందుకే, ఈడీ అరెస్ట్ చేసింది. ఏది ఏమైనా తప్పుడు ఆరోపణలు మోపి, ఆయన్ను బయటకు రాకుండా చేయడమే ఈడీ ఏకైక లక్ష్యంగా పెట్టుకుంది. ప్రజలు అంతా చూస్తున్నారు. వారు తగు సమాధానం ఇస్తారు'అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

రక్షణ బంధం బలోపేతం

ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్
- ఐఎన్ఎస్ విక్రాంత్ సందర్శన
- త్వరలో సంయుక్త నావికా విన్యాసాలు
- ఆస్ట్రేలియా ఆతిథ్యమిస్తుందని ప్రకటన
- నేడు ప్రధాని మోదీతో కీలక చర్చలు


ముంబైలో డబ్బావాలాలతో ముచ్చటిస్తున్న ఆల్బనీస్



ఐఎన్ఎస్ విక్రాంత్‌పై తేలికపాటి యుద్ధవిమానంలో ఆల్బనీస్

ముంబై/న్యూఢిల్లీ: భారత్‌తో సంయుక్త నావికా విన్యాసాలకు ఆస్ట్రేలియా త్వరలో ఆతిథ్యమివ్వనుందని ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ ప్రకటించారు. 'ఎక్సర్‌సైజ్ మలబార్' పేరిట జరిపే ఈ విన్యాసాల్లో వీటిలో అమెరికా, జపాన్ కూడా పాల్గొంటాయన్నారు. ఆయన పూర్తి దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన విమాన వాహక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను గురువారం ముంబైలో సందర్శించారు. నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్ ఆయనకు స్వాగతం పలికారు. నౌకలో కలియదిరిగి విశేషాలు తిలకించిన అనంతరం ఆల్బనీస్ పలు అంశాలపై మాట్లాడారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య రక్షణ రంగంలో సాన్నిహిత్యం నానాటికీ పెరుగుతోందని, బంధం మరింత బలపడుతోందని అభిప్రాయపడ్డారు. 'గతేడాది రికార్డు స్థాయిలో సంయుక్త విన్యాసాలు, చర్చలు జరిగాయి. త్వరలో ఆస్ట్రేలియాలో ఎక్సర్‌సైజ్ మలబార్ నిర్వహించనున్నాం. వాటిలో భారత్ తొలిసారిగా పాల్గొంటోంది' అని అన్నారు.

మోదీపై ప్రశంసల జల్లు

ఏ అంశాన్నైనా భవిష్యత్తును అంచనా వేసి మరీ ఆలోచించడం ప్రధాని నరేంద్ర మోదీలో ఉన్న గొప్పదనమని ఆల్బనీస్ ప్రశంసించారు. ''రక్షణ సంబంధాలను సుదృఢం చేసేది ఇలాంటి దూరదృష్టే. బంధాలను ఇప్పుడెలా ఉన్నాయని కాకుండా మున్ముందు ఎదుగుదలకు ఉన్న అవకాశాల పరంగా మదింపు వేయగలగాలి. ఆ సామర్థ్యమున్న నేత మోదీ'' అని అభిప్రాయపడ్డారు. వర్తక, ఆర్థిక కార్యకలాపాల కోసం ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత సముద్ర మార్గాలు ఇరు దేశాలకూ ఆవశ్యకమేనన్నారు. మోదీ ప్రతిపాదించిన జనరల్ రావత్ డిఫెన్స్ ఆఫీసర్స్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాం ఇరు దేశాల సైనిక సిబ్బంది మధ్య అవగాహన, సాన్నిహిత్యం పెంపొందేందుకు దోహదపడుతుందని ఆశాభావం వెలిబుచ్చారు.

రక్షణ మంత్రుల చర్చలు

రక్షణ రంగంలో ఆస్ట్రేలియాతో బంధాన్ని మరింత బలోపేతం చేసుకోనున్నట్టు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చెప్పారు. ఆ దేశ ఉప ప్రధాని, రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్‌తో గురువారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయంలో ఇరు దేశాలకు ఉన్న చిత్తశుద్ధిని ప్రతిబింబించేలా తమ సంభాషణ సాగిందన్నారు.

వర్తకం, రక్షణ, కీలక ఖనిజాలు
మోదీతో చర్చల్లో ఇవే ప్రధానం

ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్‌తో మోదీ శుక్రవారం విస్తృతంగా చర్చలు జరపనున్నారు. కీలక ఖనిజాలు, ద్వైపాక్షిక వర్తకం, రక్షణ ప్రధానంగా ప్రస్తావనకు రానున్నాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా సైనిక దూకుడు, అందుకు అడ్డుకట్ట వేసే మార్గాలు తదితరాలపైనా నేతలు చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య 2021లో 27.5 బిలియన్ డాలర్ల విలువైన వర్తకం జరిగింది. 2022లో అమల్లోకి వచ్చిన ఆర్థిక సహకార వర్తక ఒప్పందం (ఈసీటీఏ)తో వచ్చే ఐదేళ్లలో ఇది 50 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందని భావిస్తున్నారు.

టెస్ట్ మ్యాచ్ చూశారు

గురువారం ఉదయం మోదీ, ఆల్బనీస్ కలిసి అహ్మదాబాద్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య నాలుగో అంతర్జాతీయ టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆట ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. టాస్ అనంతరం ఇద్దరూ కలిసి కాసేపు మ్యాచ్‌ను ఆస్వాదించారు. అనంతరం ముంబైలో ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరం సమావేశంలో ఆల్బనీస్ పాల్గొన్నారు.

రష్యా క్షిపణుల వాన

కీవ్: ఉక్రెయిన్‌పైకి గురువారం రష్యా మరోసారి క్షిపణుల వాన కురిపించింది. దీంతో ఉదయం నుంచి 7 గంటలపాటు దేశమంతటా ముందు జాగ్రత్తగా సైరన్లు మోగుతూనే ఉన్నాయి. దేశంలోని 10 ప్రాంతాల్లోని నివాస భవనాలపై రష్యా జరిపిన దాడుల్లో కనీసం ఆరుగురు చనిపోయారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. గత మూడు వారాల్లో రష్యా జరిపిన అతి పెద్ద దాడి ఇదేనన్నారు. 'ఆక్రమణదారులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇది మాత్రమే వాళ్లు చేయగలరు' అని ఆయన ఆన్‌లైన్‌లో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.


జార్ఖండ్‌లోని రామ్‌గఢ్ జిల్లాలో స్వస్థలం నెమ్రా గ్రామంలో గురువారం సంప్రదాయ వస్త్రధారణలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్

గవర్నర్లకు నోరు తప్ప చెవుల్లేవు : స్టాలిన్



చెన్నై: గవర్నర్ల వ్యవహార శైలిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అన్ని రాష్ట్రాల గవర్నర్లకి మాట్లాడడానికి నోరు ఉందే తప్ప వినడానికి చెవుల్లేవని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అందుకే గవర్నర్లందరూ ఎక్కువగా మాట్లాడుతూ తక్కువగా వింటున్నారని వ్యాఖ్యానించారు. ఆన్‌లైన్‌లో జూదం నిరోధక బిల్లుని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వెనక్కి తిప్పి పంపిన నేపథ్యంలో స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉంగలిల్ ఒరువన్ అనే కార్యక్రమంలో గురువారం పాల్గొన్న స్టాలిన్ ప్రజలు వేసే ప్రశ్నలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమాధానాలిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాల్లో గవర్నర్లు జోక్యం చేసుకోకూడదని ఇటీవల సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలకు గవర్నర్లు కట్టుబడి ఉన్నారా? అని ప్రేక్షకుల నుంచి వచ్చిన ప్రశ్నకు స్టాలిన్ స్పందిస్తూ కొందరు గవర్నర్ల వ్యవహార శైలి చూస్తుంటే వారికి నోరు ఉందే తప్ప చెవులు లేవని అనిపిస్తోందని అన్నారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీశ్ సిసోడియా అరెస్ట్‌ను ఆయన ప్రస్తావిస్తూ ప్రతిపక్ష పార్టీలను బీజేపీ బహిరంగంగానే ఎలా హెచ్చరిస్తుందో సిసోడియా అరెస్ట్ నిలువెత్తు నిదర్శనమని అన్నారు. రాజకీయ కారణాల కోసం దర్యాప్తు సంస్థల్ని బీజేపీ వాడుకుంటోందని మండిపడ్డారు. ప్రతిపక్షాలపై ఎన్నికల్లో గెలవడానికి బదులుగా, దర్యాప్తు సంస్థల్ని ప్రయోగించి విజయం సాధించాలని చూడడమేంటని ప్రధాని మోదీకి లేఖ రాసినట్టుగా స్టాలిన్ వెల్లడించారు.

నేపాల్ అధ్యక్షుడిగా రామచంద్ర పౌడెల్



ఖట్మాండు: నేపాల్ కొత్త అధ్యక్షుడిగా రామచంద్ర పౌడెల్ ఎన్నికయ్యారు. నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన రామచంద్రను ప్రజాప్రతినిధులు ఎన్నుకోవడంతో ప్రధానమంత్రి ప్రచండ ఆధ్వర్యంలోని సంకీర్ణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. అధికార సంకీర్ణ కూటమి అభ్యర్థి రామచంద్రను ఎన్నిక కోసం తెరవెనుక ప్రచండ పన్నిన రాజకీయ వ్యూహాలు ఫలించాయి. ప్రధాని ప్రచండ నేతృత్వంలోని సీపీఎన్ (మావోయిస్టు సెంటర్) తో పాటు ఎనిమిది పార్టీల సంయుక్త అభ్యర్థి రామచంద్ర తన ప్రత్యర్థి పార్లమెంటులో రెండో అతి పెద్ద పార్టీ సీపీఎన్-యూఎంఎల్ మద్దతునిచ్చిన అభ్యర్థి సుభాష్ చంద్ర నెబ్‌మాంగ్‌పై విజయం సాధించారు. రామచంద్రకు 214 మంది ఎంపీలు, 352 మంది ప్రావిన్షియల్ అసెంబ్లీ సభ్యుల ఓట్లు వచ్చాయి. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి అధ్యక్షుడిగా గెలిస్తే నేపాల్ ప్రభుత్వంపై ఆ ప్రభావం పడే అవకాశం ఉండేది.

చిలీలో రూ.262 కోట్ల దోపిడీకి యత్నం

శాంటియాగో: చిలీ రాజధాని శాంటియాగోలో వందల కోట్ల నగదును దోచుకునేందుకు సాయుధ దుండగులు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఈ ఘటనలో ఇద్దరు చనిపోయారు. అమెరికాలోని మియామి నుంచి శాంటియాగో విమానాశ్రయానికి బుధవారం చేరుకున్న విమానంలో 32 మిలియన్ డాలర్ల (రూ.262 కోట్ల) నగదు ఉంది. బ్యాంకుల్లో పంపిణీ చేయాల్సిన ఆ నగదును ట్రక్కులోకి తరలించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో, 10 మంది సాయుధ దుండగులు ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించారు. పక్కా ప్రణాళికతో అక్కడికి చేరుకున్న దుండగులు నగదును ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. అడ్డుకున్న భద్రతా సిబ్బందితో కొద్దిసేపు ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల్లో భద్రతా సిబ్బంది ఒకరు, ఒక దుండగుడు చనిపోయారు. దుండగులు వెంటనే తమ వాహనంలో అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం ఆ ప్రాంతంలో పూర్తిగా కాలిపోయిన మరో రెండు వాహనాలు కనిపించాయి. భద్రతా సిబ్బంది సకాలంలో స్పందించి ఈ భారీ దోపిడీని అడ్డుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నగదును తీసుకువచ్చిన లాతమ్ విమానంలోని ప్రయాణికులకు ఎటువంటి అపాయం కలగలేదన్నారు. ఇదే శాంటియాగో ఎయిర్‌పోర్టులో గతంలో రెండుసార్లు దోపిడీ దొంగలు తెగబడి మొత్తం 25 మిలియన్ డాలర్ల నగదును ఎత్తుకెళ్లారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 10 । మార్చి । 2023

19 జిల్లాల్లో తగ్గిన భూగర్భ జలాలు

కొరుక్కుపేట: రాష్ట్రంలోని 19 జిల్లాల్లో తగ్గిన భూగర్భ జలాలు తగ్గినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. వాతావరణ మార్పుల వల్ల నీటిమట్టం తగ్గిందని అధికారులు గురువారం తెలిపారు. హిందూ మహాసముద్ర తీరం, ఇతర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. తమిళనాడులో వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో 19 జిల్లాల్లో భూగర్భ జలాల స్థాయి తగ్గిందన్నారు. మిగిలిన 17 జిల్లాల్లో నీటిమట్టం కొద్దిగా మెరుగుపడిందని వెల్లడించారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఈ ఏడాది జనవరి వరకు సగటున భూగర్భ జలాలు పెరిగాయని జలవనరుల శాఖ పేర్కొంది. ప్రభుత్వం తరపున నీటి వనరులను పర్యవేక్షించి వేసవిలో నీటిని పొదుపుగా వాడుకోలవాలని పేర్కొన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్రమణి మాట్లాడుతూ నీటి నిల్వ పెంపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

రమ్మీ నిషేధానికి తిరస్కరణ

- బిల్లును తిప్పిపంపిన గవర్నర్ ఆర్ఎన్ రవి
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన డీఎంకే మిత్రపక్షాలు
- గవర్నర్‌కు నోరు మాత్రమే ఉంది.. చెవులు లేవంటూ మండిపడిన సీఎం స్టాలిన్
- కేబినెట్ అత్యవసర భేటీ

రాష్ట్రంలో రాజ్‌భవన్.. ప్రభుత్వం మధ్య అంతరం రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే పలు విషయాల్లో ఉత్తర ధ్రువం.. దక్షిణ ధ్రువం తరహాలో వ్యవహరిస్తున్న ఈ రెండు వ్యవస్థలు నువ్వా..నేనా అనే రీతిలో తలపడుతున్నాయి. తాజాగా ఆన్‌లైన్ రమ్మీ నిషేధానికి సంబంధించిన అసెంబ్లీ ముసాయిదాను గవర్నర్ ఆమోదించకుండా వెనక్కి పంపించడంతో.. స్టాలిన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా ప్రవహరిస్తూ.. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేయడం ద్వారా ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్నారని ఆరోపించారు.



కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్



రాజ్ భవన్, గవర్నర్ ఆర్ఎన్ రవి

సాక్షి,చెన్నై : నాలుగు నెలలుగా కోల్డ్‌స్టోరేజ్‌కే పరిమితమైన ఆన్‌లైన్ రమ్మీ నిషేధానికి సంబంధించిన బిల్లుపై గవర్నర్ ఆర్ఎన్ రవి ఎట్టకేలకూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ముసాయిదాలో 8 మార్పులను సూచిస్తూ ప్రభుత్వానికి వెనక్కి పంపించారు. వివరాలు.. రాష్ట్రంలో ఆన్‌లైన్ రమ్మీ, బెట్టింగ్ గేమింగ్‌ల బారిన పడి దెబ్బతింటున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అలాగే బలన్మరణాల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. దీంతో ఈ గేమింగ్‌లపై నిషేధం విధించేందుకు గాను సమగ్ర పరిశీలనకు జస్టిస్ చంద్రూ నేతృత్వంలో కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ అన్ని వర్గాల అభిప్రాయాలు, సమగ్ర పరిశీలనతో నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులోని అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. గత ఏడాదిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ నివేదికను సభలో న్యాయ శాఖమంత్రి రఘుపతి ప్రవేశపెట్టారు. ఇందులోని అంశాలు వివరించారు. ఆన్‌లైన్ రమ్మీ, బెట్టింగ్ గేమ్‌ల నిషేధమే లక్ష్యంగా కొత్త బిల్లును తీసుకొచ్చారు. ఈ బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. తర్వాత ఈ ముసాయిదాను రాజ్ భవన్‌కు పంపించింది.

నిరీక్షణ తర్వాత..

ఈ బిల్లును ఆమోదించాలని పలుమార్లు ప్రభుత్వం గవర్నర్ ఆర్ఎన్ రవికి లేఖ రాసింది. న్యాయమంత్రి కూడా స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. అయినా గవర్నర్ స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఈ బిల్లును తిరస్కరిస్తూ వెనక్కి పంపించడం వివాదానికి దారి తీసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించింది. డీఎంకే మిత్ర పక్షాలయితే గవర్నర్ తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. ఈ అంశంపై బిల్లును రూపొందించిన జస్టిస్ చంద్రు మీడియాతో మాట్లాడుతూ.. గవర్నర్ తీరు విచిత్రంగా ఉందన్నారు. ఈ బిల్లును వెనక్కి పంపించేందుకు గవర్నర్ 8 కారణాలు పేర్కొని ఉన్నట్లు సమాచారం వచ్చిందని, ఇంత కాలం ఆ కారణాలపై ఆయన ఎందుకు వివరణ కోర లేదని ప్రశ్నించారు. ఈ బిల్లును ఆమోదించే ఉద్దేశం లేకనే వెనక్కి పంపించారని, ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ బిల్లుకు కాలం చెల్లినట్లేనని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై స్పందిస్తూ, గవర్నర్ పేర్కొన్న కారణాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

అత్యవసర సమావేశం..

గవర్నర్ తీరుతో గురువారం సాయంత్రం కేబినెట్ అత్యవసరంగా సమావేశమైంది. సీఎం ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి మంత్రులందరూ హాజరయ్యారు. ఆన్‌లైన్ రమ్మీ నిషేధ చట్టాన్ని వెనక్కి పంపించిన వ్యవహారంపై ఇందులో చర్చించినట్లు సమాచారం. అలాగే, ఇటీవల హైకోర్టు తీర్పుతో గుట్కా, పాన్ మాసాలకు నిషేధం రద్దయిన అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. రానున్న అసెంబ్లీ సమావేశాలలో సరికొత్తగా చట్టాలను తీసుకొచ్చేందుకు నిర్ణయించినట్లు సమాచారం. అలాగే, ఈ నెల 20వ తేదీన ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలు, ఆర్థిక బడ్జెట్, వ్యవసాయ బడ్జెట్‌కు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఇదిలా ఉండగా, గవర్నర్ తీరుపై మీలో ఒకడిని కార్యక్రమంలో సీఎం స్టాలిన్ తీవ్రంగా విరుచుకు పడటం గమనార్హం. రాజకీయ అంశాల్లో జోక్య చేసుకునే విషయంలో గవర్నర్‌కు సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ఖాతరు చేయడం లేదని మండిపడ్డారు. గవర్నర్‌కు నోరు మాత్రమే ఉందని, చెవులు లేనట్లుందని ఎద్దేవా చేశారు. ఇక, ఈ బిల్లు వెనక్కి రావడం గురించి న్యాయ శాఖ మంత్రి రఘుపతిని ప్రశ్నించగా, మళ్లీ చట్టం చేసి రాజ్ భవన్‌కే పంపించాలని, దానిని కూడా వారు నెలల తరబడి తుంగలో తొక్కి వెనక్కు పంపించే అవకాశమే ఎక్కువగా ఉందని ఆరోపించారు.

న్యూస్‌రీల్

నాలుగు చోట్ల ఫ్లోటింగ్ జెట్టీలకు కేంద్రం అనుమతి



సాక్షి, చెన్నై: పర్యాటక ప్రగతి, జలరవాణాను సులభతరం చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో 4 చ్లో ఫ్లోటింగ్ జెట్టీలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు గురువారం కేంద్ర రహదారులు, హార్బర్, షిప్పింగ్ శాఖ ఆదేశాలు ఇచ్చింది. సాగర్ మాల పథకం మేరకు సముద్ర తీరాలలో పర్యటక ప్రగతి, జల రవాణా, ఆయా ప్రాంతాల బలోపేతం దిశగా తేలియాడే రీతిలో ప్లాట్ ఫాంల తరహాలో నిర్మాణాలపై దృష్టి పెట్టింది. ఇప్పటికే పలు నగరాలలోని సముద్ర తీరాలలో ఈ జెట్టీల ఏర్పాటు జరిగాయి. తమిళనాడులో నాలుగు చోట్ల ఈ నిర్మాణాలకు నిర్ణయించారు. ఇందులో రెండు రామేశ్వరం సముద్ర తీరంలో ఉన్నాయి. అగ్ని తీర్థం, విల్లుండి తీర్థంలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. అలాగే కన్యాకుమారి తీరంలో మరొకటి, కడలూరు – పుదుచ్చేరిని కలిపే విధంగా మరొక నిర్మాణం చేపట్టనున్నారు.

రూ. మూడున్నర కోట్ల విలువైన బంగారం సీజ్

- మహిళ సహా ముగ్గురి అరెస్టు



తిరువొత్తియూరు: సింగపూర్, మలేషియా నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.3.50 కోట్ల విలువైన బంగారం కడ్డీలను, నగలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి మహిళ సహా ముగ్గురిని కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై, మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయానికి విదేశాల నుంచి బంగారం తరలిస్తున్నట్లు కస్టమ్స్ అధికారులకు రహస్య సమాచారం అందింది. దీంతో కస్టమ్స్ అధికారులు ప్రయాణికులపై తీవ్రంగా నిఘా వేశారు. ఈ క్రమంలో సింగపూర్ నుంచి చెన్నైకి వచ్చిన విమానంలో ప్రయాణం చేసి వచ్చిన ఇద్దరు యువకులను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఇద్దరి వద్ద తలా 69 బంగారం బిస్కెట్లు గుర్తించి సీజ్ చేశారు. వీటి విలువ మొత్తం రూ.3.32 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. ఇక మలేషియా నుంచి చెన్నైకి విమానంలో వచ్చిన మహిళను నుంచి రెండు చైన్లు, ఐదు బంగారం గాజులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 36.20 లక్షలు విలువ ఉంటుందని పేర్కొన్నారు. మహిళ సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.

గ్లోబల్ ఇంటర్న్ షిప్‌పై అవగాహన

సాక్షి, చెన్నై: ఇంజనీరింగ్ విద్యార్థులకు గ్లోబల్ ఇంటర్న్ షిప్, ప్లేస్ మెంట్ అవకాశాలు కల్పించే విధంగా ఎస్ఎస్ఈలో గురువారం అవగాహన, ఒప్పందాల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో థాయ్‌లాండ్ ప్రీమియం ఓవర్సీస్ హ్యూమన్ రిక్రూట్‌మెంట్ ఎండీ మిచ్చికి మట్స్యు, గేట్ వే జపాన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శరవణన్ పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో విద్యా కార్యక్రమాలు, నియామకాలు, విద్యార్థుల మార్పిడి గురించి వివరించారు. ఈ ఒప్పందాల కారణంగా ఒక దేశంలోని విద్యార్థులు మరో దేశంలోని విద్య, ఉద్యోగ అనుభవాలను పొందేందుకు వీలవుతుందన్నారు.

సాధికారతపై సదస్సు



మహిళా సాధికారత గురించి సీమాట్స్‌లో గురువారం చర్చ కార్యక్రమం జరిగింది. ఇందులో యూకే యూనివర్సిటీ ఆఫ్ క్రియేటివ్ ఆర్ట్స్ అకడమిక్ అడ్వైజర్ వైవోస్ ఎన్జియామోహ్, ఆస్కార్ అండ్ పొన్న ఆర్కిటెక్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ పొన్ని, ట్రేడ్ కమిషనర్ సషీద్, అంకుల్ సామ్స్ కిచెన్ గ్రూప్ గునిట్ పింగిల్, వీసీ రమ్య దీపక్ పాల్గొన్నారు. వారి అనుభవాలు, అభిప్రాయాలతో పాటుగా మహిళా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

\- సాక్షి, చెన్నై

పోస్టర్ల ఆవిష్కరణ



అపోలో ప్రోటాన్ సెంటర్‌లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. తెలంగాణ, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, వేల్స్ గ్రూప్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రీత గణేష్, డాక్టర్ ముక్తా మహాజన్, డాక్టర్ మంజులా రావు, సుష్మా పటేల్, శాంతి రాధాకృష్ణన్‌లు ఈసందర్భంగా క్యాన్సర్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.

\- సాక్షి, చెన్నై

వైరస్ బాధితులకు..
స్వీయ నిర్బంధం

- మంత్రి ఎం. సుబ్రమణియన్ వెల్లడి
- నేడు 1000 చోట్ల వైద్య శిబిరాలు



దంత వైద్య శిబిరంలో మంత్రులు

సాక్షి, చెన్నై: వైరస్ బాధితులు 3 లేదా 4 రోజులు తప్పనిసరిగా స్వీయ నిర్బంధంలో ఉండాలని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ సూచించారు. వైరస్ ప్రభావం దృష్ట్యా, రాష్ట్రవ్యాప్తంగా గురువారం వెయ్యి చోట్ల వైద్య శిబిరాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 6 నుంచి 8 తరగతి విద్యార్థులకు దంత సంరక్షణే లక్ష్యంగా పున్నగై పథకాన్ని ఇటీవల ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని గురువారం నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. చెన్నై నందనంలో జరిగిన కార్యక్రమంలో ఈ పథకాన్ని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్, విద్యామంత్రి అన్బిల్ మహేశ్ ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థుల దంత సంరక్షణ లక్ష్యంగా నాలుగు లక్షల మందికి పరీక్షలు, చికిత్సలు అందించనున్నామని వివరించారు. వైరస్ కట్టడి చర్యలను విస్తృతం చేశామన్నారు. దోమల నివారణ చర్యలపై స్థానిక సంస్థలు చేపట్టాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో వైరస్ బాధితుల కోసం అన్ని రకాల మందులు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. వైరస్ బారిన పడ్డ వారు మూడు లేదా నాలుగు రోజులు స్వీయ నిర్బంధంలో ఉంటే మంచిదని, ఇతరులకు వైరస్ సోకకుండా ఉంటుందన్నారు. శుక్రవారం చెన్నైలో 200 చోట్ల, ఇతర ప్రాంతాలలో 800 చోట్ల మొత్తంగా వెయ్యి చోట్ల వైద్య శిబిరాలకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.

కృత్రిమ ఇసుక కట్టడికి కొత్త పాలసీ

- విడుదల చేసిన సీఎం స్టాలిన్
- ప్రైవేటు క్వారీలకు చెక్



కొత్త పాలసీ పత్రాన్ని విడుదల చేసి మంత్రి దురై మురుగన్‌కు అందిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై : కృత్రిమ ఇసుక (ఎం శాండ్) ఉత్పత్తిని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. సచివాలయం వేదికగా గురువారం ఈ పాలసీని సీఎం స్టాలిన్ విడుదల చేశారు. వివరాలు..రాష్ట్రంలో గతంలో నెలకొన్న ఇసుక కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా ఎం శాండ్‌ను తీసుకొచ్చారు. కాలక్రమేనా ఎం శాండ్ లేని నిర్మాణాలే లేవన్నట్లు పరిస్థితులు మారాయి. ప్రైవేటు గుప్పెట్లోకి ఈ వ్యాపారం చేరడంతో పాటు ధరలు అమాంతంగా పెరిగాయి. అదే సమయంలో ఈ ఎం శాండ్‌లో నాణ్యత లేదని, దీనిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి విజ్ఞప్తులు పెరిగాయి. దీంతో ఎం శాండ్ నియంత్రణ, ఖనిజ సందపలు, సహజన వనరుల పరిరక్షణ, భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా, ఎం శాండ్ కోసం 2023 పేరిట కొత్త పాలసీని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. తక్షణం ఈ పాలసీ అమల్లోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టారు.

వ్యర్థాలను తగ్గించేందుకు..

కృత్రిమ ఇసుక ఉత్పత్తికి తీసుకొచ్చిన కొత్త పాలసీలో కొన్ని కీలక అంశాలను ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో సహజ వనరులైన నదుల్లో ఇసుక కొరత ఏర్పడినప్పుడు కొత్త పర్యావరణ, భూ వినియోగ చట్టం అమలు చేయాల్సిన అవసరం ఉంటుందని వివరించారు. ఈ సమయంలో మాత్రమే ఎం శాండ్ మీద దృష్టి పెట్టాలన్నారు. ఎం శాండ్ తయారీ కారణంగా ఉత్పన్నమయ్యే వ్యర్థాల పరిమాణాన్ని తగ్గించేందుకు క్వారీలపై కఠిన నిబంధనలు విధించారు. తయారీలో నాణ్యత కొరవడిన పక్షంలో కొరాడా ఝుళిపించేందుకు ప్రత్యేక చర్యలను వివరించారు. ఇక, ఈ పాలసీలో మరికొన్ని ముఖ్య అంశాలను వివరించారు. నది ఇసుకను సురక్షితంగా ఉపయోగించడం, పర్యావరణానికి నష్టం కలకుండా నిరోధించడం, బ్యూరో ఆఫ్ కంట్రోల్(బీఐఎస్) నిర్దేశించిన ప్రమాణాలు పాటించడం, ఎం శాండ్ తయారీకి పరిశ్రమలకు అనుమతులు విషయంగా విధాన పరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. భవనాలు, కాంక్రీట్ నిర్మాణాలు, క్వారీ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేయడం, కృత్రిమ మైనింగ్, క్వారీలను ప్రోత్సహించేందుకు తగిన సూచనలు ఇచ్చారు. ఇక, ఇసుక తవ్వకాలు, ఉత్పత్తి కోసం వ్యక్తిగత క్వారీలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి దురై మురుగన్, సీఎస్ ఇరై అన్బు, సీనియర్ ఐఏఎస్‌లు కృష్ణన్, జయకాంతన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పట్టు ఉత్పత్తి రంగంలో రాణించిన 9 మందికి సీఎం స్టాలిన్ రూ. ఆరు లక్షలు నగదు ప్రోత్సాహాలను అందజేశారు.

ప్రధాన కార్యదర్శి పదవే లక్ష్యం

- వ్యూహాలకు పళణి పదును
- జిల్లాల పర్యటనకు నిర్ణయం
- కార్యదర్శులతో భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న పళణిస్వామి



హాజరైన కార్యదర్శులు

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవి చేజిక్కించుకునేందుకు పళణి స్వామి సిద్ధమవుతున్నారు. జిల్లాల పర్యటనతో కేడర్‌ను మరింత ఆకర్షించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు జిల్లాల కార్యదర్శుల భేటీలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలు.. అన్నాడీఎంకేలో ఆ పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామి, సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరాల మధ్య జరుగుతున్న వార్ గురించి తెలిసిందే. ఇందులో పళణి స్వామి పైచేయి సాధించారు. న్యాయ పోరాటంలో వచ్చిన పలు తీర్పులు తనకు అనుకూలంగా ఉండడంతో వ్యూహాలకు పళణిస్వామి పదును పెట్టారు. పార్టీని పూర్తిగా తన గుప్పెట్లోకి తెచ్చుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జిల్లాల కార్యదర్శులు, ముఖ్య నిర్వాహకులతో పళణి స్వామి సమావేశం అయ్యారు. ఉదయం 11 గంటల నుంచి కొన్ని గంటల పాటు సుదీర్ఘంగా పలు అంశాల గురించి ఇందులో చర్చించారు.

బీజేపీపై ఆగ్రహం..

ఈ సమావేశంలో అనేక మంది ముఖ్య నిర్వాహకులు ప్రసంగిస్తూ బీజేపీ తీరుపై శివాలెత్తినట్లు సమాచారం. ప్రధానంగా అన్నాడీఎంకేను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేస్తున్న విమర్శలు, వ్యాఖ్యలను తీ వ్రంగా పరిగణించాలని, ఆ పార్టీతో తెగదెంపుల విషయంగా త్వరలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. అన్నామలై అండ్ బృందానికి బలమైన షాక్ ఇచ్చే విధంగా లేదా, వారి దూకుడుకు కళ్లెం వేసే విధంగా నిర్ణయం తీసుకోవాలని అనేక మంది నేతలు పట్టుబట్టారు. మరికొందరు నేతలు ప్రస్తుతానికి కూటమిని కొనసాగించాలని, ఎన్నికల సమయంలో వారికి గుణపాఠం చెప్పాలని సూచించడం గమనార్హం.

ప్రధాన కార్యదర్శి పదవి కోసం..

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవి విషయంపై ఈ సమావేశంలో చర్చించారు. ఎవరి మద్దతు, సహకారం పెద్దగా లేకుండానే ఈరోడ్ తూర్పులో 40 వేలకు పైగా ఓట్లను సాధించడం గురించి కూడా సమీక్షించారు. ప్రధానంగా అక్కడి ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ నేతలు వ్యాఖ్యలు చేశారు. త్వరలో సర్వ సభ్యసమావేశం నిర్వహణకు నిర్ణయించినట్లు తెలిసింది. అంతకు ముందుగా కేడర్ మద్దతును, బలాన్ని చాటే విధంగా జిల్లాల పర్యటనకు పళణి స్వామి సిద్ధమైనట్లు సమాచారం. పన్నీరు సెల్వానికి పూర్తిగా చెక్ పెట్టే విధంగా ఆయన వెన్నంటి ఉన్న వాళ్లందరినీ తమ వైపునకు తిప్పుకునేందుకు సిద్ధం కావడం గమనార్హం.

పన్నీరుకు షాక్..

ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో పన్నీరు సెల్వం అభ్యర్థిగా సెంథిల్ మురుగన్ పోటీకి దిగిన విషయం తెలిసిందే. రెండాకుల గుర్తు వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సెంథిల్ మురుగన్‌ను పోటీ నుంచి పన్నీరు సెల్వం తప్పించారు. ఈ పరిస్థితుల్లో పన్నీరుకు ఆ అభ్యర్థి షాక్ ఇచ్చాడు. ఆయనకు గుడ్ బై చెప్పి పళణి స్వామికి జై కొట్టాడు.

కూటమిపై పళణిదే నిర్ణయం..

ఈ సమావేశానంతరం సీనియర్ నేత కేపీ మునుస్వామి మీడియాతో మాట్లాడుతూ, కూటమి విషయంపై పళణి స్వామి సరైన సమయంలో కీలక నిర్ణయం తీసుకుంటారని వ్యాఖ్యలు చేశారు. ఆయనకు అన్నీ తెలుసునని, నిర్ణయం తీసుకోవాల్సిన సమయంలో స్పష్టంగా, నిర్మోహ మాటంగా వ్యాఖ్యలు చేస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ లక్ష్యం పార్టీ బలోపేతం, ఇతర శిబిరాల్లో ఉన్న కేడర్‌ను ఒకే వేదిక మీదకు తెచ్చే విధంగా ముందుకెళ్తున్నామని వివరించారు. జిల్లా కార్యదర్శులకు ఆయన పలు సలహాలు, సూచనలు, ఇచ్చారని, వాటన్నింటిని ఇక విస్తృతంగా అమలు చేస్తామన్నారు. మరో నేత జయకుమార్ మాట్లాడుతూ, కూటమి అన్న తర్వాత విభేదాలు తప్పవని, ప్రస్తుతానికి బీజేపీ తమ కూటమిలోనే ఉందని వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా, జయలలిత విషయంలో ఇప్పటికే బీజేపీ అధ్యక్షుడు అన్నామలై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. తాజాగా మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. జయలలిత కన్నా వెయ్యిరెట్లు తన తల్లి, తన భార్య గొప్ప వారు అని ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పలు చోట్ల అన్నామలైకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే శ్రేణులు పోరుబాట పట్టడం వివాదానికి మరింత ఆజ్యం పోసినట్టైంది.

రూ.64 కోట్ల విలువైన హెరాయిన్ స్వాధీనం

అన్నానగర్: ఇథియోపియా నుంచి విమానంలో చెన్నైకి అక్రమంగా తరలిస్తున్న రూ.64 కోట్ల విలువైన 8.26 కిలోల హెరాయిన్‌ను చెన్నై విమానాశ్రయంలో గురువారం కేంద్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఓ వృద్ధుడిని అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు. వివరాలు.. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇథియోపియా రాజధాని అడీస్ అబాబా నుంచి ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ ప్యాసింజర్ విమానం గురువారం వచ్చింది. ఈ విమానంలో భారీగా హెరాయిన్ స్మగ్లింగ్ చేస్తున్నట్లు చెన్నైలోని యునైటెడ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ విభాగం అధికారులకు రహస్య సమాచారం అందింది. దీంతో విమానంలో వచ్చిన వారిని కేంద్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం తనిఖీ చేసింది.79 ఏళ్ల వ్యక్తిని ప్రశ్నించగా అతడు తాత్కాలిక వీసాపై ఆఫ్రికా దేశాలకు వెళ్లి ఇథియోపియా మీదుగా చెన్నైకి వస్తున్నట్లు తేలింది. అతని సూట్‌కేస్‌లో దాచిన 2 పార్సిళ్లలో రూ. 64 కోట్ల విలువైన 8.26 కిలోల హెరాయిన్‌ను సీజ్ చేశారు. ఆ తర్వాత హెరాయిన్‌ను ముంబైకి తరలించారు. అనంతరం నిందితుడిని యూనియన్ రెవెన్యూ ఇన్వెస్టిగేషన్ విభాగం అరెస్టు చేసింది. అలాగే అతడు అంతర్జాతీయ డ్రగ్స్ ట్రాఫికింగ్ ముఠాకు చెందినవాడని తేలడంతో విచారణ ముమ్మరం చేసింది.

క్లుప్తంగా

మద్యంలో విషం కలిపి పాల వ్యాపారి హత్య



మృతదేహాన్ని తవ్వి తీస్తున్న సిబ్బంది

వేలూరు: వేలూరు జిల్లా అనకట్టు సమీపంలోని మల్లైసందు గ్రామానికి చెందిన నటరాజన్(35) పాల వ్యాపారం చేసేవాడు. ఇతని భార్య జయప్రియ. వీరు కుటుంబ సమస్యల కారణంగా గతంలో విడిపోయారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సంధ్యతో నటరాజన్‌కు అక్రమ సంబంధం ఏర్పడింది. వీరిద్దరూ ప్రస్తుతం ఒకే ఇంటిలో ఉంటున్నారు. వీరిద్దరికీ మూడేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో నటరాజన్ ఊసూరు సమీపంలోని చింత తోపులో మద్యంలో విషం కలుపుకుని తాగి అపస్మారక స్థితికి చేరాడు. ఘటనా స్థలానికి చేరుకున్న అన్న సేట్టు నటరాజన్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ నవంబర్ 5న నటరాజన్ మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందజేయకుండా మృతదేహాన్ని శ్మశాన వాటికలో పాతి పెట్టారు. ఇదిలా ఉండగా తన తమ్ముడు నటరాజన్ మృతిలో అనుమానం ఉందని సేట్టు అరియూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తహసీల్దార్ రమేష్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ సెంథిల్‌కుమార్ అధ్యక్షతన మృత దేహాన్ని బయటకు తీసి ఎముకలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్మశాన వాటికలో నాలుగు నెలల అనంతరం మృత దేహాన్ని బయటకు తీసిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.

ఘనంగా తెప్పోత్సవం

తిరువొత్తియూరు: విరుదాచలం విరుదీశ్వర ఆలయంలో మాసి మహా ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విరుదాచలంలోని విరుదీశ్వరర్ ఆలయంలో మాసి మహాఉత్సవాలు 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో ముఖ్య ఘట్టం తెప్పోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

టోల్‌గేట్ తొలగించే వరకు పోరాటం



టోల్‌గేట్ వద్ద పోలీసు బందోబస్తు



భారీ సంఖ్యలో ముట్టడి కార్యక్రమానికి వచ్చిన సీపీఐ కార్యకర్తలు, రైతులు

వేలూరు: తిరువణ్ణామలై నుంచి వేలూరు మార్గంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, కలెక్టర్ కార్యాలయం పక్కన టోల్‌గేట్‌ను ఏర్పాటు చేశారు. అయితే దీన్ని స్థానికులు, రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా రు. తాజాగా తొలగించాలని కోరుతూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం టోల్‌గేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోరాటాలకు ప్రయత్నించిన కార్యకర్తలను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇక ఏదేమైనా టోల్‌గేట్ తొలగించే వరకు పోరాటం ఆపబోమని ఆందోళన కారులు స్పష్టం చేశారు. టోల్‌గేట్ వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని తేల్చిచెప్పారు. కాగా ఈ ఆందోళనలో అన్నదాతలు, ప్రజలు, వాహనదారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలి



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: ప్రధాన రంగాల్లో మహిళల ప్రాధాన్యత ఉన్నప్పటికీ మరింత పెరగాలని కలెక్టర్ ఆల్బీ జాన్‌వర్గీష్ తెలిపారు. తిరువళ్లూరు కలెక్టరేట్‌లో మహిళ దినోత్సవం గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసిన ఆయన అనంతరం వెట్టిచాకిరి, బాల్య వివాహాల నుంచి విముక్తి పొందిన చిన్నారులు, యువతులకు ప్రత్యేక బహుమతులను ప్రదానం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతితో పాటు ఇతర రంగాల్లో రాణించడానికి స్వచ్ఛంద సంస్థలతో కలిసి సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

నేరాల అదుపునకు పెట్రోలింగ్ బైకులు



బైక్ తాళాలను అందజేస్తున్న ఎస్పీ బాలక్రిష్ణన్

వేలూరు: తిరుపత్తూరు జిల్లాలో నేరాలు అదుపునకు రాత్రి వేళల్లో పోలీసులు వాహన తనిఖీలు చేసేందుకు 19 పెట్రోలింగ్ బైకులు పంపిణీ చేస్తున్నట్లు ఎస్పీ బాలక్రిష్ణన్ తెలిపారు. జోలార్‌పేట సమీపంలోని బల్నాకుప్పం క్రాస్ రోడ్డులోని ప్రయివేటు కల్యాణ మండపంలో పోలీసులకు బైకులు పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ రాత్రి వేలల్లో చోరీలు అధికంగా జరిగే ప్రాంతాల్లో బైకులో సైరన్ వేసుకొని వెళ్లడం వల్ల కొంతవరకు అప్రమత్తం చేయవచ్చన్నారు.

భద్రతపై అవగాహన

కొరుక్కుపేట: చెన్నై ఆవడిలోని కంబ్యాట్ వెహికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీవీఆర్‌డీఈ) ఆధ్వర్యంలో 52వ నేషనల్ సేఫ్టీ వీక్ వేడుకలు ఈనెల 4 నుంచి 10వరకు జరుపుకుంటున్నారు. అందులో భాగంగా గురువారం సీవీడీఆర్‌డీఈ ఉద్యోగులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొని భద్రతపై అవగాహన కల్పించారు. అలాగే సీవీఆర్‌డీఈ భద్రతా సిబ్బంది అగ్నిమాపక పరికరాలతో ప్రదర్శనలో పాల్గొని భద్రతా పద్ధతులను వివరించారు. సీవీఆర్‌డీఈ డైరెక్టర్ అత్యుత్తమ శాస్త్రవేత్త వి.బాలమురుగన్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అన్నాడీఎంకే, బీజేపీ మధ్య అంతరాలు తొలగాలి

వేలూరు: అన్నాడీఎంకే, బీజేపీ పార్టీల మధ్య ఉన్న అంతరాలను తొలగించుకుని రానున్న ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించే ప్రయత్నం చేయాలని తమిళ మానిల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జీకే వాసన్ అన్నారు. వేలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈరోడ్డు ఉప ఎన్నికల్లో డీఎంకే నగదు, అధికార బలాన్ని తట్టుకుని అన్నాడీఎంకే కూటమి 44 వేల ఓట్లు సాధించిందన్నారు. అన్నాడీఎంకే కార్యకర్తలు ఎంత డబ్బు ఇచ్చినా అమ్ముడు బోరని దీన్నిబట్టే తెలుస్తోందన్నారు. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లోను అన్నాడీఎంకే, బీజేపీ పార్టీ కూటమికి అత్యధిక సీట్లను చేజిక్కించుకోవడం ఖాయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు పూర్తి నమ్మకం పెట్టారని వీటిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో అన్నాడీఎంకే పార్టీ పొత్తు పెట్టుకోవాలని సూచించారు. ఆయనతో పాటు వేలూరు కార్పొరేషన్ అధ్యక్షులు ఆర్‌కే మూర్తి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న టీఎంసీ పార్టీ అధ్యక్షులు జీకే వాసన్

మహిళా సాధికారతకు కృషి

కొరుక్కుపేట: మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హిందుస్థాన్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుసాన్ వర్గీస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ఈస్ట్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు–2023 ప్రదానోత్సవం బుధవారం రాత్రి జరిగింది. క్లబ్ అధ్యక్షులు రామ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సుసాన్ వర్గీస్ పాల్గొని పారిశ్రామిక వేత్త ప్రత్రీసియా నారాయణన్‌కు అవార్డును ప్రదానం చేసి ప్రశంసా ప్రతం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా అడుగులు వేసి అనుకున్న రంగంలో రాణించాలని సూచించారు.



ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డును ప్రదానం చేస్తున్న డాక్టర్ సుసాన్‌వర్గీస్

విద్యతోనే.. సమాజాభివృద్ధి



రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మహిళలను సత్కరిస్తున్న అతిథులు

వేలూరు: మహిళా విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని సబ్ కలెక్టర్ కవిత అన్నారు. వేలూరు జిల్లా కాట్పాడిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సంఘం, బీఎండీ పాఠశాల సంయుక్తంగా గురువారం ఉదయం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సంఘ కార్యదర్శి జనార్దనన్ అధ్యక్షతన నిర్వహించి.. పలువురిని సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో మహిళలు ముఖ్య భాగం వహిస్తున్నారన్నారు. మహిళలకు ఉన్నత విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఒక మహిళ విద్యావేత్త అయితే కుటుంబమే కాకుండా సమాజం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. పార్లమెంట్‌లోను, సర్వీస్ విభాగంలో మహిళల సంఖ్య అతి తక్కువగా ఉంటోందన్నారు. సుప్రీంకోర్టులో ఒకే ఒక మహిళా న్యాయమూర్తి మాత్రమే ఉన్నారని అదే విధంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ వంటి ప్రభుత్వ శాఖల్లోనూ మహిళల శాతం 10 నుంచి 15 శాతం వరకే ఉందన్నారు. ఏటా కాట్పాడి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించి సమాజానికి ఆదర్శంగా ఉన్న మహిళలను గౌరవిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు శ్రీనివాసన్, కోశాధికారి పయణి, పాఠశాల చైర్మన్ రుక్‌జీ రాజేష్ కుమార్ జైన్, ప్రిన్సిపల్ మాలతి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆ ఘనత విజయకాంత్‌దే..!

తమిళ సినిమా: నటుడు విశాల్ కథానాయకుడుగా నటిస్తున్న తాజా చిత్రం మార్క్ అంటోని. నటుడు ఎస్‌జే సూర్య ప్రతి నాయకుడిగా నటిస్తున్న ఇందులో నటి రీతు వర్మ, అభినయ, తెలుగు నటుడు సునీల్, నిశల్‌గళ్ రవి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మినీ స్టూడియో పతాకంపై వినోద్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుంది. కాగా జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ చిత్ర టీజర్ విడుదల కార్యక్రమాన్ని బుధవారం స్థానిక సైదాపేటలోని అన్నై వేళాంగణి కళాశాలలో నిర్వహించారు. ఇందులో నటుడు విశాల్, ఎస్ జే సూర్య, దర్శకుడు ఆదిక్ రవిచంద్రన్, నిర్మాత వినోద్ కుమార్ తదితర చిత్ర వర్గాలు పాల్గొన్నారు. కాగా అన్నా వేళాంగణి కళాశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, అనేక మంది విద్యార్థులు ఈ వేడుకలు పాల్గొన్నారు. నటుడు విశాల్ అందరికీ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు అందించారు. ముందుగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దక్షిణ భారత నటీనటుల సంఘానికి నటుడు విజయ్‌కాంత్ విశేష సేవలను అందించారని, అప్పుల్లో ఉన్న సంఘాన్ని వృద్ధిలోకి తీసుకొచ్చింది ఆయనేని పేర్కొన్నారు. సంఘ నూతన భవన నిర్మాణానికి విజయకాంతే కారణమని, మరో ఏడాదిలో నూతన భవనం పూర్తి అవుతుందని చెప్పారు. ఆ తర్వాత నూతన భవనంలో నటుడు విజయ కాంత్‌కు భారీ ఎత్తున అభినందన సభను నిర్వహించినట్లు తెలిపారు. ఇక మార్క్ అంటోని చిత్రం గురించి చెప్పాలంటే ఇది మంచి ఎమోషన్స్‌తో కూడిన యాక్షన్ ఓరియెంటెడ్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. దర్శకుడు ఆధిక రవిచంద్రన్ మాట్లాడుతూ ఇది రజనీకాంత్ నటించిన బాషా చిత్రం తరహాలో విజయం సాధిస్తుందని అభిప్రాయపడ్డారు.



కళాశాల విద్యార్థులతో మార్క్ అంటోని చిత్ర యూనిట్

కోలీవుడ్ టాక్స్

నటుడు విజయకాంత్



నేను చూసుకుంటాను..!



నిర్మాత వీఏ దురై, రజనీకాంత్ (ఫైల్)

తమిళ సినిమా: ఒకప్పుడు ఓహో అంటూ వెలిగిన కొందరు సినీ, దర్శక నిర్మాతలు ఇటీవల చివరి దశలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. సీనియర్ నిర్మాత వీఏ.దురై కూడా ఈ కోవలోకే చెందుతారు. ఈయన ఎన్నమ్మా కణ్ణు, పితామగన్, లూటీ, గజేంద్ర వంటి భారీ చిత్రాలను నిర్మించారు. విక్రమ్, సూర్య కథానాయకులుగా నటించిన పితామగన్ చిత్రం ఎంత సంచలన విజయం సాధించిందో తెలిసిందే. అదేవిధంగా నటుడు రజనీకాంత్ నటించిన బాబా చిత్రానికి వీఏ.దురై నిర్వహణ బాధ్యతలను నిర్వహించారు. కాగా పితామగన్ చిత్ర దర్శకుడు బాలాకు మరో చిత్రం చేయడానికి ఈయన రూ.25 లక్షల వరకూ అడ్వాన్స్ ఇచ్చినట్లు, ఆయన మరో చిత్రం చేయకపోవడంతో పాటు ఇచ్చిన అడ్వాన్స్‌ని కూడా తిరిగి చెల్లించలేదని ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆమధ్య నిర్మాత వీఏ.దురై దర్శకుడు బాలా కార్యాలయానికి వెళ్లి తన అడ్వాన్స్ తిరిగి ఇవ్వాలని ధర్నాకు దిగిన ఘటన కూడా వార్తల్లోకెక్కింది. కాగా నిర్మాత వీఏ.దురై మధుమేహం వ్యాధితో ప్రస్తుతం అనారోగ్యానికి గురయ్యారు. భార్య, కూతురును విడిచి స్థానిక విరుగంబాక్కంలో ఒంటరిగా జీవిస్తున్న ఈయన తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దర్శకుడు ఎస్పీ ముత్తురామన్ సహాయంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవలే ఇంటికి చేరుకున్నారు. అయితే మందుల ఖర్చుకు కూడా డబ్బులు లేక దీన స్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని ఆయన ఇటీవల నటుడు కరుణాస్‌కు ఫోన్ ద్వారా తెలియజేశారు. దీంతో ఆయన తనకు తొలి అవకాశాన్ని కల్పించిన నిర్మాత దురై పారితోషకంగా రూ. 50 వేలు ఇచ్చారని, ఆ మొత్తాన్ని ఇప్పుడు ఆయన వైద్య సాయానికి అందించినట్లు మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూర్య రూ. 2 లక్షలు అందించినట్లు సమాచారం. తాజాగా రజనీకాంత్ కూడా స్పందించారు. ఆయన దురైకు ఫోన్ చేసి 'మీరు దేనికి చింతించకండి. మొత్తం ఖర్చు తాను చూసుకుంటాను. ప్రస్తుతం జైలర్ చిత్ర షూటింగ్‌లో ఉన్నాను. అది పూర్తి కాగానే నేను వచ్చి మిమ్మల్ని కలుస్తాను' అని చెప్పినట్లు తెలిసింది.

బాలీవుడ్ ఎంట్రీ షురూ?

నటి సాయి పల్లవి



తమిళ సినిమా: నటనకు అవకాశం ఉన్న పాత్రలకు కేరాఫ్ అడ్రస్ నటి సాయి పల్లవి అనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. మలయాళంలో తొలి చిత్రంలోనే టీచర్‌గా చక్కగా అభినయించి ప్రశంసలు అందుకున్న నటి ఈమె. ఆ ప్రతిభే సాయి పల్లవిని దక్షిణాదికి వ్యాప్తి చెందించింది. అదేవిధంగా తెలుగు, తమిళం చిత్రాల్లోనూ గ్లామర్‌కు దూరంగా నటనకు అవకాశం ఉన్న పాత్రలనే ఎంపిక చేసుకుంటూ నటిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ప్రత్యేకత లేని అవకాశాలను నిర్మొహమాటంగా తోసిపుచ్చిన సాయి పల్లవి తనకు నచ్చిన అవకాశాలు రాకపోవడంతో ఖాళీగానే ఉంటున్నారు తప్ప, వచ్చిన ప్రతి అవకాశాన్ని అంగీకంచటం లేదు. అలా తెలుగులో ఒక చిత్రంలో చిరంజీవికి చెల్లెలిగా నటించే అవకాశాన్నే నిరాకరించారంటే పాత్రల ఎంపిక విషయంలో ఆమె ఎంత స్పష్టమైన అభిప్రాయంతో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం శివకార్తికేయన్‌కు జంటగా నటిస్తున్న ఒక్క తమిళ చిత్రం మాత్రమే ఈమె చేతిలో ఉంది. అలాంటిది ఈమె ప్రస్తుతం బాలీవుడ్ చిత్రంలో నటించే అవకాశం వచ్చిందనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో జోరుగా సాగుతోంది. హిందీలో రామాయణాన్ని ఇతివృత్తంగా తీసుకొని మధు మంతేనా భారీ పౌరాణిక చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు ప్రచారం చాలా కాలంగా సాగుతోంది. ఇందులో శ్రీరామునిగా రణ్‌బీర్ కపూర్, రావణుడిగా హృతిక్ రోషన్ నటించినట్లు సమాచారం. ఇక సీతగా నటి సాయి పల్లవి నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు, హిందీ, కన్నడం , మలయాళం తదితర భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాగా మలయాళం తెలుగు, తమిళం భాషల్లో మంచి పేరున్న సాయి పల్లవి అయితే ఈ పాన్ ఇండియా చిత్రంలో సీతగా నటిస్తే బాగుంటుందని చిత్ర దర్శకుడు భావించినట్లు సమాచారం. అయితే ఇందులో నటి సాయి పల్లవి నటించే విషయం ఖరారు కావాల్సి ఉంది. మరో విషయం ఏంటంటే సాయి పల్లవి తెలుగులో సంచలన విజయం సాధించిన పుష్ప చిత్రానికి సీక్వెల్‌లో కీలకపాత్ర పోషించనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ విషయాన్ని కూడా చిత్ర వర్గాలు నిర్ధారించాల్సి ఉంది.

విభిన్న పాత్రల్లో సాక్షి అగర్వాల్

తమిళ సినిమా: నటనలో సత్తా కలిగిన నటి సాక్షి అగర్వాల్. ఈమె ఎలాంటి పాత్రకైనా న్యాయం చేయగలరనే గుర్తింపు పొందారు. ఇటీవల ఈ బ్యూటీకి వరుస అవకాశాలు తలుపు తడుతున్నాయి. ఇటీవల సీనియర్ దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన నాన్ కడవుల్ ఇల్లై చిత్రంలో సాక్షి అగర్వాల్ యాక్షన్ హీరోయిన్‌గా పవర్‌ఫుల్ పాత్రలో నటించి మెప్పించారు. అందులో చాలా రిస్కీ ఫైట్ సన్నివేశాల్లో నటించి అందరి ప్రశంసలు పొందారు. అదే విధంగా ప్రభుదేవా కథానాయకుడు నటించిన భగీర చిత్రంలో సాక్షి ప్రధాన పాత్ర పోషించారు. సమీపం కాలంలో విడుదలైన ఈ చిత్రంలో ఈమె నటనకు సినీ ప్రముఖులు, అభిమానుల నుంచి ప్రశంసలను అందుకున్నారు. ఈ చిత్రం తనకు మంచి పేరు తెచ్చిపెట్టిందంటూ ఆమె ఆనందం వ్యక్తం చేశారు. తద్వారా మరిన్ని కొత్త అవకాశాలు వస్తున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న చిత్రాలు వరుసగా విడుదలకు సిద్ధమవుతున్నాయని వాటి వివరాలను త్వరలోనే ఆయా నిర్మాతలు వెల్లడిస్తారని చెప్పారు. నటనకు అవకాశం ఉన్న కథా చిత్రాలనే ఎంపిక చేసుకుని నటిస్తున్నట్లు సాక్షి అగర్వాల్ పేర్కొన్నారు.



వెట్రిమారన్ చిత్రాలు ప్రత్యేకం



విడుదలై చిత్ర ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

తమిళ సినిమా: వైవిధ్య భరిత కథ చిత్రాల దర్శకుడు వెట్రిమారన్ తాజాగా తెరకెక్కిస్తున్న చిత్రం విడుదలై. ప్రముఖ హాస్యనటుడు సూరి కథానాయకుడిగా పరిచయం అవుతున్న ఇందులో విలక్షణ నటుడు విజయ్ సేతుపతి ప్రధాన భూమికను పోషిస్తున్నారు. నటి భవాని శ్రీ నాయకగా నటిస్తున్న ఇందులో దర్శకుడు గౌతమ్ మీనన్, రాజీమీనన్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఇళయరాజా సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రాన్ని ఆర్ఎస్ ఇన్ఫోటెంట్ ఎల్డ్ రెడ్ కుమార్ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. కాగా రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రం తొలి భాగం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతుంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం స్థానిక చెట్‌పెట్ లోని లేడీ ఆండాళ్ స్కూల్లో నిర్వహించారు. ముందుగా ఇళయరాజా సంగీత దర్శకత్వంలో రూపొందిన మధురమైన మెలోడీ గీతాలతో నిర్వహించిన సంగీత కార్యక్రమాన్ని వీక్షకులను అలరించింది. అనంతరం చిత్ర ఆడియో, ట్రైలర్‌లను సంగీత దర్శకుడు ఇళయరాజా ఆవిష్కరించారు. చిత్ర నిర్మాత ఎల్డ్ రెడ్ కుమార్ మాట్లాడుతూ ఈ చిత్రం తన పదేళ్ల కల అది ఇప్పటికీ నిజమవ్వడం సంతోషంగా ఉందన్నారు. విడుదలై చిత్ర టైటిల్ తమకు ఇచ్చిన సురేష్ బాలాజీకి ధన్యవాదాలు చెప్పుకుంటున్నారన్నారు. నటుడు విజయ్ సేతుపతి మాట్లాడుతూ వెట్రిమారన్ దర్శకత్వం వహించిన వడచెన్నై చిత్రంలో తాను నటించాల్సిందని అనివార్య కారణాల వల్ల ఆ అవకాశం చేజార్చుకున్నట్లు చెప్పారు. విడుదలై చిత్రం విషయాని కొస్తే దర్శకుడు తనను ఎనిమిది రోజుల పాటు ఆడిషన్ పేరుతో చాలా బాధ పెట్టారన్నారు. అయితే ఇందులో నటించడం మంచి అనుభవమని పేర్కొన్నారు. దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతాన్ని అందించడం యూనిట్ సభ్యులందరికీ సంతోషకరమన్నారు. అనంతరం సంగీత దర్శకుడు ఇళయరాజా మాట్లాడుతూ తమిళ సినిమాలో వెట్రిమారన్ చాలా ముఖ్యమైన దర్శకుడు అని పేర్కొన్నారు. ఆయన చిత్ర కథనాలు సముద్రపు అలలు తరహాలో ప్రత్యేకంగా ఉంటాయన్నారు.

క్లుప్తంగా

రూ. 96 కోట్లతో ఫ్లైఓవర్

- మంత్రి ఉదయనిధి స్టాలిన్ శంకుస్థాపన

కొరుక్కుపేట: కొరుక్కుపేటలో రూ.96 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మాణానికి రాష్ట్ర క్రీడలు యువజన సంక్షేమశాఖా మంత్రి ఉదయనిధి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఉత్తర చెన్నైలోని కొరుక్కుపేటలో ఎన్నూర్ హైవే మీదుగా నెహ్రూ నగర్ ప్రాంతం గుండా రైలు మార్గం ఉంది. ఇక్కడ భారీ సరుకు రవాణా రైళ్ల రాకపోకలు, వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. వ్యాసార్పాడి, మహాకవి భారతీయార్ నగర్, మాధవరం, పెరంబూర్ ప్రాంతాల ప్రజలు ఉత్తర చెన్నైలోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గాన్ని వినియోగిస్తుంటారు. ఎన్నికల సమయంలో ఈ స్థలంలో ఫ్లైఓవర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఆర్‌కే నగర్ ఎమ్మెల్యే ఎబినేజర్ ముందుగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొరుక్కుపేట ఎలిల్ నగర్ ప్రాంతంలోని రైల్వే క్రాసింగ్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రైల్వే శాఖ రూ.10 కోట్లు కేటాయించింది. కార్పొరేషన్ తరపున రూ.96 కోట్లు కేటాయించి ఫ్లైఓవర్ పనులకు బుధవారం ఉదయనిధి శంకుస్థాపన చేశారు.

యువకుడి హత్య

తిరువొత్తియూరు: చెన్నై తురైపాకంలో చోరీ కేసు నిందితుడు హత్యకు గురయ్యాడు. చెన్నై సమీపం నీలాంకారై శివాలయం వీధికి చెందిన మురుగన్ (20). ఇతను తురైపాక్కం మేట్టుకుప్పం వెంకటేశ్వర అవెన్యూలో ఒక కాంట్రాక్ట్ పనిజరుగుతున్న చోట కత్తిపోట్లకు గురై గురువారం ఉదయం శవంగా పడి ఉన్నాడు. చూసిన స్థానికులు తురైపాక్కం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాయపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి విచారణ జరిపారు. విచారణలో హత్యకు గురైన మురుగన్‌పై పలు చోరీ కేసులు ఉన్నాయని, బుధవారం రాత్రి అదే ప్రాంతంలో మద్యం తాగుతున్న సమయంలో స్నేహితుల మధ్య ఏర్పడిన గొడవలో మురుగన్ హత్యకు గురైనట్లు తెలిసింది. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

తిరువొత్తియూరు: దాడి కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రవేష్ బోరో (32). ఇతను కోవై చొక్కాపురంలో ఆటో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఇతను బుధవారం రాత్రి వ్యాపారం ముగించుకొని దకాణానికి తాళం వేసుకుని మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. తడాకం రోడ్డు వద్ద వెళుతుండగా పెట్రోల్ లేక ఆగిపోయింది. ఈ సమయంలో అటుగా వెళుతున్న ఇద్దరు యువకులు అతన్ని హేళన చేశారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహం చెందిన ఇద్దరు ప్రవేష్ బోరోపై దాడి చేసి పారిపోయారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేశారు. విచారణలో తటాకం రోడ్డు కేఎస్ నగర్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ ఉద్యోగి సంతానం (20), శేషన్ (20) దాడి చేసినట్టు తెలిసింది. పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు.

తుపాకీతో కాల్చుకుని రైతు ఆత్మహత్య

అన్నానగర్: తుపాకీతో కాల్చుకుని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నీలగిరి జిల్లా కూడలూరు సమీపం దేవరచోలై అచ్చుగున్ను ప్రాంతానికి చెందిన కన్నదాసన్ (48) రైతు. కుటుంబసమస్యల కారణంగా భార్యతో తరచూ గొడవలు జరిగేవి. ఈ స్థితిలో గురువారం తెల్లవారుజామున కన్నదాసన్ నాటు తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే భార్య పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని కాంగ్రెస్ శ్రేణుల ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తిరుత్తణి: పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కేజీ.కండ్రిగలో కాంగ్రెస్ శ్రేణులు గురువారం ధర్నా చేశారు. తిరుత్తణి నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కేజీ.కండ్రిగలో నిర్వహించిన ధర్నాకు మండల అధ్యక్షుడు ఏలుమలై అధ్యక్షత వహించారు. ఆ పార్టీ రాష్ట్ర జనరల్ బాడీ కమిటీ సభ్యుడు వెంకటరాజు, రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది మురుగన్ పాల్గొని వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల జీవితాలతో బీజేపీ ప్రభుత్వం ఆడుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేసి ధర్నా చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి త్యాగరాజన్, పళ్లిపట్టు పట్టణ అధ్యక్షుడు శివకుమార్, తిరుత్తణి పట్టణ అధ్యక్షుడు పార్థిబన్, నేతలు రాజీవ్‌గాంధీ, మెకానిక్ మురుగన్, యూనియన్ కౌన్సిలర్లు కలైసెల్వి ఏలుమలై పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

అన్నానగర్: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. చెన్నై పెరంబూరుకు చెందిన ప్రకాష్‌కు, క్రోంపేటకు చెందిన ప్రియతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ స్థితిలో బుధవారం ప్రకాష్, ప్రియ పెరియమేడులోని ఓ లాడ్జీలో గది తీసుకున్నారు. రాత్రి 9 గంటలకు ప్రకాష్ మృతిచెందాడని ప్రియ పోలీసులకు సమాచారం అందించింది. పెరియమేడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో ఇద్దరూ ఎక్కువగా మద్యం తాగినట్లు తెలిసింది. పెరియమేడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పంగుణి ఉత్సవాలు ప్రారంభం

- ధ్వజారోహణంతో ఉత్సవాలకు శ్రీకారం
- ఏప్రిల్ 1న రథోత్సవం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు



కొరుక్కుపేట: తిరువారూరు త్యాగరాజస్వామి ఆలయంలో పంగుణి ఉత్సవాలు ధ్వజారోహణంతో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా త్యాగరాజ మందిరం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్ద శివాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభంపై జెండాను ఆవిష్కరించారు. గురువారం నుంచి పంగుని ఉత్సవాలను శివాచార్యులు వేదమంత్రోచ్ఛరణ నడుమ శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఇక్కడి అలయ రథాన్ని ఆసియా ఖండంలోనే అతిపెద్ద రథంగా పిలుస్తారు. ఆలయంలో రథోత్సవం ప్రదాన ఘట్టంగా ఉంటుంది. ఏప్రిల్ 1న త్యాగరాజ స్వామి ఆలయంలో రథోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నంబియార్ ఆలయంలో..

తిరువొత్తియూరు: తిరునల్వేలి జిల్లా తిరుకురుంకుడిలో కొలువున్న నంబియార్ ఆలయంలో బుధవారం పంగుణి ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో ఏటా పంగుణి నెలలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఇక గురువారం వేకువజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత తిరుమంజనం, అభిషేకం నిర్వహించారు. ధ్వజాన్ని పల్లకిలో ఉంచి 4 మాడవీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని రోజు యాగ శాల పూజలు, ప్రత్యేక హోమం, తిరుమంజనం, అలాగే నంబియార్ పెరుమాళ్ శ్రీదేవి భూదేవి సమేతంగా వేర్వేరు వాహనాల్లో నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఉత్సవాల్లో ముఖ్యమైన నంబి స్వామిగల్ సిద్దులకు దర్శనమిచ్చే ఉత్సవం ఐదవ రోజైనా 12వ తేదీన నిర్వహిస్తారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు సిద్దులకు పెరుమాళ్ స్వామి గరుడవై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇస్తారు. అలాగే రథోత్సవం 10వ రోజు 17వ తేదీన నిర్వహించనున్నారు.

బిల్లులు చెల్లించాలని ఆందోళన



తిరుమళిసైలో ఆందోళన చేస్తున్న టాస్మాక్ ఉద్యోగులు

తిరువల్లూరు: నాలుగు నెలలుగా కార్మికులకు చెల్లించాల్సిన కూలి, ట్రాన్స్‌పోర్ట్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు, లారీ డ్రైవర్‌లు ఆందోళనకు దిగారు. 350 టాస్మాక్ దుకాణాలకు మద్యం రవాణా నిలిచిపోయింది. తిరువళ్లూరు జిల్లా తిరుమళిసైలో ప్రభుత్వ టాస్మాక్ గోదాము ఉంది. ఇక్కడి నుంచి తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాలకు చెందిన 350 టాస్మాక్ దుకాణాలు, 120 బార్‌లు, నక్షత్ర హోటల్స్‌కు మద్యం రవాణాను లారీల ద్వారా సరఫరా చేస్తుంటారు. అయితే లారీల్లో మద్యం బాటిల్స్‌ను లోడింగ్ అన్ లోడింగ్ చేసే కార్మికులకు కూలి, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు ప్రతినెలా రూ. కోటి చెల్లించాల్సి వుంది. అయితే నాలుగు నెలల నుంచి బిల్లులు, కూలి చెల్లించడం లేదు. ఇదే విషయంపై పలుమార్లు ఉన్నత అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో ఆగ్రహించిన కూలీలు, లారీ డ్రైవర్‌లు గురువారం ఉదయం గోదాము ఎదుట ఆందోళన నిర్వహించారు. దీంతో టాస్మాక్ దుకాణాలకు వెళ్లాల్సిన మద్యం రవాణా పూర్తిగా ఆగిపోయి కొరత ఏర్పడింది. విషయం తెలిసి అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

కోలాహలంగా మహాకుంభాభిషేకం



గోపుర కలశాలకు పుణ్యతీర్థాలతో మహాకుంభాభిషేకం, హాజరైన భక్తజనం

తిరుత్తణి: వేలంజేరిలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయ మహాకుంభాభిషేకం గురువారం కోలాహలంగా నిర్వహించారు. తిరుత్తణి శివార్లలోని వేలంజేరిలో వరసిద్ధి వినాయకస్వామికి కొత్త ఆలయం నిర్మించారు. మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహించిన మహాకుంభాభిషేకం వేడుకలు పురష్కరించుకుని ఆలయ ప్రాంగణంలో యాగశాలలు ఏర్పాటు చేసి నిత్య హోమపూజలు నిర్వహించారు. గురువారం ఉదయం మహాపూర్ణాహుతి హోమపూజలు చేశారు. అనంతరం గ్రామీణులు పెద్ద సంఖ్యలో మేళతాళాలు నడుమ పవిత్ర పుణ్యతీర్థాల కలశాలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. కలశాల్లోని పుణ్యతీర్థాలతో అర్చకులు మహాకుంభాభిషేకం నిర్వహించి భక్తులపై తీర్థజలాలు చల్లారు.

మా సార్ బదిలీని నిలిపివేయండి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

తిరువొత్తియూరు: తూత్తుక్కుడి జిల్లా ఎట్టాయాపురం సమీపంలో సెంథిల్‌కర్రై ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు ధర్నా చేశారు. ఇక్కడ 57 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. హెచ్ఎం సహా ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ప్రధానోపాధ్యాయుడు సెంథిల్‌కుమార్‌ను కిలవిపట్టి ప్రభుత్వ యూనియన్ మాధ్యమిక పాఠశాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అతనికి బదులుగా నీలా జయలక్ష్మిని హెచ్ఎంగా నియమించారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు అతని ప్రధానోపాధ్యాయుడు సెంథిల్‌కుమార్ బదిలీని నిలిపివేయాలని కోరారు. విద్యార్థులు తరగతులను బహిష్కరించి గ్రామ నిర్వాహక అధికారి సమక్షంలో వారు ధర్నా చేపట్టారు. సెంథిల్ కుమార్ కృషి వల్లే విద్యార్థుల సంఖ్య పెరిగిందని విద్యార్థులు తల్లిదండ్రులు తెలిపారు. అనంతరం విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

మహిళకు రూ.50వేల జరిమానా

కొరుక్కుపేట: కోర్టును దుర్వినియోగం చేసిన ఓ మహిళకు రూ.50వేల జరిమానా విధించాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. హిమాచల్‌ప్రదేశ్ హార్టికల్చర్ ఇన్‌స్టిట్యూట్ తరపున తంజావూరులో హిమాచల్ యాపిల్, ఇతర పండ్ల రసాల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. హిమాచల్‌ప్రదేశ్ హార్టికల్చర్ కార్పొరేషన్ కాంట్రాక్టు ప్రాతిపదికన జెస్సీ ఫ్లోరెన్స్ అనే మహిళను సేల్స్‌గర్ల్‌గా నియమించుకుంది. ఎలాంటి నోటీసులు లేకుండా మార్చి 8, 2013న జెస్సీ కాంట్రాక్టును రద్దు చేసినట్లు కార్పొరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మదురై హైకోర్టును జెస్సీ ఆశ్రయించారు. ఈ కేసు సంబంధించి 20 రోజుల్లోనే జెస్సీ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఎస్.ఎం.సుబ్రమణ్యం మదురై బ్రాంచ్‌లో కేసు నడుస్తుండగా, ఇదే కేసును మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేయడం సమంజసం కాదని, న్యాయవ్యవస్థను దురివ్వినియోగం చేసినట్లని జెస్సీని కోర్టు తప్పుబట్టింది. దీంతో ఆమెకు రూ.50 వేల జరిమానా విధించి పిటిషన్‌ను కొట్టివేసింది. జరిమానాను రెండు వారాల్లోగా హైకోర్టు న్యాయ వ్యవహారాల కమిషన్‌కు చెల్లించాలని, ఈనెల 23న కోర్టుకు నివేదించాలని తీర్పులో ఆదేశించారు.

అటవీశాఖ అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



జీప్‌ను అడ్డుకున్న మహిళలు

పళ్లిపట్టు: కొండలో శివాలయం నిర్మాణాన్ని అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో ఆగ్రహించిన మహిళలు అధికారి జీప్ అడ్డుకుని నిరసన తెలిపారు. ఆర్కేపేట మండలం శ్రీకాలికాపురం గ్రామంలోని కొండపైలో కొంతమంది ఆలయం నిర్మించి అందులో శివుని విగ్రహం ప్రతిష్టించారు. అయితే అనుమతి లేకుండా రిజర్వ్‌ఫారెస్ట్‌లో ఆలయం నిర్మించకూడదని పళ్లిపట్టు రెవెన్యూ అధికారులు విగ్రహాన్ని తొలగించేందుకు వెళ్లారు. విషయం తెలిసి మహిళలు అటవీశాఖ అధికారి జీపు అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లారు.

గూండా చట్టం కింద ఇద్దరి అరెస్ట్



అరెస్టయిన విజయకుమార్, రాకేష్

తిరువళ్లూరు: వరుస చోరీలకు పాల్పడిన ఇద్దరు యువకులపై గూండా చట్టాన్ని ప్రయోగిస్తూ ఆవడి కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరువళ్లూరు జిల్లా అంబత్తూరు ప్రాంతానికి చెందిన గజేంద్రన్ కుమారుడు విజయకుమార్(29). ఆవడి గాంధీనగర్‌కు చెందిన ఐసాక్ కుమారుడు రాకేష్(22). ఇద్దరు కలిసి తరచూ చోరీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేవారు. వీరి ప్రవర్తననూ మార్చుకోవాలని పలుమార్లు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం లేకపోవడంతో వీరిద్దరిపై గూండా చట్టాన్ని ప్రయోగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా వీరిద్దరు సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ చేస్తూ పట్టుబడి పుళల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు.

కాలువ సర్వే పనుల అడ్డగింత



కాలువ సర్వే పనుల ప్రాంతంలో పోలీసులు

పళ్లిపట్టు: కీచ్చళం పంచాయతీలో కాలువ సర్వే పనుల చేపట్టేందుకు వెళ్లిన రెవెన్యూ శాఖ అధికారులు స్థానికుల వ్యతిరేకతతో గురువారం వెనుదిరిగారు. పళ్లిపట్టు యూనియన్ కీచ్చళం గ్రామ పంచాయతీలోని ఓపీఎస్ కండ్రిగ పొలం వద్ద నాలుగు కుటుంబాలు అనేక సంవత్సరాలుగా నివాశముంటున్నారు. వారు ఇళ్లకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో పొలాల మీదుగా పయనిస్తున్నారు.ఈ క్రమంలో అక్కడున్న ప్రజా పనుల శాఖకు చెందిన కాలువ ప్రాంతంలో రాకపోకలకు వీలుగా దారి కల్పించాలని అధికారులకు ఆర్మీలో పనిచేస్తున్న ఓ వ్యక్తి కోరాడు. దీంతో గతంలో రెండుసార్లు అధికారులు సర్వే చేశారు. అయితే పొలంలో దారి ఏర్పాటుకు యజమానులు అంగీకరించలేదు. అయితే గతంలో పొలం వద్ద పెట్టిన కొబ్బరిచెట్లను జేసీబీతో అధికారులు తొలగించడం వివాదస్పదంగా మారింది. ఈ క్రమంలో గురువారం ప్రజా పనుల శాఖ సహాయ ఇంజినీరు శివషణ్ముగం, డిప్యూటీ తహసీల్దారు సెల్వం బృందం కాలువ స్థలాన్ని సర్వే చేపట్టేందుకు వీలుగా పోలీసుల బందోబస్తుతో పనులు చేపట్టేందకు వెళ్లారు. అయితే తమ పొలంలో సర్వే పనులు చేపట్టేందుకు హైకోర్టు నిషేధం విధించిందని కోర్టు ఉత్తర్వులను యజమాని చూపడంతో చేసేదేమి లేక అధికారులు వెనుదిరిగారు.

ఆన్‌లైన్ రమ్మీ మరణాలకు గవర్నర్ నిర్లక్ష్యమే కారణం



తిరుత్తణి సభలో మాట్లాడుతున్న పీఎంకే చీఫ్ అన్బుమణి

తిరుత్తణి: ఆన్‌లైన్ రమ్మీ ఆటతో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర గవర్నర్ సమాధానం చెప్పాలని పీఎంకే అధినేత డాక్టర్ అన్బుమణి డిమాండ్ చేశారు. పీఎంకే ఆధ్వర్యంలో తిరుత్తణి నియోజకవర్గ స్థాయి బహిరంగసభ తిరుత్తణి- చిత్తూరు రోడ్డు కూడలిలో ఘదవారం రాత్రి నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఎంకే అధ్యక్షుడు ఎంపీ, అన్బుమణి మాట్లాడతూ రాష్ట్రంలో ద్రవిడ పార్టీల 54 ఏళ్ల పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు రాష్ట్ర ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, పీఎంకేకు ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రజలు నిర్ణయించుకున్నారని.. 2026లో పీఎంకే పాలన తథ్యమన్నారు. ఆన్‌లైన్ రమ్మీ కారణంగా కుటుంబాలు సర్వ నాశనవుతున్నాయని తెలిపారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును తప్పింపడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో పీఎంకే రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వైద్యలింగం, మాజీ ఎమ్మెల్యే రవిరాజు, జిల్లా కార్యదర్శి దినేష్, జిల్లా అధ్యక్షుడు విజయన్, నాయకులు బాల యోగి, వెంకటేశ్ పాల్గొన్నారు.

సూపర్‌కిడ్స్ అవార్డు-2023 ప్రదానం



అవార్డులందుకున్న వారితో నటి స్నేహ

కొరుక్కుపేట: తమిళనాడుకు చెందిన అసాధారణ విజయాలు సాధించిన చిన్నారుల శక్తి, ప్రతిభను ప్రోత్సహిస్తూ గురువారం సాయంత్రం చెన్నైలో సూపర్ కిడ్స్ అవార్డులు -2013 ప్రదానం చేశారు. చెన్నై గిండిలో ఐటీసీ సన్‌ఫీస్ట్ సూపర్‌మిల్క్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నటి స్నేహ పాల్గొని ప్రతిభ కలిగిన చిన్నారులకు సూపర్ కిడ్స్ అవార్డులను అందజేశారు. సూపర్‌కిడ్స్ అవార్డులను డి.గుకేష్ (చెస్), లైడియన్ నాదస్వరం (మ్యూజిక్), వినీషా ఉమాశంకర్ (సైన్స్ అండ్ ఇన్నోవేషన్), సింగ్ (పర్యావరణం), కె.త్రిషా (యోగా)అందుకున్నారు. ఇందులో ఐటీసీ లిమిటెడ్ సీఈఓ అలీ హర్రీస్ షేరీ పాల్గొన్నారు.

త్వరలో సందర్శనకు అన్నానగర్ టవర్ పార్కు



అన్నానగర్ టవర్

అన్నానగర్: త్వరలో అన్నానగర్ టవర్ పార్కును నగరవాసులు సందర్శించేందుకు అనుమతించనున్నారు. 1960లో నిర్మించిన ఈ టవర్‌పై నుంచి 2011లో దంపతులు కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ టవర్‌ను సందర్శకులు ఎక్కడాన్ని నిషేధించారు. ఈ నేపథ్యంలో త్వరలో ప్రజలను టవర్‌పైకి సందర్శనకు అనుమతించనున్నట్లు కార్పొరేషన్ సీనియర్ అధికారులు పేర్కొన్నారు. టవర్‌పై నుంచి సందర్శకులు కింద పడకుండా ఇనుప చువ్వలు పకడ్బందీగా ఏర్పాటు చేశారు. సంప్రదాయ కళలు తెలియజేసేలా పెయింటింగులు వేశారు. 15 ఎకరాల స్థలంలో వంద అడుగుల ఎత్తులో 12 అంతస్తులతో టవర్ ఉంది. ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ఫెయిర్-1968 కోసం బీఎస్ అబ్దుల్ రెహ్మాన్ ఈ ఈ టవర్ పార్కు నిర్మించారు. అప్పటి ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై ఆధ్వర్యంలో అప్పటి ఉపరాష్ట్రపతి వీవీ గిరి ప్రారంభించారు. పార్కులో చెరువు, బ్యాడ్మింటన్ కోర్టు, చిన్నారులకు క్రీడా స్థలం, స్కేటింగ్ ఉన్నాయి.

వైష్ ఫెడరేషన్ మహిళా విభాగం ప్రారంభం



మహిళలకు సహాయకాలు అందజేస్తున్న దాతలు

కొరుక్కుపేట: ఇంటర్నేషనల్ వైష్ ఫెడరేషన్ -తమిళనాడు చెన్నై జిల్లా మహిళా విభాగాన్ని ఘనంగా ప్రారంభించారు. దీనికి చెన్నై టీనగర్‌లోని ఆస్కాలో జరిగిన కార్యక్రమంలో వైష్ ఫెడరేషన్ తమిళనాడు విభాగం అధ్యక్షుడు అజంతా డాక్టర్ కే శంకరరావు స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథిగా ఎంటీపీ వైష్ణవ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉటీరా హాజరై నలుగురికి వైష్ అచీవర్ అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులను బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ ఎం.రజిని, ఎయిర్ ఇండియా కమాండర్ కెప్టెన్ సోనియా జైన్, వెల్ నెస్ కోచ్ పూర్ణిమ కుమార్, వంటల నిపుణులు యూట్యూబర్ మీనా సుధీర్‌లకు అందజేశారు. వేడుకల్లో భాగంగా జయరాజ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ రాజశేఖర్, జయశ్రీ రాజశేఖర్ దంపతులు కలిసి ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు కుట్టు మిషన్‌లను వితరణగా అందజేశారు. వైష్ ఫెడరేషన్ కార్యదర్శి శేషాద్రి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయ సేవలు ప్రారంభం



బాలుడికి సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: గత 22 నెలలుగా మూసివేసిన తిరుత్తణి ఎమ్మెల్యే కార్యాలయం సేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. తిరుత్తణి ఎమ్మెల్యేగా గెలుపొందిన డీఎంకేకు చెందిన ఎస్.చంద్రన్ స్థానిక మోపోసీ రోడ్డులోని ప్రభుత్వ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లకుండా పట్టణంలోని అతని ఇంటి నుంచే సేవలు కొనసాగించారు. అయితే ప్రజలకు ఎమ్మెల్యే కార్యాలయం అందుబాటులో లేదని, ప్రభుత్వం నిర్మించిన భవనం నిరుపయోగంగా వున్నట్లు, ప్రజలు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి రావడం ఇబ్బందిగా వున్నట్లు వరుస క్రమంలో ఫిర్యాదులు రావడంతో స్పందించిన ఎమ్మెల్యే ఇకపై సేవలు ఎమ్మెల్యే కార్యాలయం నుంచే చేపడతానని ప్రకటించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. 5వ తరగతి చదువుకుంటున్న విద్యార్థి ఎమ్మెల్యేను కలిసి తను ఇంటి నుంచి ప్రతిరోజూ రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాలని తనకు సైకిల్ ఏర్పాటు చేయాలని కోరడంతో వెంటనే ఎమ్మెల్యే సొంత ఖర్చుతో సైకిల్ కొనుగోలు చేసి అందజేశారు.

క్లుప్తంగా...

కోడెల శివరామ్‌పై చీటింగ్ కేసు నమోదు

- కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు



తెనాలిరూరల్: టీడీపీ నేత, శాసనసభ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ తనయుడు కోడెల శివరామ్‌పై చీటింగ్ కేసు నమోదైంది. తన కంపెనీలో పెట్టుబడి పెట్టించి మోసం చేశాడని బాధితులు కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారు. శివరామ్, అతడి భార్య పద్మప్రియ విజ్ఞప్తి మేరకు శివరామ్‌కే చెందిన కైరా ఇన్‌ఫ్రా కంపెనీలో 2016లో గుంటూరు జిల్లా తెనాలి మండలం పెదరావూరు గ్రామానికి చెందిన పాలడుగు బాలవెంకటసురేష్ రూ.24.25 లక్షల పెట్టుబడి పెట్టారు. మరో ముగ్గురు సుమారు రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టారు. అందుకు సంబంధించి చెక్కుల ద్వారా లావాదేవీ జరిపారు. వీరి పెట్టుబడి, అందుకు తగిన ప్రతిఫలాన్ని మరుసటి ఏడాది 2017లో తిరిగి ఇచ్చేలా శివరామ్, అతడి భార్య ఒప్పందం చేసుకున్నారు. ఎన్నిసార్లు అడిగినా డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో బాధితులు తెనాలి కోర్టును ఆశ్రయించారు. బాలవెంకటసురేష్ పిటిషన్‌పై కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు శివరామ్‌పై 420, 407, 403, 386, 389, 120బి, 506, 509 ఐపీసీ, 156(3) సీఆర్‌పీసీ సెక్షన్ల కింద రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు.

నేతన్నలను మోసం చేసిన జగన్

టీడీపీ నేత లోకేశ్



మదనపల్లె: మదనపల్లె చేనేత వస్త్రాలకు ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేస్తానని చెప్పిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఆ విషయమే మరచిపోయి నేతన్నలను మోసం చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఆయన ఎనుముల వారిపల్లె వద్ద చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. టీడీపీ హయాంలో చేనేత కార్మికులకు అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇప్పుడు అమలవుతున్న వైఎస్సార్ నేతన్న నేస్తం పెద్ద మోసమని ఆరోపించారు. సొంత మగ్గాలు ఉన్న వారికే సాయం అందిస్తామనడంతో అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పవర్ లూమ్స్ యజమానులకు 500 యూనిట్లు, హ్యాండ్‌లూమ్స్‌కు 200 యూనిట్ల విద్యుత్‌కు రాయితీ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులను నిరోధించేవిధంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ఉన్నట్టుగా బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకువస్తామన్నారు. అనంతరం మైనారిటీ నాయకులతో సమావేశమైన ఆయన వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ కోసం వక్ఫ్ బోర్డుకు జ్యుడిషియల్ పవర్స్ ఇస్తామని, ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సీటీఎం క్రాస్ వద్ద యువగళం పాదయాత్ర 500 కిలోమీటర్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

చెరకు తోటలో అగ్నిప్రమాదం

లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు గుడిసివారిపల్లె ప్రకృతి వనం వద్ద కార్యకర్తలు పేల్చిన బాణసంచా జువ్వలు పడి చెరకు తోటలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

రాష్ట్రం బాగుండటం బాబుకు ఇష్టంలేదు

మంత్రి రజిని



ఆనంద్‌కుమార్‌తో కలిసి ప్రచారం చేస్తున్న మంత్రి విడదల రజిని

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రానికి పెట్టుబడులు రావడం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం చంద్రబాబుకు ఇష్టంలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఎంతో పారదర్శకంగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌పై చంద్రబాబు అసత్యప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై నమ్మకంతో రూ.13.05 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరాయన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ ఆమె గురువారం పార్టీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌తో కలిసి భీమిలి, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రచారంలో అడుగడుగునా పట్టభద్రులు బ్రహ్మరథం పడుతున్నారని, విశాఖను పరిపాలన రాజధానిగా ఉత్తరాంధ్ర వాసులంతా స్వాగతిస్తున్నారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తారని ప్రజలంతా నమ్ముతున్నారని పేర్కొన్నారు. సీఎంగా మూడున్నరేళ్ల పరిపాలన కాలంలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98.5 శాతానికిపైగా మేనిఫెస్టోని అమలుచేశారని ఆమె చెప్పారు.

పైశాచికత్వంపై కొరడా!

పిల్లల పోర్న్ వీడియోల షేరింగ్‌పై పోలీసుల ఆగ్రహం

- 26 జిల్లాల్లో 1,787 మందిపై కేసుల నమోదుకు చర్యలు
- ఇప్పటికే 680 మందిపై క్రిమినల్ కేసులు
- నేరం రుజువైతే పదేళ్ల జైలు.. రూ.10 లక్షల జరిమానా



అతనో డాక్టర్. విజయవాడ నుంచి ఢిల్లీ వెళుతూ ఆన్‌లైన్‌లో ఓ బాలిక పోర్న్ వీడియో చూశాడు. అంతటితో ఆగని వైద్యుడు వీడియోను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాలో ఉన్న తన ఫేక్ ఐడీ ద్వారా పబ్లిక్ డొమైన్‌లో షేర్ చేశాడు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వివరాలన్నింటినీ సేకరించిన పోలీసులు.. ఆ డాక్టర్‌ను అరెస్ట్ చేసేందుకు వెళితే ఆ తప్పు తాను చేయలేదంటూ బుకాయించాడు. తీరా సాక్ష్యాలు చూపించాక తోక ముడవగా నిందితుడిని కోర్టుకు తరలించారు.

చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో గత నెల వరకు 1,787 మంది పిల్లల పోర్న్(అశ్లీల) వీడియోలను పలు సామాజిక మాధ్యమాల్లో, స్నేహితులకు షేర్ చేశారు. చట్ట విరుద్ధమైన ఈ నేరానికి పాల్పడిన వాళ్లపై క్రిమినల్ కేసుల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించుకుంది. ఇందులో భాగంగా నిందితుల వివరాలను 26 జిల్లాల ఎస్పీలకు అందజేయగా.. వాళ్లపై చర్యలకు పోలీసులు సిద్ధమయ్యారు. నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్(ఎన్‌సీఎంఈసీ).. అనేది అమెరికాకు చెందిన ఎలాంటి లాభాపేక్ష ఆశించని స్వచ్ఛంద సంస్థ. 2019లో ఈ సంస్థ మనదేశంతో ఒప్పందం చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో సహకారంతో ఇక్కడ పనిచేస్తోంది. ఈ సంస్థ తప్పిపోయిన, అక్రమ రవాణాకు గురైన పిల్లలతో పాటు లైంగిక దాడికి గురైన పిల్లల్ని సంరక్షిస్తుంది. అలాగే 18 ఏళ్లలోపు వయస్సున్న పిల్లలకు సంబంధించిన అసభ్య వీడియోలు(పోర్న్) ఇంటర్‌నెట్ నుంచి తీసుకుని మరొకరికి చేరవేయడం, సామాజిక మాధ్యమాల ద్వారా షేర్ చేయడం వంటివి చేస్తే ఆ వీడియోలను తొలగించడంతో పాటు వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటుంది. ఇలా దేశంలోని ప్రతి రాష్ట్రంలో జిల్లాల వారీగా వివరాలు సేకరించి కేంద్ర హోంశాఖ ద్వారా ఆయా రాష్ట్రాల హోంశాఖలకు పంపుతోంది. లింగ భేదంతో సంబంధం లేకుండా పిల్లల గోప్యత, హక్కులను కాలరాసే ఈ చర్యను తీవ్రంగా పరిగణిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఎన్‌సీఎంఈసీ పంపిన వివరాల ఆధారంగా నిందితులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయాలని ఆయా జిల్లాల ఎస్పీలకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు నిందితులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు.

అప్‌లోడ్ చేసినా, షేర్ చేసినా.. ఇక అంతే!

ప్రతి నెలా ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న నిందితుల వివరాలను టిప్‌లైన్ సాంకేతిక వ్యవస్థతో కేంద్ర హోంశాఖ నుంచి రాష్ట్ర హోంశాఖకు అందుతోంది. ఒక టిప్‌లైన్‌లో ఏ వ్యక్తి ఏ తేదీన, ఏ సమయంలో, ఏ మొబైల్/కంప్యూటర్ నుంచి ఏ పోర్న్ వీడియోను అప్‌లోడ్ చేశాడు? ఎందులో షేర్ చేశాడు? ఏ స్థలం నుంచి పోర్న్ వీడియో అప్‌లోడ్ చేశాడు? ఆ చిత్రం ఎన్ని నిమిషాలు ఉంది? ఉపయోగించిన ఎలక్ట్రానిక్ పరికరం ఇంటర్నెట్ ప్రోటోకాల్ అడ్రస్? అనే వివరాలను టిప్‌లైన్‌లో నిక్షిప్తమవుతున్నాయి. దీనికి సంబంధించిన పూర్తి సాంకేతిక సాక్ష్యాలు కేంద్రం నుంచి రాష్ట్ర పోలీస్‌కు అందుతున్నాయి. పోలీస్ శాఖ దీన్ని జిల్లాల వారీగా విభజించి ఓ ఫైల్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులో ప్రతి మూడు నెలలకోసారి ఈ అశ్లీల వీడియోలు షేర్ చేసే వారి వివరాలుంటాయి. గత నెల వరకు రాష్ట్రంలో 1,787 మంది ఈ నేరానికి పాల్పడ్డట్టు నివేదిక అందింది. అత్యధికంగా గుంటూరులో 330, విశాఖ 270, ఎన్టీఆర్ విజయవాడ 238, కడప 126, నెల్లూరు 102, ప్రకాశం 94, అనంతపురం 90, తిరుపతి 77, శ్రీకాకుళం 70, చిత్తూరు 59, కాకినాడ 56, ప.గో 50, కర్నూలు 49, బాపట్ల 44, కృష్ణా 30, విజయనగరం 25, నంద్యాల 14, ఏలూరు 14, పల్నాడు 12, కోనసీమ 11, అన్నమయ్య 10, సత్యసాయి 6, అనకాపల్లి 4, పార్వతీపురం 2, రాజమండ్రి 2, అల్లూరి సీతారామరాజు 2 మంది ఈ నేరాలకు పాల్పడ్డారు. కాగా, ఇప్పటి వరకు 680 మందిపై కేసులు నమోదయ్యాయి.

శిక్షలు కఠినతరం

ఈ కేసుల్లో కఠిన శిక్షలు విధించేలా చట్టాల్లో మార్పులు చేశారు. సాక్ష్యాధారాలు న్యాయస్థానంలో రుజువైతే మొదటిసారి ఐదేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష, రెండోసారి ఇదే తప్పు చేస్తే గరిష్ఠంగా ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 లక్షల వరకు జరిమానా విధించవచ్చని చట్టం చెబుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నేతల కోడ్ ఉల్లంఘన

యలమంచిలి సబ్ జైలులో ఎన్నికల ప్రచారం



సబ్ జైల్‌లో ప్రచారం చేసి వస్తున్న టీడీపీ నేతలు

యలమంచిలి (అనకాపల్లి జిల్లా): ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నేతలు యథేచ్ఛగా నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. అనకాపల్లి జిల్లా యలమంచిలిలో గురువారం టీడీపీ కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, ఆ పార్టీ నేతలు కొఠారు సాంబశివరావు, పెయ్యల రామకృష్ణ, గొర్లె బాబురావు, లక్ష్మణ, మరికొంతమంది ఏకంగా సబ్ జైల్‌లోకి ప్రవేశించి ఎన్నికల ప్రచారానికి తెగబడ్డారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మద్దతు ఇస్తున్న అభ్యర్థికి ఓటు వేయాలని సబ్ జైల్ సిబ్బందిని ఓటు అభ్యర్థించేందుకు వారు వెళ్లారు. అనుమతి లేనిదే ఇతరులు సబ్ జైలులోకి ప్రవేశించడానికి వీల్లేదు. టీడీపీ నేతలు ఉపకారాగారంలోకి ప్రవేశించి, ప్రచారం చేయడానికి యలమంచిలి సబ్ జైల్ సిబ్బంది సహకరించడం విమర్శలపాలైంది. రిమాండ్ ఖైదీల భద్రత, పర్యవేక్షణ విషయంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలకు టీడీపీ నేతల ఎన్నికల ప్రచారం ఊతమిస్తున్నది. జైలు సూపరింటెండెంట్ కనకరాజును వివరణ కోరగా.. ఉపకారాగారంలోకి టీడీపీ నేతలు రావడం తప్పేనని అంగీకరించారు. ఇక్కడ ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదని చెప్పి పంపించి వేశానని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేద్దామా..

పార్టీ నేతలతో చంద్రబాబు మంతనాలు

సాక్షి, అమరావతి: గెలిచే అవకాశం లేకపోయినా ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయాలని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. టీడీపీ అభ్యర్థిని పోటీకి దింపే విషయంపై చంద్రబాబు పార్టీ నేతలతో రెండురోజులుగా మంతనాలు జరుపుతున్నారు. ఎమ్మెల్యేల కోటాలో ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనుండడంతో ఒక స్థానానికి అభ్యర్థిని పోటీకి పెట్టాలని చంద్రబాబు యోచిస్తున్నట్లు పార్టీ నేతలు లీకులిచ్చారు. 22 మంది ఎమ్మెల్యేలు ఉంటే ఒక ఎమ్మెల్సీ స్థానం వచ్చే అవకాశం ఉంటుంది. కానీ టీడీపీ తరఫున గెలిచిన 23 మందిలో నలుగురు ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. 19 మంది ఎమ్మెల్యేలు మాత్రమే తెలుగుదేశంలో మిగిలారు. దీంతో పోటీచేసినా టీడీపీ గెలిచే అవకాశం లేదు. అయినా అభ్యర్థిని పోటీకి దింపి ఎమ్మెల్యేలకు విప్ జారీచేయాలని చంద్రబాబు భావిస్తున్నట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. విప్ జారీచేస్తే ఆ పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలందరూ టీడీపీకి ఓటు వేయాల్సి ఉంటుంది. విప్‌ను ధిక్కరిస్తే ఆ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దుచేయాలని కోరవచ్చనే ఉద్దేశంతో అభ్యర్థిని పోటీకి దింపాలని చంద్రబాబు చూస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులకు రెండో ప్రాధాన్యత ఓట్లు వేయాలని టీడీపీ నిర్ణయించిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు.

నామినేషన్ల కోలాహలం

7 ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనమండలిలో ఈ నెలాఖరులకు ఖాళీ అవుతున్న ఎమ్మెల్యేల కోటాలోని ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వెలగపూడిలోని శాసనమండలి తాత్కాలిక భవనంలో మండలి సంయుక్త కార్యదర్శి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.వి.సుబ్బారెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. జయమంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, బొమ్మి ఇజ్రాయేల్, కోలా గురువులు, పోతుల సునీత, పెనుమత్స వరాహవెంకట సూర్యనారాయణరాజు వరుసగా రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించారు. నామినేషన్లు దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల వెంట ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీలు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, నందిగం సురేష్, లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, నంబూరి శంకర్‌రావు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దూలం నాగేశ్వరరావు తదితరులున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ల నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. నామినేషన్లు దాఖలు చేయడానికి ముందు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఆ పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. వారికి వైఎస్సార్‌సీపీ బీ-ఫారాలను సీఎం వైఎస్ జగన్ అందజేశారు. ఎమ్మెల్యేల కోటాలో శాసనమండలి సభ్యులుగా పోటీచేసేందుకు తమకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

చేతల్లో సామాజిక న్యాయం

- రాజకీయ అధికారంలో సింహభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు భాగస్వామ్యం
- ఇది సామాజిక సాధికారతకు దోహదం చేస్తుందని సీఎం విశ్వాసం
- ప్రభుత్వ సలహాదారు సజ్జల



సాక్షి, అమరావతి: రాజకీయ అధికారంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు భాగస్వామ్యం ఇవ్వడం ద్వారా సామాజిక సాధికారత సాధించవచ్చని సీఎం జగన్ నిరూపించారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆ దిశగా 2019 ఎన్నికలలో మొదలైన సామాజిక విప్లవ ఫలితాలను గత 45 నెలలుగా రాష్ట్ర ప్రజలతో సహా దేశమంతా చూస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వం మాటలకే పరిమితమైతే, సామాజిక న్యాయాన్ని సీఎం జగన్ చేతల్లో చేసి చూపిస్తున్నారని చెప్పారు. శాసనమండలిలో ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అవుతున్న ఏడు స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..


- ఎమ్మెల్యేలు, గవర్నర్, స్థానిక సంస్థల కోటాలోని 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వడం ద్వారా సీఎం విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. అందులోనూ 11 స్థానాలు బీసీలకు కేటాయించడం చరిత్రాత్మకం. ఇప్పటికే శాసనమండలిలో నలుగురు మైనార్టీ ఎమ్మెల్సీలుండటం కూడా రికార్డే.
- ఈ ఎన్నికల తర్వాత మండలిలోని 58 స్థానాల్లో 10 స్థానాలు పట్టభద్రులు, టీచర్లను పక్కనపెడితే.. మిగిలిన 48 స్థానాల్లో టీడీపీ బలం నాలుగుకు పడిపోనుంది. వైఎస్సార్‌సీపీ బలం 44కు చేరనుంది. అందులో 30 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సభ్యులే ఉంటారు.
- కేబినెట్‌లో 70 శాతం పదవులు, నగర పాలక సంస్థల మేయర్లు 90 శాతానికి పైగా, జెడ్పీలు 70 శాతం, ఎంపీపీ పదవులు 67 శాతం, మున్సిపల్ చైర్మన్లు 72 శాతం ఏదైనా సరే 50 శాతం పరిధిని కూడా మించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీవర్గాలకు ఇచ్చారు. మహిళలకూ రాజకీయ అధికారంలో సింహభాగం వాటా ఇచ్చారు.
- మండలి చైర్మన్‌గా ఎస్సీ నాయకుడు, డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మైనార్టీ మహిళ, శాసనసభ స్పీకర్‌గా బీసీ నాయకుడు ఉన్నారని సవినయంగా, సగర్వంగా చెబుతున్నాం. 2019 వరకు అధికారం వెలగబెట్టిన టీడీపీ ఇలా ఎందుకు చేయలేకపోయిందన్న ప్రశ్నకు చంద్రబాబు సమాధానం చెప్పాలి.

చేతల నేత సీఎం జగన్

- ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలోనూ సామాజిక న్యాయం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అధిక ప్రాధాన్యం
- మోసం చేసిన చంద్రబాబును అందరూ నిలదీయాలి
- నామినేషన్‌ల అనంతరం మీడియాతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు

సాక్షి, అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో సామాజిక న్యాయం జరుగుతోందని ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గురువారం అసెంబ్లీ కమిటీ హాలులో నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు ఎందుకు ఇన్ని అవకాశాలు ఇవ్వలేదు? సీఎం జగన్ సామాజిక సాధికారతను చేతల్లో చూపుతున్నారు. మూడున్నరేళ్లలో సామాజిక విప్లవం తీసుకొచ్చారు. గతంలో ఈ వర్గాలకు మేలు చేయాలన్న కనీస ఆలోచన కూడా చేయని చంద్రబాబుకు బుద్ధి వచ్చేలా 18 స్థానాల్లో 11 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీ, నలుగురు ఓసీలను ఎంపిక చేసి, ఆయా వర్గాల పట్ల తనకున్న ప్రేమాభిమానాలను చాటుకున్నారు' అని కొనియాడారు. వివరాలు వారి మాటల్లోనే..

సొంత సామాజికవర్గం బాగు కోసమే బాబు కృషి



చంద్రబాబు నమ్మక ద్రోహి. కుల అహంకారి. 1999 నుంచి రాజకీయాల్లో ఉన్న నేను ఆయన నైజాన్ని చూశా. నా దగ్గర ఉన్న డబ్బు చూసి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని చంద్రబాబు చెప్పారు. నాతోనే మిగిలిన నియోజకవర్గాల్లో డబ్బులు ఖర్చు పెట్టించారు. 2014లో నేను గెలిచే సీటు అని తెలిసినా, నన్ను పోటీ చేయకుండా ఆపేశాడు. చంద్రబాబు, వెంకయ్యనాయుడు.. ఇద్దరూ కలిసి నన్ను మోసం చేశారు. డబ్బు వున్న వారికే టీడీపీ టికెట్లు ఇస్తుంది. సొంత సామాజిక వర్గం బాగు కోసమే చంద్రబాబు పని చేశారు. బెంజ్ కారులో తిరిగిన నన్ను డొక్కు కారులో తిరిగేలా చేశారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ అనే దేవుడి రూపంలో నాకు న్యాయం జరిగింది.

– జయమంగళ వెంకటరమణ (బీసీ, ఏలూరు జిల్లా)

నిశ్శబ్ద విప్లవానికి శ్రీకారం



రాజకీయ సాధికారత అంటే పదవుల్లో మాత్రమే కాదు.. అధికారంలో కూడా పాలు పంచుకునేలా భాగస్వాములను చేయడమే అని సీఎం జగన్ నిరూపించారు. బలహీన వర్గాలకు మేలు చేయలన్నా బలమైన ఆలోచన ఉంటేనే ఇది సాధ్యం. సీఎం జగన్ ఒక నిశ్శబ్ద విప్లవానికి శ్రీకారం చుట్టారు.

– పెన్మత్స వీవీ సూర్యనారాయణ రాజు (ఓసీ, విజయనగరం జిల్లా)

చంద్రబాబు కుల అహంకారి



2014–19 మధ్య టీడీపీ శాసన మండలికి 48 మందిని పంపగలిగితే, అందులో ఓసీలు 30 మంది కాగా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 18 మంది మాత్రమే. టీడీపీ వంచనకు ఇంతకన్నా వేరే నిదర్శనం అక్కర్లేదు. సీఎం వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 68.18 శాతం కేటాయించడం ఆయన చిత్తశుద్ధిని నిరూపిస్తోంది. చంద్రబాబు పెద్ద కుల అహంకారి. సీఎం జగన్ నాకు దేవుడిచ్చిన అన్నయ్య.

– పోతుల సునీత (బీసీ, చీరాల, బాపట్ల జిల్లా)

బీసీ అంటే బ్యాక్ బోన్..



బీసీలంటే కేవలం బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్‌బోన్ క్లాస్ అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ గుర్తించి ఆ వర్గాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. డిప్యూటీ సీఎం పదవులు, స్పీకర్‌గా బీసీ, మండలి చైర్మన్‌గా ఎస్సీ, డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మైనార్టీ మహిళకు అవకాశం ఇచ్చారు. పదవులన్నిటిలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యమిచ్చారు. సీఎం జగన్ ఎప్పటికీ నా గుండెల్లో ఉంటారు.

– కోలా గురువులు (బీసీ, విశాఖ సౌత్)

సామాజిక న్యాయానికి అసలైన నిర్వచనం



కులాలను చీల్చే విధంగా కాకుండా స్ఫూర్తిదాయక విధానాలతో సామాజిక న్యాయానికి అసలైన నిర్వచనం చెప్పారు సీఎం జగన్. గతంలో టీడీపీ అన్ని విధాలుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను వంచించింది. చెప్పిందొకటి. చేసింది మరొకటి. ఊపిరి ఉన్నంత వరకు సీఎం జగన్‌తో ఉంటాను.

– బొమ్మి ఇజ్రాయేల్ (ఎస్సీ, (మాదిగ), అంబేడ్కర్ కోనసీమ జిల్లా)

ఎందుకు మోసం చేశావని బాబును నిలదీయాలి



మరో ఏడాదిన్నరలో ఎన్నికలు ఉన్నందున బాబు, ఎల్లో మీడియా.. రోజు వారీ తోలు బొమ్మలను తెచ్చి ప్రదర్శనలు ఇస్తూ.. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చూస్తున్నారు. వారి మొహం మీద చరిచినట్లుగా అన్ని పదవుల్లోనూ, అధికారంలోనూ ఇంతగా అట్టడుగు వర్గాలకు వైఎస్సార్‌సీపీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని గుర్తించాలని బీసీలను కోరుతున్నాం. ఎందుకు మోసం చేశావని చంద్రబాబును నిలదీయాలని కోరుతున్నాం.

– చంద్రగిరి ఏసురత్నం (బీసీ. వెస్ట్ గుంటూరు)

గొప్ప మానవతా మూర్తి



నమ్మకానికి, ఇచ్చినమాట నిలబెట్టుకునేదానికి సీఎం జగన్ ప్రతిరూపం. ఒకసారి మాట ఇస్తే ఎన్ని అడ్డంకులు ఎదురైనా నెరవేర్చే తత్వం. ఇచ్చిన మాట మేరకు నాకు మేలు చేశారు. సీఎం జగన్ ఏమి చెబితే అది చేయటమే నా కర్తవ్యం. రాజకీయాల్లో గొప్ప మానవతా విలువలు వంట పట్టించుకున్న మానవతా మూర్తి సీఎం జగన్. రాజకీయాల్లో సోషల్ ఇంజినీరింగ్ అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమే.

– మర్రి రాజశేఖర్ (ఓసీ, చిలకలూరిపేట)

• తెలంగాణ

ప్రశాంతంగా ఆయనకిద్దరితో పెళ్లి

- ఆరు ముళ్లు.. పధ్నాలుగు అడుగులు!
- ముగ్గురూ కలిసి ఉండేందుకు అంగీకరించడంతో వివాహం చేసిన పెద్దలు
- పెళ్లి రోజుకే ఒకరికి పాప.. మరొకరికి బాబు



ఇద్దరు వధువులతో పెళ్లిపీటలపై సత్తిబాబు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: "మూడే ముళ్లు... ఏడే అడుగులు.. మొత్తం కలిపి నూరేళ్లు..." ఓ సినీ గేయ రచయిత అన్న మాటలను ఈయన సరిగ్గా డబుల్ చేశాడు. ఒకే రోజు ఇద్దరికీ.. ఒక్కొక్కరికి మూడు ముళ్లు.. వెరసి ఆరు ముళ్లు వేసి పధ్నాలుగు అడుగులు నడిచాడు. ఇక కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు.. చందంగా పెళ్లి సమయానికే ఇద్దరు వధువులూ ఒకరు మగ బిడ్డతో.. ఒకరు ఆడ బిడ్డతో పెళ్లి పీటలపై కూర్చొని సదరు పెళ్లి కొడుకుతో తాళి కట్టించుకున్నారు. ఈ చిత్రమైన 'పెళ్లి'ళ్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఎర్రబోరు గ్రామంలో జరిగాయి. పూర్వాపరాలిలా.. గ్రామానికి చెందిన సత్తిబాబు దోశిళ్లపల్లికి చెందిన స్వప్నకుమారితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరూ శారీరకంగా ఒకటి కావడంతో స్వప్నకుమారి గర్భం దాల్చింది. విషయం ఆమె ఇంట్లో తెలియడంతో పెళ్లి చేసుకునేందుకు సత్తిబాబు ఓకే అన్నాడు. కానీ స్వప్నకి తెలియకుండా సత్తిబాబు కుర్నపల్లికి చెందిన సునీతతోనూ మరో ప్రేమ కథ నడిపాడు. ఈమెనూ గర్భవతిని చేశాడు. ఇరువురు యువతుల తల్లిదండ్రులతో పాటు కుల పెద్దలూ రంగంలోకి దిగారు. తాను ఇద్దరినీ ప్రేమించానని, ఇరువురినీ పెళ్లి చేసుకుంటానని సత్తిబాబు చెప్పగా, యువతులూ అంగీకరించడంతో పరస్పర అంగీకారంతో ఒకే చోట కాపురం పెట్టాడు. గతేడాది జూలైలో స్వప్నకుమారి పాపకు జన్మనివ్వగా, సెప్టెంబర్‌లో సునీతకు బాబు పుట్టాడు. కాగా తన పెళ్లి ఘనంగా జరగలేదని భావించిన సత్తిబాబు..ఈనెల 9న గురువారం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఒక వరుడు, ఇద్దరు వధువుల పేర్లతో పెళ్లి పత్రిక అచ్చు వేయించి బంధుమిత్రులందరికీ పంచాడు. సోషల్ మీడియాలో ఈ పెళ్లికార్డు వైరల్‌గా మారడంతో ఇది చర్చనీయాంశమైంది.

ముహూర్తానికి ముందే మూడు ముళ్లు..

పెళ్లి పత్రిక వైరల్‌గా మారడంతో ఏమైనా ఇబ్బందులు రావొచ్చనే ఆందోళనతో ముందుగా నిర్ణయించిన ముహూర్తం కాకుండా బుధవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ముందుగా స్వప్నకుమారి మెడలో తాళికట్టిన సత్తిబాబు.. ఆ తర్వాత సునీత మెడలో మూడు ముళ్లు వేశాడు. సత్తిబాబు మధ్య పీటపై కూర్చోగా కుడి వైపు సునీత, ఎడమ వైపు స్వప్నకుమారి కూర్చున్నారు. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ అయిన సత్తిబాబు పెళ్లి ముచ్చట ఆరు ముళ్లు, పధ్నాలుగు అడుగులతో ముగిసింది.

ఎవరికీ భయపడేది లేదు

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నాడు. ఎవరికీ భయపడేది లేదు. ఎప్పటికీ ప్రజల కోసమే పని చేస్తాను' అని చెప్పారు. ఈ నెల 11న ఈడీ విచారణకు హాజరవుతానని.. ఎప్పుడు, ఎక్కడికి రమ్మని పిలిస్తే అక్కడి వెళతానన్నారు. అయితే విచారణ సమయంలో చట్ట ప్రకారం మహిళలకు ఉండే అధికారాలను విచారణ సంస్థలు గౌరవించాలన్నారు. 'వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ ఎందుకు జరపరు? అవసరమైతే మా ఇంటికి వచ్చి ఎందుకు విచారించరు?' అని ప్రశ్నించారు. దీనిపై అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామని ఆమె స్పష్టం చేశారు. దేశంలో బీజేపీ కొత్త సంప్రదాయాన్ని పాటిస్తోందని.. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ముందుగా ఈడీ వెళ్తోందని.. ఆ తర్వాతే ప్రధాని మోదీ వస్తున్నారన్నారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను చూసి భయపడే ప్రసక్తే లేదన్నారు. అయితే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ఎందుకు భయపడుతున్నారో చెప్పాలన్నారు. కాగా, గురువారం ప్రగతిభవన్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో కవితకు నోటీసుల విషయం గురించి చర్చకు వచ్చినట్లు తెలిసింది. కేంద్రం కక్ష సాధింపు చర్యలను ధైర్యంగా ఎదుర్కొందామని ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గానికి సూచించినట్లు సమాచారం.

విపక్షాలను వేధించడమే లక్ష్యం

దేశంలో విపక్ష నేతలను వేధించడమే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాలన సాగుతోందని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కె.తారక రామారావు ధ్వజమెత్తారు. అవి 'ఈడీ సమన్లు కాదు.. మోదీ సమన్లు' అని పేర్కొన్నారు. అదానీ కంపెనీ మోదీ సొంత కంపెనీ కాబట్టి ప్రపంచ వ్యాప్తంగా దాని కోసం ప్రధాని హోదాలో మార్కెటింగ్ చేస్తున్నారన్నారు. కాగా, అన్నాచెల్లెళ్లు కేటీఆర్, కవిత అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబ సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేసేంత గొప్పోళ్లు ఏమీ కాదన్నారు. వారి తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ డాంటే' అన్న సామెతను తలపిస్తోందన్నారు. సీఎం బిడ్డ, ఒక మహిళ ఢిల్లీ నడిబొడ్డున అక్రమ మద్యం వ్యాపారం చేసినందుకు తెలంగాణ పరువుపోయిందని ధ్వజమెత్తారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
శుక్రవారం ॥ 10-3-2023





ఫ్యాషన్



నాడు..
గిరిజనుల ఎంబ్రాయిడరీ దుస్తులు, ఆభరణాలు
వారిని ఎక్కడ ఉన్నా ప్రత్యేకంగా చూపేవి.
ఏ కొండ కోనల్లో ఉన్నప్పటికీ వారి ఆహార్యం ఇట్టే పట్టించేది.
నేడు...
ఆ కళ నగరవాసులను విపరీతంగా ఆకట్టుకుంటోంది.
దేశ, విదేశీ వేదికల మీదా వెలిగిపోతోంది.
ఇండో-వెస్ట్రన్ డ్రెస్సుల మీదా తన హవా చాటుతోంది.

నగరానికి వచ్చిన కోన సింగారం




ఇండియన్ ట్రైబల్ డిజైన్స్ ఇప్పుడు ప్రతి ఔట్‌ఫిట్‌లోనూ, జ్యువెలరీలోనూ తమ వైభవాన్ని చూపుతున్నాయి. ప్లెయిన్ డ్రెస్సుల మీద ఒక చిన్న ట్రైబల్ హంగు జతగా చేరి వైవిధ్యమైన కళను ప్రదర్శిస్తోంది. నలుగురిలో ప్రత్యేకతను చాటుతోంది. అందుకే, నవతరం ఈ కళ కోసం పోటీపడుతోంది. నగర డిజైనర్లు కోనల్లోకి వెళ్లి మరీ ఈ తరహా కళను అడిగి నేర్చుకుంటున్నారు. లేదంటే, తమకు కావల్సిన డిజైనర్ ఉత్పత్తుల కోసం అడవి బిడ్డల దగ్గర పయనమవుతున్నారు. కళ ఎక్కడ ఉన్నా అది విస్తృతమవుతుందనడానికి ఈ డిజైన్స్ ఓ ఉదాహరణ.

● గెలుపు దారి

చదువుల బంగారం

చదువు కోసం స్వదేశం అఫ్గానిస్తాన్ దాటి మన దేశంలోకి అడుగుపెట్టే ముందు... తల్లిదండ్రులకు దూరం అవుతున్నాననే బాధ కంటే, చదువుకు దగ్గరవుతున్నాననే సంతోషమే రజియా మరాదిలో కనిపించింది. ఆ ఇష్టమే తనను చదువులలో బంగారం చేసింది...

ఆఫ్గానిస్తాన్‌కు చెందిన రజియా మరాదికి చదువు అంటే చాలా ఇష్టం. తనకంటూ ఎన్నో లక్ష్యాలు ఉన్నాయి. తన కలలకు ఒక రూపం వస్తున్న సమయంలో తాలిబాన్ల రాజ్యం వచ్చేసింది!

'అమ్మాయిలకు ఉన్నత చదువు అక్కర్లేదు' అన్నారు.

' ఏం చేస్తాం. నా ప్రాప్తం ఇంతే' అనుకోలేదు రజియా.

చదవు కోసం మన దేశంలోకి అడుగు పెట్టింది. సౌత్ గుజరాత్ వీర్ నర్మద్ యూనివర్శిటీలో చేరింది.

చదువు కోసం మూడు సంవత్సరాల పాటు కుటుంబాన్ని చూసే అవకాశం రాలేదు. అయితే చదువుపై ఇష్టం వల్ల అదేమీ తనకు లోటుగా అనిపించలేదు.

చదువు కోసం రజియా పడిన కష్టం వృథా పోలేదు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో గోల్డ్ మెడల్ సాధించింది!

'ఈ సమయంలో తల్లిదండ్రుల దగ్గర ఉంటే ఎంత సంతోషించేవారో' అంటుంది రజియ.

చదువులోనే కాదు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ గుర్తింపు తెచ్చుకుంది రజియా

'అఫ్గానిస్తాన్‌లోని ఎంతోమంది అమ్మాయిలకు రోల్‌మోడల్‌గా స్ఫూర్తి ఇవ్వనుంది' అంటున్నాడు అసిస్టెంట్ ప్రొఫెసర్ మధు థావనీ.

పీహెచ్‌డీ చేయాలనేది రజియా కల.

'నా పీహెచ్‌డీ పూర్తయ్యేనాటికి మా దేశంలోని పరిస్థితులలో మార్పు వస్తుందని ఆశిస్తున్నాను' అంటుంది రజియా.



రజియ మరాది

బ్యూటిప్స్

● పెరుగులో ముల్తాన మట్టి కలిపి ముఖానికి పట్టించి బాగా ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగితే చర్మంపై మురికిపోయి కాంతివంతంగా కనిపిస్తుంది.

● పెరుగులో పంచదార గాని, ఉప్మారవ్వ గాని కలిపి ముఖానికి పట్టించి మసాజ్ చేస్తే మృతకణాలు తొలగిపోతాయి.

● గోరువెచ్చని నీళ్లలో ఆలివ్ నూనె లేదా కొబ్బరినూనె కొద్దిగా నిమ్మరసం వేసి ఆ నీటిలో పాదాలను పావుగంటసేపు ఉంచాలి. తర్వాత పీచుతో రుద్ది శుభ్రం చేసుకోవాలి. బాగా ఆరిన తర్వాత కలబంద క్రీమ్ రాయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయడం వల్ల మీ పాదాలు కోమలంగా తయారవుతాయి. పగుళ్ల మధ్య, గోళ్ల మధ్య ఉన్న మురికిపోకుండా క్రీములు రాయడం వల్ల ప్రయోజనం ఉండదు.



● సాయంత్రం ఇంటికి రాగానే నేరుగా సబ్బుతో ముఖాన్ని శుభ్రపరచకుండా ముందుగా క్లెన్సింగ్ మిల్క్‌ను తగినంత దూది ఉండకు అద్దుకొని, ముఖాన్ని, మెడను తుడుచుకోవాలి. తర్వాత ఫేస్ వాష్‌తో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల ముఖంపై చేరిన మలినాలు, దుమ్ము త్వరగా తొలగిపోతాయి.

● నాలుగు బాదం పప్పులను రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పాలు వేసి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూసుకొని, ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

● భలే మంచి రోజు

క్వీన్స్ ఎక్స్‌ప్రెస్




**'టికెట్ కలెక్టర్‌గా అమ్మాయి!'
'ట్రైన్ డ్రైవర్ అమ్మాయట!'
'ట్రైన్ గార్డ్‌గా అమ్మాయి!'... ఇలాంటి ఎన్నో ఆశ్చర్యాలను చూసింది కాలం.
వివిధ హోదాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటున్న వారిని చూసి గర్వించింది కాలం.
పరుగెత్తే కాలంలో ప్రత్యేక సందర్భాలు ఉంటాయి.
ఆరోజు అచ్చంగా అలాంటిదే!**

కాస్త సరదాగా చెప్పుకోవాలంటే 'కన్నుల పండగ' అనేది పండగరోజు మాత్రమే రావాల్సిన అవసరం లేదు. ప్రత్యేక దినాలలో కూడా రావచ్చు. మొన్నటి మహిళా దినోత్సవం రోజు అలాంటి కన్నుల పండగ జరిగింది.

సెంట్రల్ రైల్వే ముంబై డివిజన్ అందరూ మహిళలే ఉన్న బృందానికి ముంబై-పుణె దక్కన్ క్వీన్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపించే బాధ్యతను అప్పగించింది.

ఆరోజు ఆ ట్రైన్‌లోకి అడుగు పెడితే...


లోకో-పైలట్ సురేఖ యాదవ్, అసిస్టెంట్ లోకో-పైలట్ లీనా ఫ్రాన్సిస్

డ్రైవర్ సీట్లో దర్జాగా కూర్చున్న లోకో-పైలట్ సురేఖ యాదవ్, టికెట్ కలెక్టర్‌లుగా విధులు నిర్వహిస్తున్న నీతు, రుబినా, బీనా, సురక్ష, జెన్, దీపలతో రైలు కొత్తగా కనిపించింది.

'ఈరోజు నిజంగా మరిచిపోలేని రోజు. రైలును మహిళలే నడిపిస్తున్నారనే భావన గర్వంగా ఉంది. నా వృత్తిజీవితంలో ఇది గుర్తుంచుకోదగిన రోజు' అంటుంది లోకో-పైలట్ సురేఖ యాదవ్.

లోకో-పైలట్‌గా వృత్తిజీవితంలోకి అడుగుపెట్టడానికి ముందు...

'అది కఠినమైన వృత్తి. ఎప్పుడు ఎక్కడ ఉంటామో తెలియదు. మహిళలకు ఎంతమాత్రం సరిపడని వృత్తి' అని వెనక్కిలాగే ప్రయత్నం చేశారు.

వాటిని పట్టించుకొని ఉంటే ఆమె పేరు పక్కన 'లోకో-పైలట్' అనే విశేషణం గర్వంగా కాలర్ ఎగరేసేది కాదు.

'ఇలాంటి రోజులు మళ్లీ మళ్లీ రావాలి' అంటుంది అసిస్టెంట్-లోకో పైలట్ లీనా ఫ్రాన్సిస్.

చిన్నప్పుడెప్పుడో ట్రైన్ ముందు బోగీలో గంభీరంగా కూర్చున్న డ్రైవర్‌ను చూసిన తరువాత తాను కూడా డ్రైవర్ కావాలనుకుంది.

'అలా కుదరదు. వీలు కాదు' అనే మాటల మధ్య కూడా తన ఆశను కోల్పోలేదు.

వృత్తిజీవితంలోకి అడుగు పెట్టిన తరువాత కూడా 'హాయిగా ఫ్యాన్ కింద కూర్చొని చేసే ఉద్యోగం కాకుండా ఈ ఉద్యోగం ఎందుకు ఎంచుకున్నావు తల్లీ. ట్రైన్ యాక్సిడెంట్లు పెరుగుతున్నాయి. జాగ్రత్త' అన్నవాళ్లు కూడా ఉన్నారు.

శుభమా అని ఉద్యోగంలోకి అడుగు పెడుతుంటే ఈ మాటలేమిటని లీనా ఫ్రాన్సిస్ చిన్న బుచ్చుకోలేదు. 'వాళ్లంతేలే!' అని మాత్రమే అనుకుంది.

సురేఖ యాదవ్ నుంచి రుబినా వరకు తమకు ఇష్టమైన వృత్తిలోకి రావడానికి ముందు ఎంతో కష్టపడి ఉంటారు. అందుకే ఈ బండి ప్రయాణికులనే కాదు వారి విజయాలను కూడా మోసుకుంటూ వెళ్లింది!

వంటిల్లు

వడలు కాదు వడియాలు

**ఎండలు ముదిరాయి.
మామిడికాయలింకా ముదరలేదు.
మామిడి టెంక కట్టే లోపు
వడియాలు పెట్టుకుందాం.
వడలను పోలిన వడియాలు
ఈ వారం వంటిల్లులో...
ఇవి వడల్లా కనిపిస్తున్నాయా?
వడలు కాదు... వడియాలే!**



సగ్గుబియ్యం- బొరుగులు



కావలసినవి: బొరుగులు- కప్పు; సగ్గుబియ్యం- కప్పు; ఉప్పు- టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఎండుమిర్చి - 3 (పలుకుగా పొడి చేయాలి).

తయారీ: సగ్గుబియ్యాన్ని కడిగి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే మూడు కప్పుల నీటిని మరిగించి సగ్గుబియ్యాన్ని వేసి చిక్కబడే వరకు ఉడికించి (సగ్గుబియ్యం పూర్తిగా కరిగిపోకూడదు) అందులో మిర్చి పొడి, ఉప్పు వేసి కలపాలి. వెడల్పు పాత్రలో బొరుగులు వేసి అందులో సగ్గుబియ్యం మిశ్రమాన్ని వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న నిమ్మకాయంత తీసుకుని అరచేతిలో వడలా వత్తి స్టీల్ ప్లేట్ మీద ఎండబెట్టాలి. రెండు లేదా మూడు రోజుల పాటు ఎండబెట్టాలి. మరుగుతున్న నూనెలో దోరగా వేయించుకోవాలి.

తెలగపిండి వడియాలు



కావలసినవి: తెలగపిండి - కప్పు; ఎండుమిర్చి - 10; జీలకర్ర- టీ స్పూన్; వెల్లుల్లి రేకలు - 10; ఉప్పు - టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ: తెలగపిండిలో రెండు కప్పుల నీటిని పోసి చపాతీ పిండిలా కలపాలి. ఎండుమిర్చి, వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు మిక్సీలో గ్రైండ్ చేసి ఈ మిశ్రమాన్ని తెలగపిండిలో వేసి సమంగా కలిసేటట్లు కలపాలి. ఈ పిండిని చిన్న నిమ్మకాయంత తీసుకుని వడల్లా చేసి ఎండలో ఆరబెట్టాలి.

దోసకాయ - బొరుగులు



కావలసినవి: బొరుగులు - 2 కప్పులు; దోసకాయ తురుము - కప్పు; జీలకర్ర - టీ స్పూన్; ఇంగువ - చిటికెడు; నువ్వులు - టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు - కప్పు; పసుపు - చిటికెడు; ఉప్పు - టీ స్పూన్ లేదా రుచిని బట్టి; మిరప్పొడి - టీ స్పూన్;

తయారీ: బొరుగులను రాళ్లు, దుమ్ము లేకుండా శుభ్రం చేసి వెడల్పు పాత్రలో వేయాలి. అందులో దోసకాయ తురుముతోపాటు మిగిలిన దినుసులన్నీ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గుప్పెడు తీసుకుని గట్టిగా ముద్ద చేసి అరచేతిలో వేసి వడల్లా వత్తి పాలిథిన్ పేపర్ మీద లేదా తడి నూలు వస్త్రం మీద ఎండబెట్టాలి. రెండు రోజులు ఎండబెట్టి వలిచి మూడవ రోజు తిరగేసి ఎండబెట్టాలి. ఈ వడియాలను నూనెలో నేరుగా వేయించడమే.

టొమాటో- పోహా

కావలసినవి: నువ్వులు - 50 గ్రాములు; టొమాటోలు - పావు కేజీ; అటుకులు - ఒక కప్పు; మిరప్పొడి - టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఉప్పు - టీ స్పూన్ లేదా రుచిని బట్టి; జీలకర్ర - టీ స్పూన్; పచ్చిమిర్చి- 3; ఉల్లిపాయలు - 3 (తరగాలి); కరివేపాకు - నాలుగు రెమ్మలు.

తయారీ: ● నువ్వులను కడిగి వడపోసి ఆరబెట్టాలి. ● టొమాటోలను శుభ్రంగా కడిగి మెత్తగా గ్రైండ్ చేసి వెడల్పుగా ఉన్న పాత్రలో వేయాలి ● పచ్చిమిర్చి, జీలకర్ర, మిరప్పొడి, ఉప్పు కలిపి మెత్తగా రుబ్బి టొమాటో ప్యూరీలో కలపాలి. ఇందులో కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు, అటుకులు వేసి కలిపి పది నిమిషాల సేపు నాననివ్వాలి. చివరగా నువ్వులు వేసి కలిపి ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న గోళీలుగా చేసుకోవాలి. తడి వస్త్రం మీద లేదా పాలిథిన్ పేపర్ మీద ఒక్కో గోళీని వడల్లా వత్తి ఎండబెట్టాలి. రెండు రోజులు ఎండిన తర్వాత మూడవ రోజు ఉదయం క్లాత్ నుంచి ఒలిచి రెండవ వైపు ఎండబెట్టాలి.

గమనిక: ఈ వడియాలను వేయించడం కూడా ప్రత్యేకమే. బాణలిలో నూనె వేడి చేసి వడియాలను ఒక్కొక్కటిగా నీటిలో ముంచి (నానకూడదు) వెంటనే నూనెలో వేయాలి. రెండువైపులా దోరగా కాలిన తర్వాత నూనెలో నుంచి తీసి అదనంగా ఉన్న నూనె వదలడానికి శుభ్రమైన పేపర్ మీద వేయాలి. ఈ వడియాలను భోజనంలో తినవచ్చు. ఈ వడియాలతో కూర చేయవచ్చు. పులుసులో కూడా వేసుకోవచ్చు.

● సక్సెస్ స్టోరీ

ఫిల్మ్ మేకర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు కోల్‌కతాకు చెందిన **శౌనక్ సేన్.** అతడి ఫీచర్-లెంగ్త్ డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్' మన ఫ్యూచర్ గురించి మౌనంగానే ఎన్నో ప్రశ్నలు రేకెత్తిస్తోంది. జీవజాలంపై కాస్త కరుణ చూపమని చెప్పకనే చెబుతోంది...

లోకం మెచ్చిన దర్శకుడు



ఢిల్లీలోని ఏజెకె మాస్ కమ్యూనికేషన్ రిసెర్చ్ సెంటర్ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో పట్టా పుచ్చుకున్న శౌనక్‌సేన్ జెఎన్‌యూ లోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఈస్థెటిక్స్‌లో పీహెచ్‌డీ చేశాడు. ఫిల్మ్స్ డివిజన్ ఆఫ్ ఇండియా డాక్యుమెంటరీ ఫెలోషిప్, డిజిటల్ అండ్ సోషల్ మీడియా ఫెలోషిప్‌కు ఎంపిక కావడం, కేంబ్రిడ్జి యూనివర్శిటీ అర్బన్ ఎకోలజీస్ ప్రాజెక్ట్‌లో విజిటింగ్ స్కాలర్‌గా భాగం కావడం తన ప్రపంచాన్ని విస్తృతం చేసింది.

సేన్‌లోని కళకు సామాజిక స్పృహ తోడైంది.

తొలి డాక్యుమెంటరీ 'సిటీస్ ఆఫ్ స్లీప్'కు పెద్ద పేరే వచ్చింది. ఈ డాక్యుమెంటరీకి ఫిల్మ్స్ డివిజన్ ఆఫ్ ఇండియా ఫండింగ్ చేసింది. ఇది న్యూయార్క్ ఇండియన్ ఫిల్మ్‌ఫెస్టివల్, తైవాన్ ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫెస్టివల్, ముంబై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఇరవై చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రత్యేక ప్రశంసలు పొందింది. ఆరు అవార్డ్‌లు అందుకుంది.



● 'ఆల్ దట్ బ్రీత్స్'లో ఓ దృశ్యం

సేన్ రెండో ఫీచర్ లెంగ్త్ డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్' సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా దూసుకుపోతూనే ఉంది.

వరల్డ్ సినిమా గ్రాండ్ జ్యూరీ ప్రైజ్(సన్‌డ్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్, యూఎస్) గెలుచుకుంది. 'హాస్యం, వ్యంగ్యం మేళవించి పర్యావరణ విధ్వంసాన్ని కళ్లకు కట్టిన చిత్రం' అని జ్యూరీ సభ్యులు ప్రశంసించారు. ఈ డాక్యుమెంటరీ మరో ప్రసిద్ధ అవార్డ్ గోల్డెన్ ఐ (కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్) గెలుచుకుంది.

'ఆల్ దట్ బ్రీత్స్'కు సంబంధించిన ప్రపంచవ్యాప్త హక్కులను అమెరికన్ టెలివిజన్ నెట్‌వర్క్ హెచ్‌బీవో తీసుకుంది.

ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన మరో ఘనత ఆస్కార్ 'బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్'కు నామినేట్ కావడం.

మనుషుల కార్యకలాపాల వల్ల జీవజాలం స్థితిగతుల్లో వస్తున్న మార్పుకు ఈ చిత్రం అద్దం పడుతుంది.

'ఎక్కడ పడితే అక్కడ పక్షులు చచ్చిపోయి కనిపిస్తుంటాయి. అయ్యో! అని మనకు అనిపించదు. మన దారిన మనం వెళుతూనే ఉంటాం. రోజువారి పనుల్లో క్షణం తీరిక లేకుండా గడుపుతూనే ఉంటాం. క్షణం కూడా వాటి గురించి ఆలోచించం. ఇది ఎంత ఆశ్చర్యం, ఎంత విషాదం!' అంటుంది ఈ చిత్రంలో ఒక పాత్ర. జీవజాలానికి సంబంధించి మనుషులలోని స్పందనారాహిత్యాన్ని, మొద్దుబారినతనాన్ని దుమ్ము దులుపుతుంది ఆల్ దట్ బ్రీత్స్. మనుషులలోని స్పందనారాహిత్యం గురించి 'చీమ కుట్టినట్లైనా లేదు' అంటారు.

'ఆల్ దట్ బ్రీత్స్' చీమ నుంచి పిచ్చుక వరకు సమస్త జీవజాలం గురించి ఆలోచించమని చెబుతుంది.

'నేను మాత్రమే..అనే స్వార్థం ఉంటే నువ్వు కూడా మిగలవు' అనే మార్మిక సందేశాన్ని ఇస్తుంది.

'యాంత్రికంగా నేచర్-వైల్డ్‌లైఫ్ డాక్యుమెంటరీ తీయాలని ఎప్పుడూ అనుకోలేదు. ప్రజలు ఎన్ని మంచి పనులు చేస్తున్నారో తెలుసా!లాంటి స్వీట్ ఫిల్మ్ తీయాలనే ఆలోచన కూడా ఎప్పుడూ రాలేదు. మనం వేగంగా పరుగులు తీస్తున్నాం. ఆ పరుగు కొన్ని నిమిషాల పాటు అయినా ఆపి చుట్టు ఏం జరుగుతుందో ఆలోచించాలి. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వ విధానాలకు సంబంధించిన విషయం కాదు. ప్రతి ఒక్కరి బాధ్యత' అంటున్నాడు సేన్.

సేన్ ఇష్టాల గురించి చెప్పాలంటే...

సామాజిక పరిస్థితుల గురించి లోతుగా తెలుసుకోవడం అంటే ఇష్టం. సృజనాత్మకత నిండిన సినిమాలు చూడడం అంటే ఇష్టం. సామాజిక అంశాలకు, సృజనాత్మకత జోడించి తనదైన శైలిలో సరికొత్త చిత్రాన్ని ఆవిష్కరించడం అంటే మహా ఇష్టం.

● అవును...ఇది నిజమే!

అమెరికాలోని గోల్డ్ విన్ కార్పొరేషన్(1924) లోగో కోసం 'స్లాట్' అనే సింహాన్ని ఉపయోగించారు. 1928లో కొత్త లోగో కోసం 'జాకీ' అనే సింహం వచ్చింది. దీని గర్జనను రికార్డ్ చేయడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ జాకీ గోల్డ్‌విన్ నిర్మించిన వందకు పైగా బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో కనిపించి గర్జించింది. 'జాకీ' తరువాత కాఫీ, ట్యానర్, జార్జ్, లియో అనే సింహాలు లోగోలో కనిపించాయి. స్లాట్ నుంచి లియో వరకు సింహాలను కెమెరా ముందు కుదురుగా కూర్చోబెట్టడం కత్తి మీద సాముగా ఉండేది. ఇదొక విషయం అయితే షూటింగ్ సమయంలో సింహం కెమెరామెన్ మీద దాడి చేసిందని, ఇద్దరు ముగ్గురిని చంపేసిందని ఇలాంటి పుకార్లు ఎన్నో వినిపిస్తుండేవి!



రేడియో అంటేనే న్యూస్ కదా! అయితే బీబీసి రేడియో ఒకసారి చిన్న సర్‌ప్రైజ్ ఇచ్చింది. 1930 గుడ్‌ఫ్రైడే రోజు న్యూస్ రీడర్ ఇలా పలికింది...'శ్రోతలకు నమస్కారం. ఈరోజు గుడ్‌ఫ్రైడే. వార్తలు లేవు' కొన్ని సెకండ్ల నిశ్శబ్దం తరువాత పదిహేను నిమిషాల పాటు క్లాసిక్ పియానో మ్యూజిక్ వినిపించారు. అయితే ఇది చాలామంది శ్రోతలకు నచ్చలేదు. 'బీబీసి టైమ్ వృథా చేసింది' అని విమర్శించారు. చెప్పడానికి పెద్దగా వార్తలేవీ లేకపోవడం వల్లే బీబీసి ఈ మ్యూజిక్ స్టంట్ చేసిందనేది అనధికారిక వార్త.

● టెక్.. టాక్

కాస్త కొత్తగా...



ఎప్పుడూ ఉపయోగించే సెర్చ్ ఇంజిన్ కాకుండా కొత్తగా ట్రై చేయాలనుకుంటే వీటిపై ఒక లుక్ వేయండి...

బ్రేవ్: ప్రైవసీ-ఫోకస్‌డ్ సెర్చ్ ఇంజిన్ మరియు వెబ్ బ్రౌజర్ ఇది. యాడ్ బ్లాకింగ్, కుకీ కంట్రోల్...మొదలైన ఆప్షన్స్ ఉన్నాయి. తమ సందేహాలకు యూజర్లు 'టు-ది-పాయింట్ ఆన్సర్స్' ఫీచర్‌తో సవివరమైన సమాధానాలు తెలుసుకోవచ్చు. దీనిలో త్వరలో ఏఐపవర్డ్ ఫీచర్స్‌ను తీసుకురానున్నారు.

నీవా ఏఐ: ప్రైవసీ-ఫోకస్డ్ యాడ్ ఫ్రీ సెర్చ్ ఇంజిన్ ఇది. 'గెట్ ఆన్సర్స్. నాట్ యాడ్స్' అనేది కంపెనీ నినాదం. ఆన్‌లైన్ షాపింగ్ నుంచి వోల్డ్ ఇమెయిల్స్ సెర్చింగ్ వరకు రకరకాలుగా ఉపయోగపడుతుంది. గత నెల ఏఐ వరల్డ్ ఫీచర్స్‌ను తీసుకువచ్చింది. దీనిలో రెండు సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌లు ఉన్నాయి. ఒకటి...ఫ్రీ(లిమిటెడ్ సెర్చెస్, లిమిటెడ్ ఫీచర్స్), రెండు...ప్రీమియం(అన్ లిమిటెడ్ సెర్చెస్, అన్ లిమిటెడ్ ఫీచర్స్).

పర్‌ప్లెక్సిటీ ఏఐ: యూజర్‌లు అడిగే ప్రశ్నలకు సంబంధించిన సమాచారం కోసం 'లింక్స్' జాబితాను అందిస్తుంది. దీంతో మల్టీపుల్ పేజీలను క్లిక్ చేయాల్సిన అవసరం ఉండదు. సంబంధం లేని సమాచారంతో టైమ్ వృథా కాదు. అవసరమైన సమాచారంతో పాటు ఆసక్తికరమై సమాచారాన్ని అందిస్తుంది. 'పర్‌ప్లెక్సిటీ ఆస్క్' స్టాండ్‌బొట్ ఫీచర్‌గా పేరు తెచ్చుకుంది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్

సమస్యల్లో ఉన్నప్పుడు, ప్రమాదకరమైన పరిస్థితుల్లో పడినప్పుడు, ఇబ్బందికరంగా, నిస్సహాయంగా అనిపించినప్పుడు ఉపయోగించే ఇడియమ్ ఇది.

ఉదా: వెన్ ది చిప్స్ ఆర్ డౌన్ యూ నో హూ యువర్ రియల్ ఫ్రెండ్స్ ఆర్



ఇక దీని మూలల్లోకి వెళితే...గ్యాంబ్లింగ్ ఆటల్లో నుంచి పుట్టిన ఇడియమ్ ఇది. గ్యాంబ్లింగ్ ఆటలో డబ్బుకు బదులుగా చిప్స్ వాడేవారు. బెట్ సందర్భంలో ఈ చిప్స్‌ను టేబుల్‌పై పెట్టాలి. ఇక అదే ఫైనల్. వెనక్కి తీసుకోవడానికి లేదు. గెలుపు, ఓటములలో ఏది సొంతం చేసుకోలేని పరిస్థితి ఉంటుంది. గెలుపు, ఓటములపైనే చిప్స్ వెనక్కి వస్తాయా? చేజారిపోతాయా అనేది ఆధారపడి ఉంటుంది.

● గ్యాడ్జెట్ బజార్

హానర్ మ్యాజిక్ 5 ప్రో



సైజ్: 6.81 అంగుళాలు
రిజల్యూషన్: 1312x2848 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జెడ్
బ్యాటరీ: 5100 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
ర్యామ్: 12జీబి
బరువు: 219 గ్రా.
ఇంటర్నల్ స్టోరేజ్: 512 జీబి
కలర్స్: గ్రీన్, బ్లాక్

ఫ్లేపల్స్ వన్

ఫ్లేపల్స్ అనేది గేమింగ్‌బైక్. వర్కవుట్ చేస్తూనే సినిమాలు, వోటీటీ కంటెంట్ చూడవచ్చు.



స్క్రీన్: 24" ఫుల్ హెచ్‌డీ
10 పాయింట్ మల్టీ టచ్
సౌండ్: ఇన్‌టీగ్రేటెడ్ స్పీకర్
బ్లూ టూత్ కనెక్టివిటీ
3.5 ఎంఎం హెడ్‌ఫోన్ జాక్
హార్డ్‌వేర్: ఇన్‌టెల్ 15-9400ఎఫ్ సీపియు
8జీబి ర్యామ్
గ్రాఫిక్స్ కార్డ్: 2 జీబి వి ర్యామ్

● గేమింగ్

అదిగో వస్తున్నారు.. ఎటాక్

యాక్షన్ అండ్ అడ్వెంచర్ గేమ్ 'స్కల్ అండ్ బోన్స్' నిన్న విడుదలైంది. ఓపెన్ వరల్డ్ ఎన్విరాన్‌మెంట్‌లో థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడే ఆట ఇది. సముద్రంలో జరిగే యుద్ధంలో విండ్ పొజిషన్ అనేది అడ్వాంటేజీ అవుతుంది. గేమ్‌లో ప్లేయర్స్ అడిషినల్ షిప్స్‌ను కలెక్ట్ చేసుకోవచ్చు. మోర్టర్‌ల నుంచి రాకెట్ లాంచర్‌ల వరకు రకరకాల ఆయుధాలు ఉపయోగించవచ్చు. ఈ గేమ్‌కు సంబంధించిన వాటర్ టెక్నాలజీపై పనిచేసిన లీడ్ టెక్నికల్ డైరెక్టర్ క్రిష్ 'ఆటలో కాదు సముద్రంలోనే ఉన్నాం అనుకునేలా గేమ్‌ను తీర్చిదిద్దాం. ఫన్ ఎలిమెంట్స్ కూడా జోడించాం' అంటున్నాడు.

పదిహేడవ శతాబ్దానికి చెందిన షిప్‌లను దృష్టిలో పెట్టుకొని ఈ గేమ్‌కు సంబంధించి రకరకాల షిప్‌లను డిజైన్ చేశారు. గేమ్ ఫ్రేమ్ రేట్ అండ్ రిజల్యూషన్:60 ఎఫ్‌పీఎస్.



ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: టాక్టికల్ యాక్షన్ గేమ్ మోడ్స్: సింగిల్ ప్లేయర్/మల్టీ ప్లేయర్

సినిమా



● నాగార్జున ● ఎన్టీఆర్ ● రామ్ చరణ్ ● అల్లు అర్జున్

స్టార్స్ ఎప్పటికప్పుడు తమ ఫ్యాన్స్‌ను అలరించాలనే అనుకుంటారు. ఏడాదికో సినిమా.. వీలైతే రెండు సినిమాల్లోనైనా కనిపించాలనుకుంటారు. అయితే కొన్నిసార్లు ప్లాన్ తారుమారు అవుతుంది. ఓ ఏడాది వరకు వారు థియేటర్స్‌లో కనిపించకపోవచ్చు. ఇలా కొంతమంది స్టార్స్ 'సీన్ కట్ చేస్తే.. వచ్చే ఏడాదే!' అంటున్నారు. ఈ ఏడాది సిల్వర్ స్క్రీన్‌పై కనిపించని ఆ స్టార్స్ ప్రస్తుతం చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

సీన్ కట్ చేస్తే వచ్చే ఏడాదే!

పండగకి ప్రకటన

గత ఏడాది సంక్రాంతికి 'బంగార్రాజు' (ఈ చిత్రంలో మరో హీరోగా నాగచైతన్య నటించారు)గా, దసరాకు 'ది ఘోస్ట్'గా థియేటర్స్‌కి వచ్చారు నాగార్జున. ఆ తర్వాత ఆయన హీరోగా నటించనున్న సినిమా గురించి ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు. దర్శకుడు మోహన్ రాజా, రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ నాగార్జునకు కథలు వినిపించారు. ముందుగా బెజవాడ ప్రసన్నకుమార్ కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట నాగార్జున. ఉగాదికి ఈ చిత్రాన్ని ప్రకటించి, టైటిల్, ఫస్ట్ లుక్‌ను కూడా రిలీజ్ చేయాలనే ఆలోచనలో నాగార్జున అండ్ టీమ్ ఉన్నట్లుగా తెలుస్తోంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రివెంజ్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాలో 'అల్లరి' నరేశ్ కీ రోల్ చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారట. ఇదే నిజమైతే నాగార్జున ఈ ఏడాది తెరపై కనిపించకపోవడం అక్కినేని ఫ్యాన్స్‌ను నిరుత్సాహపరిచే విషయం. అయితే అక్కినేని వారసులు నాగచైతన్య చేస్తున్న 'కస్టడీ', అఖిల్ 'ఏజెంట్' ఈ ఏడాదే విడుదలవుతాయి. సో... ఆ విధంగా బ్యాలెన్స్ అయిపోతుంది.

వచ్చే వేసవిలోనే..

'జనతా గ్యారేజ్' (2016) చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రారంభం కావాల్సిన ఈ సినిమా షూటింగ్ పలు కారణాల వల్ల ఆలస్యం అవుతూ వస్తోంది. ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ చేయనున్నట్లు ఎన్టీఆర్, కొరటాల అండ్ కో ఆల్రెడీ ప్రకటించారు. ప్రస్తుతం 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు..' పాట ఆస్కార్ ప్రమోషన్స్ కోసం అమెరికాలో ఉన్నారు ఎన్టీఆర్. ఆస్కార్ వేడుక (ఈ నెల 12) పూర్తి కాగానే ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు. హైదరాబాద్ శివార్లలో ఆల్రెడీ ఈ సినిమా కోసం ఓ పోర్ట్ సెట్ వేస్తున్నారు. కళ్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మించనున్న ఈ సినిమాతో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్నారు.

సంక్రాంతి బరిలో...

వచ్చే సంక్రాంతికి థియేటర్స్‌లోకి రానున్నారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాను ముందు ఈ ఏడాదిలోనే రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ అటు 'ఇండియన్ 2'కి, ఇటు చరణ్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు శంకర్. మరోవైపు రామ్‌చరణ్ కూడా 'నాటు నాటు..' పాట ఆస్కార్ ప్రమోషన్స్‌తో బిజీగా ఉంటున్నారు. ఈ కారణాల వల్ల రామ్‌చరణ్-శంకర్‌ల సినిమా రిలీజ్ వచ్చే ఏడాదికి వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేసే ప్లాన్ ఉన్నట్లు నిర్మాత 'దిల్' రాజు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సో... రామ్‌చరణ్ ఈ ఏడాది థియేటర్స్‌లో కనిపించకపోవడం ఆల్మోస్ట్ కన్ఫార్మ్ అయినట్లే. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఆలస్యంగా పుష్పరాజ్

ఈ ఏడాదే రావాల్సిన పుష్పరాజ్ ('పుష్ప'లో అల్లు అర్జున్ పాత్ర పేరు) వచ్చే ఏడాది థియేటర్స్‌కు వస్తాడు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరు 17న విడుదలై సూపర్ డూపర్ హిట్ అయింది. దీంతో మలి భాగం 'పుష్ప: ది రూల్'పై మరింత ఫోకస్ పెట్టింది టీమ్. ఈ సినిమాను ముందు ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ స్క్రిప్ట్ అండ్ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను లాక్ చేయడానికి కాస్త టైమ్ పట్టింది. ఇలా పుష్పరాజ్ ఈ ఏడాది థియేటర్స్‌లో కనిపించడు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా, ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీ రోల్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

మరికొందరు స్టార్స్ కూడా ఈ ఏడాది సిల్వర్ స్క్రీన్‌పై మిస్సయ్యే చాన్స్ ఉంది.

యాక్షన్ ఆరంభం



● 'ఇండియన్-2' సెట్‌లో కమల్‌హాసన్

ఫారిన్ స్టంట్ మాస్టర్స్ డిజైన్ చేసిన యాక్షన్ సీన్స్‌లో పాల్గొంటున్నారు ఇండియన్. 1996లో కమల్‌హాసన్ హీరోగా శంకర్ డైరెక్షన్‌లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') అద్భుత విజయం సాధించిన విషయం తెలిసిందే. పాతికేళ్ల తర్వాత కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్'కు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. ఇటీవల ఆరంభమైన నెలరోజుల షెడ్యూల్‌లో భాగంగా మొన్నటివరకు నైట్ సీన్స్ తీసిన చిత్ర యూనిట్ ఇప్పుడు యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేసింది. 'ఇండియన్ 2' సినిమాకు ఓ హైలైట్‌గా ఉండనున్న ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను ఫారిన్ స్టంట్ కొరియోగ్రాఫర్స్ డిజైన్ చేస్తున్నారు.

తెలుసా తెలుసా...



మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీ ప్రసన్న కలిసి నటించిన తొలి చిత్రం 'అగ్నినక్షత్రం'. వంశీకృష్ణ మళ్ల దర్శకత్వంలో లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. అచ్చు రాజమణి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'తెలుసా తెలుసా...' అంటూ సాగే పాటను హీరోయిన్ సమంత సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ పాటలో లక్ష్మీ ప్రసన్నతో పాటు ఆమె కుమార్తె విద్యా నిర్వాణ కూడా నటించింది. ''తెలుసా తెలుసా...' పాటకు మంచి స్పందన వస్తోంది. త్వరలో ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ తెలిపింది. సిద్ధిక్, విశ్వంత్, చైత్ర శుక్ల తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: గోకుల్ భారతి.

ప్రేమకథ షురూ



● వీవీ వినాయక్, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా కొత్త సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా విశ్వ కరుణ్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. శివం సెల్యులాయిడ్స్‌పై రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాతలు డి. సురేష్‌బాబు, ఏఎమ్ రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ కొట్టారు. ''సరికొత్త ప్రేమకథా చిత్రమిది. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఉంటుంది'' అన్నారు రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి. ఈ చిత్రానికి సహనిర్మాతలు: బి. సురేష్ రెడ్డి, సంతోష్, సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: విశ్వాస్ డానియేల్.

ఉగాదికి ధమ్కీ



● విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తొలి పాన్ ఇండియా చిత్రం 'దాస్ కా ధమ్కీ' రిలీజ్‌కి రెడీ అయ్యింది. ఉగాది సందర్భంగా ఈ నెల 22న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. విశ్వక్ హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహించారు. వన్మయే క్రియేషన్స్, విశ్వక్సేన్ సినిమాస్‌పై కరాటే రాజు (విశ్వక్ సేన్ తండ్రి) నిర్మించిన ఈ చిత్రంలో నివేదా పేతురాజ్ హీరోయిన్‌గా నటించారు. రిలీజ్ డేట్ ప్రకటించి, విడుదల చేసిన పోస్టర్‌లో క్లాస్‌తో పాటు మాస్ లుక్‌లో కనిపించారు విశ్వక్ సేన్. ''దాస్ కా ధమ్కీ'ని తెలుగుతో పాటు తమిళ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నాం. ఇప్పటివరకు విడుదల చేసిన మూడు పాటలు చార్ట్ బస్టర్స్ అయ్యాయి. థియేట్రికల్ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ కె. బాబు, సంగీతం: లియోన్ జేమ్స్.

నటుడు-దర్శకుడు సతీష్ కౌశిక్ కన్నుమూత



బాలీవుడ్ ప్రముఖ సీనియర్ నటుడు, దర్శకుడు సతీష్ కౌశిక్ (66) గుండె పోటుతో కన్నుమూశారు. హోలీ వేడుకల కోసం ఢిల్లీలోని తన స్నేహితుడు, రచయిత జావేద్ అక్తర్ ఇంటికి వెళ్లిన ఆయన గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంట్లో కాస్త నలతగా ఉండటంతో ఆస్పత్రికి వెళుతుండగా మార్గమధ్యంలోనే గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు తెలిసింది. జావేద్ అక్తర్ కుటుంబంతో కలిసి సంతోషంగా జరుపుకున్న హోలీ ఫొటోలను కూడా ట్విట్టర్‌లో షేర్ చేశారాయన. ఇంతలోనే ఈ విషాదం చోటు చేసుకుంది. 'ఉత్సవ్', 'సాగర్', 'మిస్టర్ ఇండియా', 'రాజాజీ', 'భాఘి 3' వంటి దాదాపు 100కి పైగా హిందీ సినిమాల్లో కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సతీష్ కౌశిక్ నటించారు. అనిల్ కపూర్, శ్రీదేవిలతో 'రూప్ కీ రాణి చోరోంకా రాజా' సినిమాకి తొలిసారి సతీష్ కౌశిక్ దర్శకత్వం వహించారు. ఆ తర్వాత 'తేరే నామ్', 'షాదీ సే పెహ్లే', 'ప్రేమ్' వంటి దాదాపు 20 సినిమాలకు దర్శకత్వం వహించారాయన. సతీష్ దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'కాగజ్' (2021). నటుడిగా ఆయన ఆఖరి సినిమా 'ఎమర్జెన్సీ'. కంగనా రనౌత్ లీడ్ రోల్ చేసిన ఈ మూవీలో ఓ కీలక పాత్ర చేశారు కౌశిక్. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. సతీష్ కౌశిక్ హఠాన్మరణంతో పలువురు రాజకీయ, హిందీ చిత్రరంగ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు.

చిత్రం చూడర...



● 'చిత్రం చూడర...' ఫస్ట్ లుక్

వరుణ్ సందేశ్ హీరోగా, ధన్‌రాజ్, కాశీ విశ్వనాథ్ ప్రధాన పాత్రల్లో ఆర్ఎన్ హర్షవర్ధన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'చిత్రం చూడర...'. బీఎం సినిమాస్ బ్యానర్ పై శేషు మారంరెడ్డి, బోయపాటి భాగ్యలక్ష్మి నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గురువారం రిలీజ్ చేశారు. 'అల్లరి' రవిబాబు, తనికెళ్ల భరణి, రాజా రవీంద్ర, శివాజీ రాజా, శీతల్ భట్, మీనా కుమారి, అన్నపూర్ణమ్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు రధన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో 'నేనింతే' ఫేం అదితీ గౌతమ్ స్పెషల్ సాంగ్ చేస్తారని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహనిర్మాత: ధన తుమ్మల.

కొత్త పాత్రలో...



● లైలా

'వైశాలి' వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఆది పినిశెట్టి-దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'శబ్దం'. 7ఎ ఫిల్మ్స్, ఆల్ఫా ఫ్రేమ్స్‌పై 7ఎ శివ నిర్మిస్తున్నారు. లక్ష్మీ మీనన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నటి లైలా కీలక పాత్ర పోషిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేసి, ఆమె లుక్ రిలీజ్ చేశారు. ''తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న చిత్రం 'శబ్దం'. మునుపెన్నడూ చూడని కొత్త పాత్రలో లైలా కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: భాను ప్రియ శివ, సంగీతం: తమన్, కెమెరా: అరుణ్ పద్మనాభన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్. బాలకుమార్, రచన-దర్శకత్వం-లైన్ ప్రొడ్యూసర్: అరివళగన్.

సాక్షి **బిజినెస్**
శుక్రవారం
10-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	542	59,806
నిఫ్టీ ▽	165	17,590

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,566	▽	10
డోజోన్స్	32,759	▽	30
ఎఫ్‌టీఎస్ఈ 100	7,880	▽	50
డాక్స్	15,633	△	1
షాంఘై	3,276	▽	7
నికాయ్	28,623	▽	179

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారట్)		
55,286	△	41
బంగారం (22 క్యారట్)		
55,065	△	41
వెండి (కిలో)		
61,793	▽	90

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.17	82.84
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	95.53	98.77
€	యూరో	ఒకటి	84.97	88.04
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	58.92	60.84
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.96	55.27
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.61	61.56
SAR	సౌదీ రియాల్	పదింటికి	20.87	22.54
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.42	23.22
¥	చైనా యువాన్	పదింటికి	10.65	12.73

కాంపా కోలా మళ్లీ వచ్చేసింది..



- కొత్త అవతారంలో సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్
- ఆవిష్కరించిన రిలయన్స్
- ముందుగా ఏపీ, తెలంగాణ మార్కెట్లలో లభ్యం

న్యూఢిల్లీ: 1970లు, 80లలో ఓ వెలుగు వెలిగి కనుమరుగైన సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్ కాంపా కోలాను దేశీ దిగ్గజం రిలయన్స్ తిరిగి ప్రవేశపెట్టింది. అదానీ, ఐటీసీ, యూనిలీవర్ తదితర దిగ్గజాలకు దీటుగా పోటీనిచ్చే క్రమంలో రిలయన్స్ రిటైల్‌లో భాగమైన రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ (ఆర్‌సీపీఎల్) దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ముందుగా తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో కాంపా కోలా శీతల పానీయాలు లభ్యమవుతాయని ఆర్‌సీపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ తర్వాత దశలవారీగా ఇతర రాష్ట్రాలకు విస్తరించనున్నట్లు వివరించింది. 'ది గ్రేట్ ఇండియన్ టేస్ట్'ను తిరిగి పరిచయం చేస్తున్నామంటూ అప్పటి కాంపా ట్యాగ్‌లైన్‌ను ఉటంకిస్తూ పేర్కొంది. తొలుత కాంపా కోలా, కాంపా లెమన్, కాంపా ఆరెంజ్ అని మూడు పానీయాలు ఉంటాయని వివరించింది. ఇవి అయిదు సైజుల ప్యాక్‌లలో (200 ఎంఎల్, 500 ఎంఎల్, 600 ఎంఎల్, 1,000 ఎంఎల్, 2,000 ఎంఎల్ హోమ్ ప్యాక్స్) లభ్యమవుతాయి. నాణ్యమైన ఈ ఉత్పత్తులను అందుబాటు ధరల్లో అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. కాంపా కోలా బ్రాండ్‌కు దాదాపు యాభై ఏళ్ల చరిత్ర ఉంది. 1949 నుంచి 1970ల వరకూ భారత్‌లో కోకా కోలా శీతల పానీయాలకు ప్యూర్ డ్రింక్స్ గ్రూప్ అనే సంస్థ పంపిణీదారుగా ఉండేది. 1970లలో అది కాంపా కోలా పేరిట తమ సొంత బ్రాండ్‌ను ప్రవేశపెట్టి.. ఆ సెగ్మెంట్‌లో లీడరుగా ఎదిగింది. కానీ, 1990లలో దేశీయంగా తిరిగి కోకా కోలా, పెప్సీకో లాంటి దిగ్గజాల రీఎంట్రీతో కాంపా కనుమరుగైపోయింది. కొన్నాళ్ల క్రితం ప్యూర్ డ్రింక్స్ గ్రూప్ నుంచి కాంపా బ్రాండ్‌ను ఆర్‌సీపీఎల్ రూ. 22 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ ఏడాది జనవరిలోనే సోస్యో హజూరీ బెవరేజెస్ అనే సంస్థలో 50 శాతం వాటా దక్కించుకుంది. తాజాగా కాంపా బ్రాండ్‌ను ఆవిష్కరించింది.

జియో చేతికి యూఎస్ కంపెనీ







- డీల్ విలువ రూ. 492 కోట్లు
- 5జీ, బ్రాడ్‌బ్యాండ్ సేవలకు మద్దతు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ తాజాగా యూఎస్ కంపెనీ మిమోసా నెట్‌వర్క్స్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు 6 కోట్ల డాలర్ల(రూ. 492 కోట్లు) విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కమ్యూనికేషన్ సంబంధ పరికరాలు తయారు చేసే మిమోసా కొనుగోలుతో 5జీ టెలికం, బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులను మరింత విస్తరించేందుకు వీలు చిక్కనుంది. అనుబంధ సంస్థ రాడిసిస్ కార్పొరేషన్ ద్వారా తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు జియో ప్లాట్‌ఫామ్స్ పేర్కొంది. రుణరహిత, క్యాష్ ఫ్రీ ప్రాతిపదికన మిమోసాను సొంతం చేసుకునేందుకు ఎయిర్‌స్పాన్ నెట్‌వర్క్స్ హోల్డింగ్స్‌తో 6 కోట్ల డాలర్లకు ఒప్పందం కుదిరినట్లు వెల్లడించింది. మిమోసా వైఫై-5 ఆధారిత పాయింట్ టు మల్టీపాయింట్ ప్రొడక్టులతోపాటు.. ఆధునిక వైఫై 6ఈ టెక్నాలజీలు, సంబంధిత పరికరాల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. 2018లో మిమోసాను ఎయిర్‌స్పాన్ కొనుగోలు చేసింది. కాగా.. చైనీస్ టెక్నాలజీ నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు దూరం జరుగుతున్న నేపథ్యంలో మిమోసా కొనుగోలు జియో ప్లాట్‌ఫామ్స్‌కు కీలకంగా నిలవనుంది. మిమోసాకు జియో ప్రధాన కస్టమర్‌కావడం గమనార్హం!

లెన్స్‌కార్ట్‌పై అబుధాబి సంస్థ కన్ను

దేశీ ఐవేర్ స్టార్టప్ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్‌పై అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ కన్నేసినట్లు తెలుస్తోంది. లెన్స్‌కార్ట్ కొనుగోలుకి అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ సుమారు 50 కోట్ల డాలర్ల(రూ. 4,100 కోట్లు) విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకునే వీలున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఐవేర్ కంపెనీని సొంతం చేసుకునేందుకు మధ్యప్రాచ్యానికి చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ నిర్వహిస్తున్న చర్చలు తుది దశలో ఉన్నట్లు అంచనా. దీనిలో భాగంగా కంపెనీ ప్రస్తుత షేర్లతోపాటు తాజాగా జారీ చేసే ఈక్విటీని సైతం పొందేందుకు వీలుగా ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో లెన్స్‌కార్ట్ విలువ 4 బిలియన్ డాలర్లకు(రూ. 32,800 కోట్లు)పైగా చేరనున్నట్లు అంచనా.

లాభాలకు బ్రేక్



సెన్సెక్స్ 542 డౌన్ • 60,000 స్థాయి దిగువన ముగింపు • నిఫ్టీ 165 పాయింట్ల క్షీణత

ముంబై: మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. ట్రేడింగ్ గడిచేకొద్దీ అమ్మకాలు ఊపందుకోవడంతో దేశీ స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్ 542 పాయింట్లు క్షీణించి 59,806 వద్ద ముగిసింది. వెరసి 60,000 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. ఇక నిఫ్టీ 165 పాయింట్లు క్షీణించి 17,590 వద్ద నిలిచింది. ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్లు అంచనాలను మించి పెరిగే వీలున్నట్లు సంకేతాలివ్వడంతో సెంటిమెంటు బలహీనపడింది. మరోవైపు 10ఏళ్ల యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ 0.34 శాతం పుంజుకుని 3.99కు చేరడంతో యూరప్, ఆసియా మార్కెట్లు నీరసించాయి. జపనీస్ జీడీపీ, చైనీస్ ద్రవ్యోల్బణం నిరాశపరచడంతో మిడ్‌సెషన్ నుంచీ అమ్మకాలు మరింత పెరిగినట్లు మార్కెట్ విశ్లేషకులు తెలియజేశారు.

నిలదొక్కుకున్న మెటల్స్

ఎన్ఎస్ఈలో దాదాపు అన్ని రంగాలూ వెనకడుగు వేశాయి. మెటల్స్ నష్టపోకుండా నిలదొక్కుకోగా.. ఆటో, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఐటీ, బ్యాంకింగ్ తదితరాలు 2-1 శాతం స్థాయిలో డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎంఅండ్ఎం, ఎస్‌బీఐ లైఫ్, ఆర్ఐఎల్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్ ద్వయం, ఐసీఐసీఐ, ఐషర్, టెక్ మహీంద్రా, టీసీఎస్, మారుతీ, టాటా మోటార్స్, హీరో మోటో, ఐటీసీ 5-1.5% మధ్య పతనమయ్యాయి. అయితే టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, అపోలో హాస్పిటల్స్, ఎయిర్‌టెల్, సిప్లా, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ 1.6-0.5 శాతం మధ్య బలపడ్డాయి. బీఎస్ఈలో మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.55 శాతం నీరసించింది. ట్రేడైన షేర్లలో 1,987 నష్టపోగా.. 1,502 లాభపడ్డాయి. కాగా, అదానీ గ్రూప్‌లోని నిఫ్టీ స్టాక్స్‌లో అమ్మకాలు నమోదైనప్పటికీ ఇతర 4 లిస్టెడ్ కౌంటర్లకు భారీ డిమాండ్ నెలకొంది. అవి 5% చొప్పున లాభపడ్డాయి.

మెర్సిడెస్ కార్లు మరింత ప్రియం

కంపెనీ ఎండీ సంతోష్ అయ్యర్



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న మెర్సిడెస్ బెంజ్ వివిధ మోడళ్ల ధరలను 5 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. దీంతో ఎక్స్‌షోరూంలో కార్ల ధర మోడల్‌నుబట్టి రూ.2-12 లక్షలు అధికం కానుంది. కొత్త ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ గురువారం వెల్లడించింది. పెరిగిన తయారీ వ్యయం, అధికమైన రవాణా ఖర్చుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. ప్రధానంగా యూరోతో రూపాయి మారకం విలువ క్షీణించడం వల్లే ధరలు పెంచాల్సి వస్తోందని స్పష్టం చేశారు. ధరల సవరణ గడిచిన మూడు నెలల్లో ఇది రెండవసారి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-3-2023	
విశాఖ	430-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	423-00
విజయవాడ	423-00
రిటైల్ ధర (డజను)	66.00
9-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	410-00
రిటైల్ ధర	4.70

హోమ్ ఫస్ట్‌లో వాటా విక్రయం

- 7.75 శాతం విలువ రూ. 467 కోట్లు
- గోకల్‌దాస్‌లో 9.9% వాటా అమ్మకం

ఎస్‌బీఎఫ్‌సీ హోమ్ ఫస్ట్ ఫైనాన్స్‌లో 7.75 శాతం వాటాను ఇన్వెస్టర్ సంస్థ బెస్సెమర్ ఇండియా క్యాపిటల్ హోల్డింగ్స్-2 విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 686 సగటు ధరలో 68.11 లక్షలకుపైగా షేర్లను విక్రయించింది. వీటి విలువ రూ. 467 కోట్లుకాగా.. ఫిడిలిటీ ఫండ్స్- ఏషియన్ స్మాలర్ కంపెనీస్ పూల్, నోమురా ట్రస్ట్ అండ్ బ్యాంకింగ్ కో లిమిటెడ్ మొత్తం 11.93 లక్షల హోమ్ ఫస్ట్ షేర్లను కొనుగోలు చేశాయి. యూఎస్ వెంచర్ క్యాపిటల్ సంస్థ బెస్సెమర్ వెంచర్ పార్ట్‌నర్స్‌కు చెందిన కంపెనీయే బెస్సెమర్ ఇండియా. 2022 డిసెంబర్‌కల్లా హోమ్ ఫస్ట్‌లో బెస్సెమర్ ఇండియా 7.75 శాతం వాటాను కలిగి ఉంది.



గోకల్‌దాస్‌లో అమ్మకాలు ఇలా...

ఇక టెక్స్‌టైల్స్ రంగ కంపెనీ గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్‌లో ప్రమోటర్ గ్రూప్ సంస్థ క్లియర్ వెల్త్ కన్సల్టెన్సీ సర్వీసెస్ 9.9 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి దాదాపు రూ. 392 సగటు ధరలో 60 లక్షల షేర్లను అమ్మివేసింది. వీటి విలువ దాదాపు రూ. 235 కోట్లు. తాజా లావాదేవీ తదుపరి గోకల్‌దాస్‌లో ప్రమోటర్ సంస్థ క్లియర్ వెల్త్ వాటా 10.66 శాతానికి పరిమితమైంది.

వాటాలు విక్రయించిన కిర్లోస్కర్ ఆయిల్ ప్రమోటర్లు



కిర్లోస్కర్ ఆయిల్ ఇంజిన్స్ ప్రమోటర్ సంస్థలు 17.71 శాతం వాటాలను (2,56,22,987 షేర్లు) మార్కెట్లో విక్రయించారు. వీటి విలువ రూ.825 కోట్లు. జ్యోత్స్న గౌతమ్ కులకర్ణి, అంబర్ గౌతమ్ కులకర్ణి, నిహాల్‌గౌతమ్ కులకర్ణి వాటాలు విక్రయించిన వారిలో ఉన్నారు. నోమురా ట్రస్ట్ అండ్ బ్యాంకింగ్ కంపెనీ, సొసైటె జనరల్, సీగోన్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్, బీఎన్‌పీ పారిబాస్ ఆర్బిట్రేజ్, మ్యాక్స్ లైఫ్ కంపెనీ, డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలు చేశాయి. సగటున ఒక్కో షేరు రూ.322 వద్ద లావాదేవీ జరిగింది.

సాక్షి **స్పోర్ట్స్**

తొలి పోరు 'డ్రా'తో సరి

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) రెండో సెమీఫైనల్ తొలి అంచె పోరులో ఫలితం తేలలేదు. గురువారం గచ్చిబౌలి స్టేడియంలో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ), ఏటీకే మోహన్‌బగాన్ మధ్య జరిగిన మ్యాచ్ 0-0తో 'డ్రా'గా ముగిసింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లూ గోల్ సాధించడంలో విఫలమయ్యాయి. టోర్నీ ఆసాంతం అత్యుత్తమ డిఫెన్స్‌తో ఆకట్టుకున్న ఈ రెండు జట్లూ కీలక మ్యాచ్‌లోనూ డిఫెన్స్‌కే ప్రాధాన్యతనివ్వడంతో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. హైదరాబాద్ సొంతగడ్డపై ఆడిన ప్రయోజనాన్ని పొందలేకపోయింది. మోహన్‌బగాన్ ఆట గాడు పెట్రాటోస్ గోల్ చేసేందుకు చేరువగా వచ్చినా...హైదరాబాద్ కీపర్ గుర్మీత్ సింగ్ దానిని సమర్థంగా అడ్డుకోవడంలో సఫలమయ్యాడు. సెమీఫైనల్ రెండో అంచె పోరులో ఈ నెల 13న ఇరు జట్లు కోల్‌కతాలో తలపడతాయి. ఇందులో గెలిచిన టీమ్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.



ఖాజా శతక జోరు



- తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 255/4
- బోర్డర్-గావస్కర్ ట్రోఫీ చివరి టెస్టు

తొలి మూడు టెస్టులకు భిన్నంగా చివరి నాలుగో టెస్టు మొదలైంది. తొలి ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టిన జట్టు మొదటి రోజే ఆలౌట్ కాకపోవడం విశేషమైతే... ఒక బ్యాటర్ తొలి రోజే సెంచరీ సాధించడం మరో విశేషం. స్పిన్ పిచ్‌లపై చేతులెత్తేసిన బ్యాటర్లను చూసిన ఈ టెస్టు సిరీస్‌లో తొలిసారి బౌలర్లు కష్టపడ్డారు. బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై ఆఖరి టెస్టు పరుగుల మజా అందించనుంది. ఓపెనర్ ఉస్మాన్ ఖాజా అజేయ సెంచరీతో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలిరోజును సంతృప్తికరంగా ముగించింది.



అహ్మదాబాద్: తొలిరోజు ఆలౌట్. మూడో రోజు కల్లా ముగింపు! ఆస్ట్రేలియా ఆడినా... భారత్ ఇన్నింగ్స్ ఓపెన్ చేసినా... 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో ఇది షరామామూలే! కానీ ఆఖరి టెస్టు అలా మొదలవలేదు. మొతెరా వికెట్ బ్యాటర్లకు అవకాశమిచ్చింది. ఆలౌట్ కాదుకదా... కనీసం సగం వికెట్లు (5) అయినా ఆతిథ్య భారత బౌలర్లు పడగొట్టలేకపోయారు. ఇదే మరో నాలుగు రోజులు కొనసాగితే ఈ టెస్టు ఐదు రోజుల పాటు జరగడం ఖాయం! నాలుగో టెస్టులో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలిరోజు ఆటముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. ఓపెనర్ ఉస్మాన్ ఖాజా (251 బంతుల్లో 104 బ్యాటింగ్; 15 ఫోర్లు) అజేయ సెంచరీ సాధించాడు. భారత పేసర్ షమీ 2 వికెట్లు పడగొట్టగా... స్పిన్నర్లు అశ్విన్, జడేజాలకు చెరో వికెట్ దక్కింది. ఆట నిలిచే సమయానికి ఖాజాతో పాటు కామెరాన్ గ్రీన్ (49 బ్యాటింగ్; 8 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.

ఓపెనర్ల శుభారంభం

ఆస్ట్రేలియా ఓపెనర్లు ట్రవిస్ హెడ్ (44 బంతుల్లో 32; 7 ఫోర్లు), ఖాజా బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై యథేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. అనుభవజ్ఞులైన పేసర్లలో షమీ రివర్స్ స్వింగ్‌తో వైవిధ్యం కనబరిస్తే... ఉమేశ్ యాదవ్ నిరాశపరిచాడు. ఇతని బౌలింగ్‌లో హెడ్ వన్డేను తలపించే ఆట ఆడాడు. హెడ్ కొట్టిన 7 ఫోర్లలో అరడజను ఉమేశ్ బౌలింగ్‌లోనే బాదాడు. అయితే అంతకు ముందు ఉమేశ్ బౌలింగ్‌లోనే హెడ్ 7 పరుగుల వద్ద ఉన్నప్పుడు కీపర్ భరత్ సులువైన క్యాచ్ వదిలేయడం కూడా ఆసీస్‌కు కలిసొచ్చింది. తొలి వికెట్‌కు 61 పరుగులు జతయ్యాక హెడ్‌ను అవుట్ చేసిన అశ్విన్ ఓపెనింగ్ జోడీకి ముగింపు పలికాడు. తర్వాత లబుషేన్ (3)ను చక్కని డెలివరీతో షమీ క్లీన్ బౌల్డ్ చేశాడు. కెప్టెన్ స్మిత్ క్రీజులోకి రాగా... 75/2 స్కోరు వద్ద లంచ్‌బ్రేక్‌కు వెళ్లారు. అనంతరం రెండో సెషనైతే బౌలర్లకు ఏమాత్రం కలిసి రాలేదు. ఖాజా, స్మిత్ ఆతిథ్య బౌలర్లకు ఎలాంటి అవకాశమివ్వకుండా ఆట కొనసాగించారు.

ఖాజా అజేయ శతకం

మూడో వికెట్‌కు ఖాజా-స్మిత్ జోడీ అజేయంగా సాగడంతో వికెట్ పడకుండానే 149/2 స్కోరువద్ద రెండో సెషన్ ముగిసింది. వికెట్లు టపటపా రాలిన ఈ సిరీస్‌లో ఒక్క వికెట్ అయినా పడకుండా సెషన్ ముగియడం ఇదే తొలిసారి! అయితే ఆఖరి సెషన్ మొదలవగానే స్మిత్ (38; 3 ఫోర్లు) వికెట్‌ను జడేజా పడగొట్టడంతో 79 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికి హ్యాండ్స్‌కాంబ్ (17)ను షమీ అవుట్ చేశాడు. తర్వాత వచ్చిన కామెరాన్ గ్రీన్ చూడచక్కని బౌండరీలతో స్కోరు బోర్డును పరుగుపెట్టించాడు. అతని అండతో ఖాజా టెస్టుల్లో 14వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖరి 9 ఓవర్లలో ఆసీస్ వేగంగా పరుగులు సాధించడంతో 54 పరుగులు వచ్చాయి. వీరిద్దరు అబేధ్యమైన ఐదో వికెట్‌కు 85 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (సి) జడేజా (బి) అశ్విన్ 32; ఉస్మాన్ ఖాజా బ్యాటింగ్ 104; లబుషేన్ (బి) షమీ 3; స్మిత్ (బి) జడేజా 38; హ్యాండ్స్‌కాంబ్ (బి) షమీ 17; గ్రీన్ బ్యాటింగ్ 49; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (90 ఓవర్లలో 4 వికెట్లకు) 255. వికెట్ల పతనం:** 1-61, 2-72, 3-151, 4-170. **బౌలింగ్:** షమీ 17-2-65-2, ఉమేశ్ 15-2-58-0, అశ్విన్ 25-8-57-1, జడేజా 20-2-49-1, అక్షర్ 12-4-14-0, అయ్యర్ 1-0-2-0.


ఖాజా

మైదానంలో ప్రధానమంత్రులు

తొలి రోజు ఆటలో భారత్, ఆస్ట్రేలియా ప్రధానమంత్రులు నరేంద్ర మోదీ, ఆంథోనీ అల్బనీస్ '75 ఇయర్స్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ త్రూ క్రికెట్' అంటూ ప్రధాన ఆకర్షణగా మారారు. టెస్టు ఆరంభానికి ముందు వీరిద్దరు ప్రత్యేక వాహనంలో మైదానమంతా కలియతిరుగుతూ ప్రేక్షకులకు అభివాదం చేశారు. అనంతరం ఇరు ప్రధానులు తమ జట్ల కెప్టెన్లకు ప్రత్యేక 'క్యాప్'లను అందించగా, వేదికపై నలుగురూ చేతులు కలిపి నిలబడిన దృశ్యం హైలైట్‌గా నిలిచింది. తమ జట్ల ఆటగాళ్లతో కలిసి వీరిద్దరు జాతీయ గీతాలాపన చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన 'హాల్ ఆఫ్ ఫేమ్'ను ప్రారంభించిన అనంతరం మాజీ క్రికెటర్లు గావస్కర్, లక్ష్మణ్ తదితరులతో మోదీ సంభాషించారు. ప్రెసిడెంట్స్ బాక్స్ నుంచి ప్రధానులిద్దరూ కొద్ది సేపు టెస్టు మ్యాచ్ తొలి సెషన్‌ను వీక్షించగా...బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శులు రోజర్ బిన్నీ, జై షా జ్ఞాపికలు అందజేశారు. మ్యాచ్ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అలరించాయి. అయితే కఠినమైన భద్రతా నిబంధనల కారణంగా తొలి రోజు ఆశించిన స్థాయిలో రికార్డు సంఖ్యలో ప్రేక్షకులు మ్యాచ్‌కు హాజరు కాలేదు.

ముంబై 'హ్యాట్రిక్' విజయం

- 8 వికెట్లతో ఢిల్లీపై జయభేరి
- డబ్ల్యూపీఎల్



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ జోరుకు బ్రేకులేసిన ముంబై ఇండియన్స్ 'హ్యాట్రిక్' విజయం సాధించింది. గురువారం జరిగిన పోరులో సమష్టిగా చెలరేగిన ముంబై 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై అలవోక విజయం సాధించింది. ముంబై క్రికెటర్ హేలీ మాథ్యూస్ (3 వికెట్లు; 31 బంతుల్లో 32; 6 ఫోర్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 18 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (41 బంతుల్లో 43; 5 ఫోర్లు), జెమిమా రోడ్రిగ్స్ (18 బంతుల్లో 25; 3 ఫోర్లు) మినహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ పరుగులు చేయలేదు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సయిక ఇషాక్ (3/13), ఇసి వాంగ్ (3/10)ల ధాటికి హిట్టర్లు షఫాలీ వర్మ (2), క్యాప్సీ (6), మరిజన్ కప్ (2), జెస్ జొనసెన్ (2) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. తర్వాత మిడిలార్డర్‌ను హేలీ దెబ్బతీయడంతో ఢిల్లీ ఇక కోలుకోలేదు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ముంబై 15 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు యస్తిక భాటియా (32 బంతుల్లో 41; 8 ఫోర్లు), హేలీ తొలి వికెట్‌కు 65 పరుగులు జోడించారు. వాళ్లిద్దరు అవుటయ్యాక నట్ సీవర్ బ్రంట్ (19 బంతుల్లో 23 నాటౌట్; 4 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (11 నాటౌట్, 2 ఫోర్లు) మిగతా లాంఛనాన్ని పూర్తిచేశారు.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

బెంగళూరు X యూపీ వారియర్స్

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఇంగ్లండ్‌కు బంగ్లా షాక్

చట్టోగ్రామ్: టి20 వరల్డ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించింది. గురువారం జరిగిన తొలి టి20లో బంగ్లా 6 వికెట్లతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 156 పరుగులు చేసింది. జోస్ బట్లర్ (42 బంతుల్లో 67; 4 ఫోర్లు, 4 సిక్సర్లు), ఫిల్ సాల్ట్ (35 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. అనంతరం బంగ్లాదేశ్ 18 ఓవర్లలో 4 వికెట్లకు 158 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నజ్ముల్ హొస్సేన్ (30 బంతుల్లో 51; 8 ఫోర్లు), షకీబ్ అల్ హసన్ (24 బంతుల్లో 34 నాటౌట్; 6 ఫోర్లు) గెలిపించారు.

వెస్టిండీస్ 251 ఆలౌట్


హోల్డర్

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 251 పరుగులకు ఆలౌటైంది. జేసన్ హోల్డర్ (117 బంతుల్లో 81 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయ అర్ధ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఇతర బ్యాటర్లలో కైల్ మేయర్స్ (29), రోస్టన్ ఛేజ్ (28), జొషువా డ సిల్వ (26) కొన్ని పరుగులు జోడించగలిగారు. సఫారీ బౌలర్లలో కోయెట్జీ 3 వికెట్లు పడగొట్టగా...రబడ, హార్మర్ చెరో 2 వికెట్లు తీశారు. దక్షిణాఫ్రికాకు తొలి ఇన్నింగ్స్‌లో 69 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా వికెట్ కోల్పోకుండా 4 పరుగులు చేసింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 311/7తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ మొదటి ఇన్నింగ్స్‌లో 320 పరుగులకు ఆలౌటైంది.

శ్రీలంక 305/6


కుశాల్

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో గురువారం మొదలైన తొలి టెస్టులో శ్రీలంక శుభారంభం చేసింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి లంక తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 305 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (83 బంతుల్లో 87; 16 ఫోర్లు) దూకుడుగా ఆడగా, కెప్టెన్ దిముత్ కరుణరత్నే (87 బంతుల్లో 50; 7 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీ నమోదు చేశాడు. ఏంజెలో మాథ్యూస్ (47), ధనంజయ డి సిల్వ (39 బ్యాటింగ్), దినేశ్ చండిమాల్ (39) కీలక ఇన్నింగ్స్‌లతో రాణించారు. మెండిస్, కరుణరత్నే రెండో వికెట్‌కు 137 పరుగులు జోడించడం విశేషం. ఈ మ్యాచ్‌లో టెస్టుల్లో 7 వేల పరుగులు పూర్తి చేసుకున్న మాథ్యూస్...ఈ ఘనత సాధించిన మూడో లంక క్రికెటర్‌గా నిలిచాడు. కివీస్ బౌలర్లలో సౌతీ 3 వికెట్లు పడగొట్టాడు.

క్లుప్తంగా...

హిందూస్థాన్ షిప్‌యార్డుకు భారీ కార్గో నౌక

- మరమ్మతుల కోసం విశాఖ చేరుకున్న 229 మీటర్ల పొడవైన ఎంవీ విశ్వవిజయ్



ఎంవీ విశ్వవిజయ్ కార్గో షిప్

సాక్షి, విశాఖపట్నం: వరుస విజయాలతో దూసుకుపోతున్న హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ మరో బెంచ్‌మార్క్‌ని సెట్ చేసింది. 1971లో డ్రైడాక్‌ని హెచ్‌ఎస్‌ఎల్‌లో ప్రారంభించిన తర్వాత మొదటి సారిగా భారీ కార్గోషిప్ డాకింగ్ చేశారు. 80,312 డెడ్‌వెయిట్ టన్నేజ్ బరువైన భారీ ఎంవీ విశ్వవిజయ్ షిప్ షిప్‌యార్డుకి మరమ్మతుల కోసం వచ్చింది. 229 మీటర్ల పొడవు, 32.24 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ నౌకలో మొత్తం ఏడు కార్గో హోల్డ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా 95,149 క్యూబిక్ మీటర్ల కంటైనర్లని తీసుకెళ్లగలవు. ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన ఈ ఎంవీ విశ్వవిజయ్‌కు నిర్ణీత సమయంలో మరమ్మతులు పూర్తి చేసి అప్పగిస్తామని హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ హేమంత్ ఖత్రీ తెలిపారు.

భారీ భద్రత మధ్య చిత్తూరుకు అల్-ఖైదా ఉగ్రవాదులు

చిత్తూరు అర్బన్: న్యాయస్థానాల సముదాయాల్లో బాంబులు పేల్చిన కేసుల్లో ఐదుగురు అల్-ఖైదా ఉగ్రవాదులను అత్యంత భారీ భద్రత నడుమ పోలీసులు గురువారం రాత్రి చిత్తూరుకు తీసుకొచ్చారు. 2016 ఏప్రిల్ 7వ తేదీన చిత్తూరులోని న్యాయస్థానాల సముదాయంలో పేలుడు జరిగింది. దీంతో పాటు అదే ఏడాది నెల్లూరు, కేరళలోని కొల్లం, మాలాప్పురం, కర్ణాటకలోని మైసూరు ప్రాంతాల్లో ఉన్న న్యాయస్థానాల సముదాయాల్లో పేలుళ్లు సృష్టించిన కేసులో అల్-ఖైదా ఉగ్రవాద సంస్థకు చెందిన అబ్బాస్ అలీ, దావూద్ కరీమ్, షంషున్ కరీమ్ రాజా, మహ్మద్ అయుబ్-అలీ, షంషీర్ అనే ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు అరెస్టు చేశారు. ప్రస్తుతం బెంగళూరు సెంట్రల్ జైలులో ఉన్న ఐదుగురు నిందితులను చిత్తూరు న్యాయస్థానంలో హాజరుపరచాల్సి ఉంది. దీంతో 40 మంది పోలీసుల భద్రత నడుమ ఏపీ, కర్ణాటక, తమిళనాడు డీజీపీల స్వీయ పర్యవేక్షణలో ఐదుగురు ఉగ్రవాదులను బెంగళూరు నుంచి తీసుకొచ్చారు. శుక్రవారం వీళ్లను చిత్తూరులోని న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టి.. అటు నుంచి మళ్లీ బెంగళూరుకు తరలించనున్నారు. ఈ నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు భద్రత పెంచడంతో పాటు నిఘా విభాగాలను సైతం అప్రమత్తం చేశారు.



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 64వ డివిజన్‌లో మహిళల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గడప గడపకు మన ప్రభుత్వం



కాకినాడ 27వ డివిజన్‌లో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం 46వ డివిజన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

'కాగ్' నివేదికలోనూ..

'స్కిల్' సిత్రాలు

ప్రాజెక్టు రూ.370 కోట్లు.. చూపింది రూ.3,300 కోట్లు

ప్రభుత్వ వాటా 10శాతం కింద రూ.37 కోట్లు అడ్వాన్స్ ఇవ్వాలి

కానీ, విడుదల చేసింది రూ.370 కోట్లు

- అలా రూ.333 కోట్లు కొల్లగొట్టారు
- దీనికి రూ.22 కోట్ల వడ్డీ నష్టం అదనం
- వెరసి ఖజానాకు రూ.355 కోట్ల మేర గండి
- ప్రాజెక్టులో కాలేజీలకు భాగస్వామ్యమే లేదు
- ఇదీ చంద్రబాబు ప్రభుత్వ దోపిడీ 'స్కిల్'

సాక్షి, అమరావతి : టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ముసుగులో సాగిన కుంభకోణాన్ని రాజ్యాంగ ప్రతిపత్తిగల కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు చెందిన ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కూడా నిగ్గుతేల్చింది. యువతకు నైపుణ్యాభివృద్ధి ముసుగులో సీమెన్స్ కంపెనీ పేరిట చంద్రబాబు ప్రభుత్వం నడిపించిన ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలను కడిగిపారేసింది. 2015 నుంచి 2018 వరకు సాగిన ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టు రికార్డులను కాగ్ 2018 మే 29 నుంచి జూన్ 22 వరకు పరిశీలించింది. అందులో రూ.355 కోట్ల మేర ఖజానాకు గండిపడిందని తేల్చింది. కాగ్ ప్రధానంగా లేవనెత్తిన అభ్యంతరాలివే..



రూ.370 కోట్ల ప్రాజెక్టును రూ.3,300 కోట్లుగా..

సీమెన్స్ కంపెనీ పేరిట ప్రాజెక్టు నివేదిక రూపకల్పనలోనే చంద్రబాబు ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. ఆ ప్రాజెక్టులో పేర్కొన్న వివరాల ప్రకారం ఆ ఒప్పందం విలువ రూ.370కోట్లు మాత్రమే. ప్రైవేటు కంపెనీ సరఫరా చేస్తామని చెప్పిన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర అంశాలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను పరిశీలిస్తే ఆ ప్రాజెక్టు విలువ రూ.370 కోట్లుగానే లెక్కతేలిందని పేర్కొంది. కానీ, అది రూ.3,300 కోట్ల ప్రాజెక్టుగా భ్రమింపజేసేలా అంచనాలను అమాంతంగా పెంచేసి నివేదికను రూపొందించారు. దాంతోనే ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి ఆస్కారం ఏర్పడింది.

ఇంతవరకూ లెక్కాపత్రం లేదు

ఇక ప్రాజెక్టు ఒప్పందంలో భాగంగా సరఫరా చేసిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ విలువ ఎంత అన్నది కనీసం నిర్ధారించలేదు. నిపుణులైన ఏజెన్సీలతో నిర్ధారించాలని 2017, నవంబరు 25న నిర్వహించిన ఏపీఎస్ఎస్‌డీసీ బోర్డు సమావేశంలో నిర్ణయించారు. కానీ, ఆ మేరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. డిజైన్‌టెక్ కంపెనీ సరఫరా చేసిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కొనుగోలు ఆర్డర్ కాపీని ఆడిట్ కోసం అందుబాటులో ఉంచకపోవడం గమనార్హం.

ఖజానాకు రూ.355 కోట్ల గండి

నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టు రూపకల్పన, నిధుల విడుదలతో మొత్తం రూ.355 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. ప్రాజెక్టులో పేర్కొన్న వివరాల ప్రకారం ప్రాజెక్టు విలువలో ప్రభుత్వం 10శాతం నిధులు కేటాయించాలి. అంటే, ప్రాజెక్టు వాస్తవ విలువ రూ.370 కోట్లుగా చూపించి ఉంటే.. ప్రభుత్వం రూ.37 కోట్లు మాత్రమే విడుదల చేయాలి. కానీ.. అంచనాలను అమాంతం పెంచేసి రూ.3,300 కోట్లుగా చూపించి.. ప్రభుత్వ వాటా 10 శాతంతో పాటు జీఎస్టీ, ఇతర అంశాలను కలుపుతూ ఏకంగా రూ.370 కోట్లు విడుదల చేశారు. అలా రూ.333 కోట్లు కొల్లగొట్టారు. అంతేకాదు, ఒక ఏడాది ముందే.. అది కూడా ప్రాజెక్టు మొదలుకాకుండానే ప్రభుత్వం నిధులు విడుదల చేయడం గమనార్హం. దాంతో రూ.22 కోట్ల వడ్డీ రూపంలో రావాల్సిన ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది. వెరసి ప్రభుత్వ ఖజానాకు రూ.355 కోట్ల నష్టం వాటిల్లింది.

నకిలీ ఇన్వాయిస్‌లతో రూ.241కోట్లు కొల్లగొట్టారు

ఇక షెల్ కంపెనీలు సరఫరా చేసినట్లుగా నకిలీ ఇన్వాయిస్‌లు చూపించి కనికట్టు చేశారు. ఆ విధంగా రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలించారు. అక్కడ నుంచి హవాలా మార్గంలో టీడీపీ పెద్దలకు ఆ నిధులు చేరాయని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

ఒప్పందంలో కాలేజీలకు భాగస్వామ్యం లేదు

అలాగే, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం చేసుకున్నామని చెబుతున్న ఈ ఒప్పందంలో సంబంధిత కాలేజీలను భాగస్వాములను చేయనేలేదు. దాంతో ఆ కాలేజీలకు ఎలాంటి పాత్ర లేకుండాపోయింది. వాటిల్లో నెలకొల్పిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో ఏర్పాటుచేసిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ విలువ ఎంతన్నది మదింపు చేయనేలేదు. ఆ కాలేజీల యాజమాన్యాలకు కూడా ఆ విషయంపై ఎలాంటి అవగాహనలేదు.

తిరుపతి జూ పార్క్‌కు తరలిన పులి కూనలు

ఆత్మకూరు రూరల్: నంద్యాల జిల్లా ఆత్మకూరు అటవీశాఖ కార్యాలయంలో ఉన్న నాలుగు పులి కూనలను గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ప్రత్యేక వాహనంలో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర జువాలాజికల్ పార్క్‌కు తరలించారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు నాగార్జున సాగర్-శ్రీశైలం ఫీల్డ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలి పారు. తల్లితో పులి కూనలను కలిపేందుకు నాలుగు రోజులపాటు అటవీ శాఖ అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో పులి కూనల సంరక్షణను దృష్టిలో ఉంచుకుని తిరుపతి జూ పార్క్‌కు తరలించారు.

పులి కూనల ఆరోగ్యం భేష్

తల్లి పులి బతికే ఉందని నిర్ధారణ కావడం, పులి కూనలు కూడా ఆరోగ్యంగా చలాకీగా ఉండటం సంతోషకరమని నాగార్జునసాగర్-శ్రీశైలం ఫీల్డ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలో జూపార్క్‌కు అనుబంధంగా ఉన్న అడవిలో పులి కూనలను పెంచుతామన్నారు. కొంత వయసు వచ్చాక వేటలో తర్ఫీదునిచ్చి తిరిగి అడవిలో ప్రవేశ పెడతామని చెప్పారు. ఇదిలావుండగా.. పులి పాదముద్రలు కనిపించాయని కొందరు చెప్పగా.. ఆ ప్రదేశానికి గురువారం తెల్లవారుజామున పులి కూనలను తరలించారు. కూనల అరుపులతో కూడిన రికార్డింగ్స్‌ను వినిపిస్తూ.. తెల్లవారే వరకు ఎదురు చూసినా తల్లి పులి జాడ కనిపించలేదు.



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్క బోనులో పులి కూనలు

సాంబ అ'ధర'హో..!

- ధాన్యం ధరలకు రెక్కలు
- బియ్యానిదీ అదే తోవ
- ఖరీఫ్‌లో తగ్గిన పంట విస్తీర్ణం

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా సన్న రకం ధాన్యానికి రెక్కలు వచ్చాయి. ప్రధానంగా సాంబ ధాన్యాన్ని మిల్లర్లు ఎగబడి అధిక ధర వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పండిన కొద్దిపాటి ధాన్యాన్ని తమ అవసరాలకు నిల్వ చేసుకున్న రైతులు అమ్మేందుకు ముందుకు రావడం లేదు. దీనిని గమనించిన మిల్లర్లు రైతులను ఊరించే విధంగా ధర ఆశ చూపుతున్నారు. వాస్తవానికి గ్రేడ్ 'ఏ' రకంగా నిర్ధారించిన సాంబ క్వింటా బస్తా ధర 1648 రూపాయలుగా ఉంది. అయితే మిల్లర్లు కేవలం 80 కేజీల బస్తాను రూ. 2 వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరలు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని మిల్లర్లు, వ్యాపారులు అంటున్నారు. అలాగే సన్న రకాలుగా పిలిచే సోనా మసూరి, శ్రీకాకుళం సన్నాలు, ఆర్ఎస్ఆర్ వంటి ధాన్యం ధరలు కూడా అధికంగానే ఉన్నాయి.

భారీగా తగ్గిన విస్తీర్ణం

జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల ఎకరాల్లో వరిని ఖరీఫ్‌లో రైతులు సాగు చేయగా దీంట్లో కేవలం 80 వేల ఎకరాల్లోనే సాంబతో పాటు ఇతర సన్న రకాలు వేశారు. 2021లో చూస్తే 1.30 ఎకరాల వరకూ సాగు చేశారు. అధిక శాతం ప్రభుత్వం కొనుగోలు చేస్తామన్న రకాలనే రైతులు పండించారు. అలాగే సాంబతో పాటు ఇతర సన్న రకాలకు తెగుళ్లు, పురుగు బెడద అధికంగా ఉండటంతో రైతులు ఈసారి అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో సన్న రకాల ధాన్యం దిగుబడి బాగా తగ్గింది.

అమాంతంగా పెరిగిన బియ్యం ధరలు

బియ్యం ధరలు ఆమాంతంగా పెరిగాయి. సన్నాల్లో సాంబ (సీసీ) బియ్యం ధర ఎక్కువగా ఉంది. నరసన్నపేటలో జనవరిలో 25 కేజీల బియ్యం రూ. 1200 ఉండగా ప్రస్తుతం రూ. 1380 పలుకుతుంది. ఈ నెలాఖరుకల్లా రూ. 1500 వరకూ పెరగవచ్చని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు జోక్యం చేసుకొని సీసీ బియ్యం ధరలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సాంబ వరి చేను (ఫైల్)

సన్న రకాలు దొరకడం లేదు

జిల్లా వ్యాప్తంగా సన్న రకాల ధాన్యం సాగు విస్తీర్ణం తగ్గింది. అలాగే సాంబకు తెల్లదోమ అధికంగా సోకడంతో దిగుబడి పడిపోయింది. పండిన కొద్దిపాటి ధాన్యాన్ని రైతులు తమ అవసరాలకు ఉంచుకున్నారు. దీంతో ఈ రకం ధాన్యం అందుబాటులో లేదు. ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేస్తున్నాం. వచ్చే సీజన్‌లో అయినా రైతులు అన్ని రకాలు సమానంగా పండించాలి. సన్న రకాలు వేయాలి.

– తంగుడు జోగారావు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు, నరసన్నపేట

'స్కిల్' కుంభకోణంలో శ్రీకాంత్ అర్జాను విచారించిన సీఐడీ

- నేడు కూడా విచారణ
- నిధుల విడుదల వ్యవహారంపైనే ప్రధానంగా ప్రశ్నలు

సాక్షి, అమరావతి : చంద్రబాబు ప్రభుత్వంలో జరిగిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో రిటైర్డ్ అధికారి శ్రీకాంత్ అర్జాను సీఐడీ అధికారులు గురువారం విచారించారు. గతంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీగా పనిచేసిన ఆయనకు సీఐడీ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. దాంతో ఆయన గురువారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. ముందుగా ఆయన్ని తాడేపల్లిలోని ఓ కార్యాలయంలో సుదీర్ఘంగా విచారించారు. అనంతరం ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయానికి అధికారులు తీసుకువెళ్లారు. అక్కడ కూడా పలు అంశాలపై విచారించారు. ప్రధానంగా సీమెన్స్, డిజైన్‌టెక్ కంపెనీల పేరిట ప్రభుత్వ నిధుల విడుదల వ్యవహారంపై ఆయన్ని ప్రశ్నించినట్టు సమాచారం. ఆయన ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీగా రాకముందే నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేశారు. దీనిపై ప్రాథమిక ఆధారాలు కూడా లభించాయి. ఈ వ్యవహారంపై విచారణ చేస్తున్న మంత్రివర్గ ఉపసంఘం ఆ సమయంలో ఎండీగా ఉన్న శ్రీకాంత్ అర్జాను నివేదిక కోరింది. సక్రమంగానే నిధులు విడుదల చేసినట్టు ఆయన నివేదిక ఇచ్చారు. అలా ఎందుకు నివేదిక ఇవ్వాల్సి వచ్చిందనే కోణంలో సీఐడీ అధికారులు ఆయన్ని పలు కోణాల్లో విచారించినట్టు తెలిసింది. ఆయన్ని శుక్రవారం కూడా విచారించనున్నారు.

జీవీఎస్ భాస్కర్‌కు నోటీసులు ఇచ్చి విచారించండి

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో సీమెన్స్ కంపెనీ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్‌కు సెక్షన్ 41ఏ కింద నోటీసు ఇచ్చి విచారించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఆయన్ని సీఐడీ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై గురువారం విజయవాడ తీసుకువచ్చారు. విజయవాడలోని ప్రభుత్వ సర్వజనీన ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం జీవీఎస్ భాస్కర్‌ను సెక్షన్ 41ఏ కింద నోటీసు జారీ చేసి విచారించాలని సీఐడీ అధికారులను ఆదేశించింది.



జీవీఎస్ భాస్కర్‌ను కోర్టుకు తీసుకెళుతున్న దృశ్యం

వైభవంగా రంగడి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- రంగనాథుడి నామస్మరణతో పులకించిన సింహపురి
- ఉత్సవాన్ని ప్రారంభించిన నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు

నెల్లూరు(బృందావనం): రంగడి రథోత్సవంతో సింహపురి పులకించింది. ఉత్తర శ్రీరంగంగా భాసిల్లుతున్న తల్పగిరి దివ్యక్షేత్రం జై రంగ.. జైజై రంగ.. రంగనాథా రక్షమాం.. రంగనాథా పాహిమాం.. గోవిందా.. గోవిందా నామస్మరణతో మార్మోగింది. నెల్లూరులోని పినాకిని తీరాన రంగనాయకులపేటలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవం గురువారం ఆద్యంతం నయనానందకరంగా భక్తుల కేరింతల నడుమ సుమారు ఐదుగంటలపాటు సాగింది. విశేష పుష్పాలంకరణలతో, శోభాయమానంగా తీర్చిదిద్దిన తిరుత్తేరుపై ఉభయదేవేరులతో కొలువైన రంగనాథుడిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజనంతో గోపురం వీధి, రంగనాయకులపేట, రైలువీధి, సంతపేట మాడవీధులు కిటకిటలాడాయి. రథోత్సవాన్ని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ ప్రారంభించారు. రథోత్సవం తూర్పు రాజగోపురం సమీపంలో ఉన్న రథమండపం నుంచి ఉత్తరమాడవీధి, తూర్పున ఉన్న గోపురంవీధి రైల్వేగేట్ వరకు.. అక్కడి నుంచి తిరిగి గోపురంవీధి, రంగనాయకులపేట, సంతపేట, నాలుగుకాళ్ల మండపం వరకు, అక్కడి నుంచి వెనుదిరిగి స్వామి సన్నిధి వద్ద ఉన్న రథమండపం వరకు వేడుకగా సాగింది.



గోపురం వీధిలో జరుగుతున్న రథోత్సవం

హెచ్3ఎన్2పై ఆందోళన వద్దు

- రాష్ట్రంలో ఈ ఫ్లూ ప్రభావం పెద్దగా లేదు
- ముక్కు నుంచి గొంతు మధ్యలోనే దీని ఎఫెక్ట్
- రెసిస్టెన్స్ పవర్ తక్కువగా ఉన్న కొందరిలో న్యుమోనియా
- జ్వరం, జలుబు వస్తే పారాసిటమాల్ వాడితే చాలు
- అనవసరంగా యాంటీబయోటిక్స్ వాడొద్దు
- డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్

సాక్షి, అమరావతి : కొత్త రకం ఫ్లూ హెచ్3ఎన్2 ప్రభావం రాష్ట్రంలో పెద్దగా లేదని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. అనవసరంగా ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. విజయవాడలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

- ▲ ముక్కు నుంచి గొంతు మధ్యలోనే ఈ ఫ్లూ వైరస్ ప్రభావం ఉంటుంది.
- ▲ కరోనా వైరస్‌లాగా ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయే స్వభావం దీనికి లేదు.
- ▲ రెసిస్టెన్స్ పవర్ తక్కువగా ఉన్న కొందరిలో ఊపిరితిత్తుల్లోకి చేరి న్యుమోనియాకు దారితీస్తుంది.
- ▲ ప్రస్తుతం ఫ్లూ చిన్న పిల్లలు, వృద్ధుల్లో కొంతమేర ప్రభావం చూపుతుంది. దీనిని కనిపెట్టడం చాలా సులభం.
- ▲ ప్రభుత్వాస్పత్రుల్లో ఆర్టీపీసీఆర్ టెస్టులు ద్వారా కేసులు గుర్తిస్తున్నాం
- ▲ తిరుపతి స్విమ్స్‌లో తరచూ వైరస్‌లపై సీక్వెన్సింగ్ చేస్తుంటాం.. ఇలా గత జనవరిలో 12 కేసులు, ఫిబ్రవరిలో 9 హెచ్3ఎన్2 కేసులు నమోదయ్యాయి.
- ▲ దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలున్న వారు జాగ్రత్తలు తీసుకోవాలి. ▲ వైరల్ జ్వరాలకు యాంటిబయోటిక్స్ పనిచేయవు. కాబట్టి జ్వరం వచ్చిందని ప్రజలు అనవసరంగా వాటిని వాడొద్దు.



మాట్లాడుతున్న డీఎంఈ వినోద్, ఆయనకు ఇరువైపులా డాక్టర్లు రఘు, సుధాకర్

ఆస్పత్రుల్లో చేరేవారు చాలా అరుదు

ఇక జ్వరాలు, ఇతర లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్నవారిలో ప్రతి వెయ్యి ఓపీల్లో 0.1 శాతం సందర్భాల్లో అడ్మిషన్ అవసరం అవుతోందని విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, జనరల్ మెడిసిన్ వైద్యుడు డా. సుధాకర్ చెప్పారు. ఎవరికైనా జ్వరం, జలుబు వచ్చినట్లయితే పారాసిటమాల్, దగ్గు ఉన్నట్లైతే సిట్రిజీన్ మాత్ర వాడితే సరిపోతుందన్నారు. అదే విధంగా గొంతు ఇన్‌ఫెక్షన్ ఉంటే వేడినీళ్లు తాగడంతో పాటు, విక్స్ బిళ్లలు వాడాలన్నారు. మరోవైపు.. గుంటూరు జ్వరాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది సీజన్ మారేప్పుడు జ్వరాలు వస్తుంటాయన్నారు. వీటికి ఇంటి వద్దే జాగ్రత్తలు తీసుకుంటే చాలన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆ కాలేజీల్లో అడ్మిషన్లు

కాగా.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐదు కొత్త వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని డీఎంఈ వినోద్ తెలిపారు. విజయనగరం వైద్య కళాశాలకు ఇప్పటికే అనుమతులు లభించాయని.. మిగిలిన నాలుగు కళాశాలలకు అనుమతులు వస్తాయని భావిస్తున్నామన్నారు. ఏడాదికి మూడు నుంచి నాలుగు వైద్య కళాశాలలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళికలు రచించామన్నారు. అలాగే, ఖాళీ అయిన 246 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఎన్నికల కోడ్ ముగియగానే భర్తీ చేస్తామని.. సీనియర్ రెసిడెంట్‌ల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వినోద్ చెప్పారు.

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో అరుదైన కాన్పు

తల్లీబిడ్డ క్షేమం



క్షేమంగా ఉన్న తల్లీబిడ్డతో వైద్యుల బృందం

తిరుపతి తుడా: స్థానిక ప్రసూతి ఆస్పత్రిలో వైద్యుల బృందం అరుదైన కాన్పు చేసి తల్లీబిడ్డను రక్షించారు. చిత్తూరు జిల్లా, గంగాధరనెల్లూరుకు చెందిన గర్భిణి ఏ.కుమారి (52) మూడు నెలలుగా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. బహిస్టు ఆగిన దశలో చెన్నైలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఐవీఎఫ్ ద్వారా ఆమె గర్భం దాల్చారు. అక్కడ ఖర్చు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను తిరుపతి ప్రసూతి ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె డయాబెటిస్, రక్తపోటు, మిక్స్‌డ్ కనెక్టివ్ టిష్యూ డిజార్డర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆమెకు కాన్పు చేయడం వైద్యులకు సవాల్‌గా మారింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి సూచనలు మేరకు ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ కె.మాధవి ఆధ్వర్యంలో మెరుగైన చికిత్స అందించారు. సుమారు మూడు లక్షలకు పైగా ఖర్చయ్యే చికిత్సను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిచారు. బుధవారం అర్ధరాత్రి ఆమెకు అత్యవసర సిజేరియన్ ద్వారా ప్రసవం చేసి తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడారు. వైద్యం అందించిన వారిలో డాక్టర్ బాలాజీనాయక్, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 23 వరకు అభిషేకాలు నిలుపుదల

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని గురువారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు స్వామివారి గర్భాలయ ఆర్జిత అభిషేకాలు, సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేశామని దేవస్థానం ఈవో లవన్న విలేకరులకు తెలిపారు. అమ్మవారి అంతరాలయంలో కుంకుమార్చన కూడా నిలుపుదల చేసి అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వామి, అమ్మవార్ల కల్యాణాలు యథావిధిగా జరిపిస్తామని పేర్కొన్నారు.

రోజుకు నాలుగు విడతల్లో మల్లన్న స్పర్శ దర్శనం

శ్రీశైలంలో దర్శన వేళలను కూడా మార్పు చేశారు. గురువారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు నిర్దిష్ట వేళల్లో నాలుగు విడతలుగా భక్తులకు స్వామివారి స్పర్శ దర్శనానికి అవకాశం కల్పించారు. స్పర్శ దర్శనం టికెట్ రుసుం రూ.500గా నిర్ణయించారు. ఒక్కో విడతలో 1,500 టికెట్లు మాత్రమే ఇవ్వనున్నారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు భక్తులందరికీ అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నారు.



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943